RNI.No. APTEL/2014/57702
ESTD: 1999
www.voodayam.com
Postal Regd. No. GTR/117/2025-27





# వుదయం




గుంటూరు | 06-03-2026 శుక్రవారం | సంపుటి : 12 | సంచిక : 370 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Follow us on

# సంతానోత్పత్తి రేటు 2.1% ఉంటే సుస్థిర ప్రగతి

- పాపులేషన్ మేనేజ్‌మెంట్ కొత్త పాలసీ..
- ఐదు అంచెల లైఫ్ సైకిల్ విధానాన్ని అమలు చేయాలి
- పిల్లలు లేక ఫెర్టిలిటీ సమస్యలతో బాధపడేవారిని ప్రభుత్వం ఆదుకుంటుంది
- మహిళల రక్షణ కోసం షీ క్యాబ్స్
- శాసనసభలో సీఎం చంద్రబాబు ప్రకటన



**అమరావతి :**

ఏపీ శాసనసభలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఏపీకి అత్యంత కీలకమైన పాలసీని ఇవాళ శాసనసభలో ప్రకటిస్తున్నామన్నారు సీఎం. ఇప్పటి వరకు ఫ్యామిలీ ప్లానింగ్‌కు ప్రాధాన్యం ఇచ్చామని.. ఇకపై పాపులేషన్ కేర్ వైపు దృష్టి సారించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం డ్రాఫ్ట్ పాలసీని శాసనసభలో ప్రవేశపెట్టి ప్రజల ముందు ఉంచుతున్నామని వివరించారు. దీనిపై నెల రోజుల పాటు విస్తృత చర్చ జరగాలని కోరుతున్నామని సీఎం తెలిపారు. జపాన్, దక్షిణ కొరియా, ఇటలీ లాంటి దేశాల్లో ఫెర్టిలిటీ రేట్ తగ్గుతోందని.. భారత్‌తో పాటు ఏపీ లాంటి రాష్ట్రాల్లోనూ పరిస్థితే నెలకొందని వెల్లడించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో టోటల్ ఫెర్టిలిటీ రేట్ 1.5గా ఉందని.. 1993లో ఇది 3.0గా నమోదైందని సీఎం వివరించారు. టీఎఫ్ఆర్ వేగంగా తగ్గితే పని చేసే వయస్సులో ఉన్నవారి సంఖ్య గణనీయంగా తగ్గి, ఆర్థిక వృద్ధి మందగిస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని చెప్పారు. 2023 లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏటా 6.70 లక్షల జననాలు నమోదవుతున్నాయని తెలిపారు. ఇలాగే కొనసాగితే 2047 నాటికి జనాభాలో 23 శాతం మంది వృద్ధులు ఉంటారని అన్నారు. మహిళల లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ ప్రస్తుతం 31 శాతంగానే ఉంటుందని.. ఇది 59 శాతానికి చేరితే రాష్ట్ర జీఎస్‌డీపీ 15 శాతం పెరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు.

### టీనేజి గర్భధారణలను 3 శాతం కంటే తక్కువకు..

పాపులేషన్ మేనేజ్‌మెంట్ కోసం ఐదు అంచెల లైఫ్ సైకిల్ విధానాన్ని అమలు చేయాల్సి ఉందన్నారు సీఎం. మాతృత్వం, శక్తి, క్షేమం, నైపుణ్యం, సంజీవని లాంటివి ఐదు పిల్లర్లుగా పని చేస్తాయన్నారు. మహిళల గర్భధారణ నుంచి వృద్ధాప్యం వరకు ప్రతి దశలో ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. పిల్లలు లేక ఫెర్టిలిటీ సమస్యలతో బాధపడేవారిని ప్రభుత్వం ఆదుకుంటుందని.. మాతృత్వ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసి, సబ్సిడీపై పీపీపీ మోడల్‌లో ఐవీఎఫ్ సేవలు అందించాలని యోచిస్తున్నామని అన్నారు. సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించడం ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ప్రస్తుతం 8.8 శాతంగా ఉన్న టీనేజి గర్భధారణలను 3 శాతం కంటే తక్కువకు తగ్గించే చర్యలు చేపడుతున్నామని అన్నారు.

### విశాఖపట్నంలో రూ.172 కోట్లతో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నిర్మాణం

50 మంది చిన్నారులు ఉన్న చోట చైల్డ్ కేర్ సెంటర్లు, పింక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు సీఎం తెలిపారు. మహిళల రక్షణ కోసం షీ క్యాబ్స్ అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నామన్నారు. విశాఖపట్నంలో రూ.172 కోట్లతో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. మహిళా ఉద్యోగులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాల్లో కొత్త వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. మూడో సంతానం, ఆపై జననాలకు తల్లులకు 12 నెలల పేరెంటల్ లీవ్, తండ్రులకు 2 నెలల పెటర్నల్ లీవ్ ఇవ్వాలని ఆలోచిస్తున్నామని అన్నారు. త్వరలో 'తల్లిదండ్రుల సమాన బాధ్యత' పేరుతో కుటుంబ బాధ్యతలు పంచుకోవడంపై అవగాహన క్యాంపెయిన్ నిర్వహిస్తామని సీఎం తెలిపారు.

### ఏపీలో వృద్ధుల జనాభా 23 శాతం

2047 నాటికి ఏపీలో వృద్ధుల జనాభా 23 శాతం ఉంటుందని అంచనా వేస్తూ, ప్రతి జిల్లాలో వృద్ధుల సంరక్షణకు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు సీఎం. 175 సీహెచ్‌సీలలో రెండు వారాలకు ఒకసారి ప్రత్యేక క్లినిక్ నిర్వహిస్తామని తెలిపారు. సిల్వర్ స్కిల్స్ రిజిస్ట్రీ ద్వారా 50,000 రిటైర్డ్ ప్రొఫెషనల్స్‌ను మెంటరింగ్‌లో భాగం చేస్తామన్నారు. రిటైర్మెంట్‌కు ముందే ఉద్యోగులకు 15 రోజుల వెల్‌నెస్ లీవ్, రూ.50,000 ఆరోగ్య నిధి అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## ఏపీ హోం మంత్రి అనితకు అస్వస్థత

**అమరావతి:**

ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత అసెంబ్లీలో అస్వస్థతకు గురయ్యారు. పరీక్షించిన వైద్యులు బీపీ ఎక్కువగా ఉన్నట్లు నిర్ధరించారు. అక్కడి నుంచి ఆమె చికిత్స కోసం విజయవాడ ఆస్పత్రికి వెళ్లారు. అనంతరం తన ఆరోగ్యం బాగానే ఉన్నట్లు హోం మంత్రి అనిత వెల్లడించారు. అలసట కారణంగా చిన్న ఇబ్బంది కలిగిందని, ఎవరూ ఆందోళన చెందవద్దని కోరారు.



## అసెంబ్లీకి గైర్హాజరవడం సబబు కాదు: అయ్యన్న పాత్రుడు

**అమరావతి:**

ప్రజా సమస్యల పరిష్కార వేదికైన అసెంబ్లీకి గైర్హాజరవడం సబబు కాదని శాసనసభాపతి అయ్యన్న పాత్రుడు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికే ఎమ్మెల్యేలను ఎన్నుకుంటారని ఆయన వ్యాఖ్యానించారు. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో మీడియాతో అయ్యన్నపాత్రుడు చిట్‌చాట్‌గా మాట్లాడారు. అసెంబ్లీలో ప్రతిపక్షం, పాలకపక్షం ఉంటేనే బాగుంటుందన్నారు. ''వైకాపా సభ్యులకు నోటీసులు ఇవ్వాలంటే సమయం కావాలి. అనర్హత వేటు అంశం ఏపీలో విజయవంతమైతే దేశమంతా అలాగే జరుగుతుంది. గవర్నర్ ప్రసంగం రోజు వస్తే హాజరుగా పరిగణించాలనే నిబంధన ఎక్కడిది? ఆ రోజు వచ్చినా హాజరుగా పరిగణించరు. నిబంధనలను కాదని, అడ్డగోలుగా వాదించేవారిని ఏమనాలి? మాజీ సీఎంగా దక్కాల్సిన అన్ని మర్యాదలు జగన్‌కు లభిస్తున్నాయి. అప్పట్లో అధికార– ప్రతిపక్ష సభ్యులు పోరాడినా బయట స్నేహంగా ఉండేవారు. ఇప్పుడు ఆ సంస్కృతి పోయి విరోధుల్లా తయారవుతున్నారు. శాసనమండలి అంటే పెద్దల సభగా, పెద్ద ఆలోచనలు ఉన్న వారితో ఉండేది. పెద్ద ఆలోచనలు లేనివారు ఆ సభలో ఉంటే ఎలా ఉంటుందో ఇప్పుడు చూస్తున్నాం'' అని అయ్యన్న పాత్రుడు అన్నారు.



## ఘనంగా అర్జున్ తెందూల్కర్ వివాహం

**వుదయం ఇంటర్ నెట్ డెస్క్ :**

సచిన్ తెందూల్కర్ తనయుడు అర్జున్ తెందూల్కర్ వివాహం గురువారం ముంబయిలో ఘనంగా జరిగింది. అర్జున్ తన స్నేహితురాలు సానియా చందోక్‌ను వివాహం చేసుకున్నాడు. ఆమె ముంబయికి చెందిన వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలు. ఆమె కూడా వ్యాపారవేత్తే. ముంబయిలో మిస్టర్ పాస్ పెట్ స్పా సంస్థను నడుపుతోంది. చాలా ఏళ్ల నుంచి సచిన్ కుమార్తె సారాతో సానియాకు అనుబంధం ఉంది. వివాహానికి ఐసీసీ ఛైర్మన్ జైషా, ఏపీ మంత్రి నారా లోకేశ్, ప్రముఖ వ్యాపారవేత్త ముకేష్ అంబానీ కుటుంబం, బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్, టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్లు ఎం.ఎస్.ధోని, ఇర్ఫాన్ పఠాన్, యూసుఫ్ పఠాన్, సురేశ్ రైనా, ఆకాశ్ చోప్రా, మహమ్మద్ కైఫ్ తదితరులు హాజరయ్యారు.

## ఏపీ పదోతరగతి హాల్ టికెట్లు.. వాట్సాప్‌లో డౌన్‌లోడ్ చేసుకోండి

**అమరావతి:**



ఏపీలో మార్చి 16 నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి హాల్ టికెట్లు విడుదల అయ్యాయి. బోర్డ్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్, మనమిత్ర వాట్సప్ నంబరు, పాఠశాల విద్యాశాఖకు చెందిన లీప్ యాప్‌లో నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు. 9552300009 నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేస్తే హాల్‌టికెట్లు పొందే అవకాశాన్ని అధికారులు కల్పించారు. ఏప్రిల్ ఒకటి వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి.

## ఉగాది నాటికి లక్ష టిడ్కో ఇళ్లు సిద్ధం

**అమరావతి :**



ఏపీలోని నగరాలు, పట్టణాల్లో జనాభా ప్రస్తుతం 36 శాతం ఉండగా, 2047 నాటికి 60 శాతానికి చేరుతుందని మంత్రి నారాయణ తెలిపారు. దీనికి తగినట్లుగా సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించామని చెప్పారు. గురువారం ఏపీ శాసనసభలో పురపాలకశాఖ బడ్జెట్ రూ.14,538కోట్ల బడ్జెట్ గ్రాంట్ల కోసం అసెంబ్లీలో మంత్రి నారాయణ ప్రతిపాదించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చెత్త సేకరణ, నిర్వహణ, నీటి పునర్వినియోగం, ప్రతి ఒక్కరికీ ఇళ్లు, రోడ్లు, ఆసుపత్రులు, శ్మశానాలు వంటి అంశాలపై దృష్టి సారించామని మంత్రి వివరించారు.

### జూన్ నాటికి డంపింగ్ యార్డులు శుభ్రంగా

ప్రస్తుతం నగరాలు, పట్టణాల్లో 2100 ఎంఎల్‌డీ తాగునీరు సరఫరా చేస్తున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా డంపింగ్ యార్డుల్లోని చెత్తను పూర్తిగా క్లియర్ చేస్తున్నామని.. జూన్ నాటికి అన్ని డంపింగ్ యార్డులు శుభ్రంగా తయారవుతాయని వెల్లడించారు. గతంలో 5 లక్షల టిడ్కో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా.. వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిని 2.65 లక్షలకు కుదించి, రంగులు మార్చిందన్నారు. ఇళ్లు కట్టకుండానే బిల్లులు చేసిందని విమర్శించారు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం రూ.4,451 కోట్లు హడ్కో రుణం మంజూరైందని.. ఉగాది నాటికి లక్ష టిడ్కో ఇళ్లు సిద్ధం చేస్తామని మంత్రి తెలిపారు.

### మరో 75 క్యాంటీన్లు ఏర్పాటు

పరిశుభ్రమైన వాతావరణంలో 205 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని మంత్రి వెల్లడించారు. వీటి ద్వారా 3.07 కోట్ల మంది అల్పాహారం, 3.64 కోట్ల మంది భోజనం, 1.59 కోట్ల మంది రాత్రి భోజనం తీసుకున్నారని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మరో 75 క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. నగరాలు, పట్టణాల్లో భవన నిర్మాణ అనుమతులను సులభతరం చేశామన్నారు. వివిధ శాఖల ఎన్‌ఓసీలను సింగిల్ విండో విధానంలో మంజూరు చేస్తున్నామని చెప్పారు. వైసీపీ హయాంలో టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగిందని.. తణుకులో రూ. 691 కోట్లు, తిరుపతిలో రూ.147 కోట్లు కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. విజిలెన్స్ విచారణ తర్వాత సమస్య పరిష్కారమవుతుందని మంత్రి తెలిపారు.

రాజధాని అమరావతిని వైసీపీ మూడుముక్కలాటతో నాశనం చేసిందని మంత్రి నారాయణ విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక కాంట్రాక్టర్ల పాత బిల్లులు క్లియర్ చేశామని, మళ్లీ కొత్త టెండర్లు పిలిచి పనులు అప్పగించామని తెలిపారు. వర్షాలు ముగిసిన తర్వాత పనులు వేగంగా జరుగుతున్నాయని.. రాబోయే మూడేళ్లలో పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అఖిల భారత సర్వీసు అధికారుల భవనాలు ఈ నెలలో పూర్తవుతాయని అన్నారు. మిగతా అధికారుల భవనాలు రెండు నెలల్లో పూర్తి చేస్తామని వెల్లడించారు.




## వైకాపా హయాంలో భగవద్గీత పుస్తకాల పేరిట భారీ అవినీతి: కిరణ్ రాయల్

**తిరుపతి(గాంధీరోడ్డు):**

వైకాపా హయాంలో తిరుమలలో భగవద్గీత పుస్తకాల పేరుతో భారీ అవినీతి జరిగిందని జనసేన నేత కిరణ్ రాయల్ ఆరోపించారు. తితిదే చరిత్రలోనే అతిపెద్ద స్కామ్ అని అన్నారు. తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ''50 గ్రాములు కూడా లేని భగవద్గీత పుస్తకాన్ని వైకాపా హయాంలో ముద్రించారు. 15 పేజీలతో ఇలా ఇంతవరకు ఎక్కడా లేదు. భగవద్గీత పుస్తక ముద్రణలో ధర్మారెడ్డి పేరు ఎందుకు?ఈ పుస్తకం పేరుతో రూ.కోట్లు తినేశారు. హిందూ సమాజానికి జగన్, భూమన కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి క్షమాపణ చెప్పాలి. భగవద్గీత బాగోతాన్ని బయటపెట్టినందుకు తితిదే ఛైర్మన్‌ను టార్గెట్ చేశారు. అందుకే ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు'' అని కిరణ్ రాయల్ అన్నారు.

## లడ్డూ కల్తీ.. నివేదికలను వైకాపా తొక్కిపెట్టలేదా?: మంత్రి ఆనం

**అమరావతి:**



తిరుమల లడ్డూ కల్తీ జరిగిందని నివేదికలన్నీ చెబుతున్నా.. వైకాపా సభ్యులు దుష్ప్రచారాలు చేస్తున్నారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఏపీ శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ.. తిరుమల లడ్డూపై స్టేట్‌మెంట్ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వైకాపా సభ్యులు నినాదాలు చేశారు. గందరగోళ పరిస్థితి తలెత్తడంతో మండలి ఛైర్మన్ మోషేను రాజు సభను శుక్రవారానికి వాయిదా వేశారు. ''జగన్ నాయకత్వంలో నివేదికలను తొక్కిపెట్టిన విషయం అందరికీ తెలుసు. టెండర్లన్నీ మార్చి నిబంధనలను తుంగలో తొక్కారు. తమకు అనుకూలంగా నిబంధనలను మార్చుకున్నారు. కల్తీ జరగడం వాస్తవమేనని వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి ఒప్పుకొన్నారు కదా. ఆనాటి తితిదే ఛైర్మన్లే ఒప్పుకొన్నప్పటికీ.. వైకాపా నేతలు మాత్రం ఒప్పుకోవడం లేదు. వాస్తవాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది'' అని ఆనం అన్నారు.




# ఘనంగా కొండ బిట్రగుంట బ్రహ్మోత్సవాలు

### పాల్గొన్న కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి

**కావలి, మార్చి 05, వుదయం న్యూస్:**

బోగోలు మండలం కొండ బిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారు సూర్యప్రభ వాహనంపై ఆలయ ప్రాంగణంలో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి లోటుపాట్లు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయా కార్యక్రమాలలో ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు ఉన్నారు.

### పలు శుభ కార్యక్రమాల్లో..

కావలి శాసనసభ్యులు డివి కృష్ణారెడ్డి గురువారం పలు శుభ కార్యక్రమాలలో పాల్గొన్నారు. కావలి పట్టణానికి చెందిన దామిశెట్టి మల్లికార్జున రావు – లక్ష్మీ శైలజ దంపతుల కుమార్తె సుమాంజలి వివాహం కావలి పట్టణంలోని ఎస్ఎంకే కన్వెన్షన్ నందు గురువారం జరిగింది. ఈ వివాహ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జలదంకి మండలం బ్రాహ్మణక్రాక గ్రామానికి చెందిన దగుమాటి శ్రీనివాసులు రెడ్డి – వెంకట రవణమ్మ దంపతుల కుమారుడు కిరణ్ కుమార్ రెడ్డి వివాహ నలుగు కార్యక్రమం బ్రాహ్మణక్రాక గ్రామంలో గురువారం జరిగింది. ఈ వివాహ నలుగు కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పాల్గొని నూతన వరుడిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.





# గిరిజన ప్రాంతాల్లో అందని ద్రాక్షలా వైద్యం



## అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి హాజరుకండి

**వీ ఆర్‌పురం మార్చి 5 వుదయం న్యూస్ :** రేఖపల్లిలోని స్థానిక ఎం. పి. డి. ఓ కార్యాలయం ప్రాంగణంలో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ ( మహిళల పండుగ ) కార్యక్రమానికి విచ్చేయా లని మండలంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ప్రధాన అధికారులకు ఆహ్వాన కరపత్రికలు పంపిణీ చేసినట్లు మండల పరిషత్ అధ్యక్షురాలు కారం. లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

అనంతరం జరిగిన సమావేశానికి ఎస్. రంగమ్మ అధ్యక్షత వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి యూటీయఫ్ మండల మహిళా కార్యదర్శి టి. విజయకుమారి మాట్లాడుతూ వి. ఆర్. పురం మండలంలో ఉన్న ప్రతీ గ్రామం నుండి, ప్రతీ ఇంటి నుండి ఒక మహిళను బయటకు తీసుకువచ్చి, మహిళల పై జరుగుతున్న అత్యాచారాలు, హత్యల గురించి అవగాహన కల్పించి, అటువంటి ఘటనలపై మహిళలు ఎలా సంఘటితం కావాలో వివరిస్తామన్నారు. ఆధునిక సమాజంలో కూడా మహిళల పట్ల వివక్షత చూపడం శోచనీయమన్నారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉన్నతాధికారుల ద్వారా అన్ని విషయాలు అవగాహన కల్పించుటకు ప్రపంచ మహిళా దినోత్స కార్యక్రమాన్ని జరుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసినట్లు తెలిపారు. ఆదివారం నాడు ప్రతీ ఇంటి నుండి ఇంటికొక్క ఆడపడుచు బయలుదేరాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా, ఎంఈఈ , హెచ్ ఇ, సీఐటీయూ, యూటీయఫ్, ఏ జీ ఎస్ సంఘాల నాయకులు కె. శారద, ఎం. రాజేశ్వరి, కె. కనక, రామదేవి, అశ్విని, దారమ్మ తదితరులు పాల్గొన్నారు.

- రాయగూడెం ఆస్పత్రి సందర్శించిన ఎంపీపీ లక్ష్మీ
- సమస్యలపై పీహెచ్‌సీ సిబ్బందిని ప్రశ్నించిన సీపీఎం బృందం





**వీఆర్ పురం:** – మార్చి 5 వుదయం : వీఆర్ పురం మండలంలోని జీడిగుప్ప పంచాయతీ పరిధిలో ఉన్న రాయగూడెం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఎంపీపీ కారం లక్ష్మి , సీపీఎం బృందం గురువారం సందర్శించారు. మారుమూల గిరిజన ప్రాంత ప్రజలకు వైద్యం అందించడంలో ఆసుపత్రి తీరును, అక్కడ నెలకొన్న మౌలిక సదుపాయాల కొరతను వారు స్వయంగా పరిశీలించారు.ఆసుపత్రి సందర్శనలో భాగంగా ఎంపీపీ కారం లక్ష్మి మరియు బృందం పలు కీలక సమస్యలను గుర్తించారు ఆసుపత్రిలో సరిపడా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది లేకపోవడంతో రోగులకు సకాలంలో చికిత్స అందడం లేదని బృందం అసహనం వ్యక్తం చేసింది. అత్యవసర మందులు, కనీస వైద్య పరికరాలు అందుబాటులో లేకపోవడాన్ని వారు గమనించారు. భవనం నిర్వహణ సరిగ్గా లేకపోవడం, తాగునీరు మరియు పారిశుద్ధ్య సౌకర్యాల కొరతపై రోగులు బృందానికి ఫిర్యాదు చేశారు. రాత్రి సమయాల్లో అత్యవసర పరిస్థితి ఏర్పడితే గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎంపీపీ కారం లక్ష్మి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో వైద్యం అందని ద్రాక్షలా మారింది. జీడిగుప్ప వంటి మారుమూల పంచాయతీ ప్రజలకు ప్రాణాధారమైన రాయగూడెం ఆసుపత్రిని ప్రభుత్వం గాలికొదిలేసింది. ఇక్కడ కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు, అని విమర్శించారు.సీపీఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ, తక్షణమే ఆసుపత్రికి పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని, అవసరమైన మందుల నిల్వలను ఉంచాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను భర్తీ చేయాలి. 24 గంటల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలి. అంబులెన్స్ సౌకర్యాన్ని నిరంతరం అందుబాటులో ఉంచాలి.ఈ కార్యక్రమంలో ఎంపీపీతో పాటు స్థానిక సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు వడ్లది రమేష్ మండల నాయకులు, సిరప్ తాతబాబు, గ్రామస్తులు మరియు ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



## సిండికేట్ ఫార్మసీ సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ఆత్మకూరు (వుదయం ప్రతినిధి) మార్చి 5వ,** రాష్ట్ర కార్యదర్శి మరియు సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలుకులు దావా పెంచలరావు ఆత్మకూరు సిండికేట్ ఫార్మసి సొసైటీ లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ రైతుల క్షేమం కోరి వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తూ దళారులు వారి చేతిలో మోసపోకుండా రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు చేర్చుకొని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలని రైతులు దళారి చేతుల్లో మోసపోవద్దని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చంద్ర రెడ్డి, పిడికిలి వెంకటేశ్వర్లు ,బిజెపి నాయకులు కుడుముల సుధాకర్ రెడ్డి, శైలజ రెడ్డి,తదితర నాయకులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి ఆపదొస్తే.. ఖమ్మం పరుగు తీయాల్సిన అవస్థలు ఉండవు!

- గిరిజన బిడ్డల ప్రాణాలకు మంత్రి పొంగులేటి భరోసా..
- తిరుమలాయపాలెంలో రూ. 26 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రికి శంకుస్థాపన
- డిసెంబర్ కల్లా పనులు పూర్తి కావాలి.. కాంట్రాక్టర్‌కు ఆదేశాలు



**ఖమ్మం వుదయం బ్యూరో మార్చి 5**

**తిరుమలాయపాలెం :** "అర్ధరాత్రి వేళ ఆపద వస్తే.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఖమ్మం పరుగు తీయాల్సిన కష్టాలు ఈ ప్రాంత గిరిజన బిడ్డలకు ఇక ఉండవు. పేదవాడి సొంత గడ్డపైనే కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడమే మన ప్రజా ప్రభుత్వ లక్ష్యం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గురువారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో సుమారు రూ. 26 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి ప్రసంగించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. జిల్లా ఆసుపత్రిని మరిపించేలా వసతులు గతంలో కేవలం 30 పడకలతో, అరకొర వసతులతో ఉన్న ఈ ఆసుపత్రి వల్ల ప్రజలు పడ్డ ఇబ్బందులను మంత్రి గుర్తు చేసుకున్నారు. "నాడు ప్రసవం కావాలన్నా, అత్యవసర చికిత్స కావాలన్నా ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లడం తప్ప మరో మార్గం ఉండేది కాదు. కానీ ఇప్పుడు మన ప్రజా ప్రభుత్వం వచ్చాక, జిల్లా హెడ్ క్వార్టర్ ఆసుపత్రిని మరిపించేలా ఇక్కడ అన్ని వసతులు కల్పిస్తున్నాం. డయాలసిస్ యూనిట్లు, అత్యాధునిక పరికరాలతో కూడిన వైద్యాన్ని రాబోయే కొద్ది నెలల్లోనే ఇక్కడ అందుబాటులోకి తెస్తాం" అని భరోసా ఇచ్చారు.

**వైద్యులు దేవుళ్లతో సమానం.. ఇక్కడే ఉండాలి!**

వైద్య సిబ్బంది పనితీరుపై మంత్రి దిశానిర్దేశం చేశారు. "ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు పెట్టి భవనాలు కట్టవచ్చు.. కానీ డాక్టర్ అందుబాటులో ఉంటారనే నమ్మకం రోగికి కలిగినప్పుడే ఆ ఆసుపత్రికి సార్థకత ఉంటుంది. డాక్టర్లు, సిబ్బంది ఎక్కడో ఉండటం కాదు.. ఈ హెడ్ క్వార్టర్స్‌లోనే నివసించాలి. చర్ల, మణుగూరు, ఇల్లందు ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు అద్భుత ఫలితాలు ఇస్తున్నాయి. ఇక్కడ కూడా అదే అంకితభావం కావాలి. విధుల్లో చిత్తశుద్ధి చూపే సిబ్బందికి నా నియోజకవర్గం తరపున ప్రత్యేక బహుమతులు అందజేస్తాను" అని ప్రకటించారు.

### కాంట్రాక్టర్‌కి ఆదేశాలు...

"మార్చిలో పనులు మొదలవుతున్నాయి.. యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, మళ్లీ డిసెంబర్ నాటికే ఈ ఆసుపత్రిని ప్రారంభించాలి" అని గడువు విధించారు. అనంతరం మంత్రి పొంగులేటి లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు , మండల నాయకులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.



## మంత్రి ఆనం అండతో చేపల పెంపకం దందా

- మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి
- సంగంలో చికెన్ వ్యర్థాలతో చేపల పెంపకం



**ఆత్మకూర్ రూరల్ సంగం (వుదయం ప్రతినిధి) మార్చి 5వ తేదీ** ప్రజారోగ్యంతో చెలగాటమాడుతూ చికెన్ వ్యర్థాలతో చేపలను పెంచుతున్న దందాకు మంత్రి స్థాయి నుంచి అండదండలు లభిస్తున్నాయని ఆత్మకూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ దందాకు సహకరిస్తున్న మంత్రికి తమ స్వంత డబ్బులతో ప్రతిరోజూ అదే చేపలను పంపిస్తామని, అప్పుడు ఆయన ఆరోగ్యం ఎలా ఉంటుందో ఆయనే చెప్పాలని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. బుధవారం రాత్రి సంగం మండలం దువ్వూరు వద్ద సాగు చేస్తున్న చేపల గుంతలను విక్రమ్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంగం మండలంలో సుమారు రెండు వేల ఎకరాల్లో చేపల గుంతల సాగు జరుగుతోందన్నారు. అయితే చేపలకు వేయాల్సిన సాధారణ దాణాకు బదులుగా చెన్నై, బెంగళూరు ప్రాంతాల నుంచి తెచ్చిన చికెన్ వ్యర్థాలను గుంతల్లో వేస్తూ చేపలను పెంచుతున్నారని ఆరోపించారు. ఈ విధానం వల్ల ప్రజారోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చేపల గుంతల సమీపంలో ఉన్న వ్యవసాయ భూములు కూడా ఉపయోగానికి నోచుకోకుండా పోతున్నాయని, ఈ గుంతల నీరు భూగర్భ జలాల్లో కలవడంతో ఆ నీటిని వినియోగిస్తున్న ప్రజలు చర్మవ్యాధులతో బాధ పడుతున్నారని పేర్కొన్నారు. ఈ అంశంపై గత ఏడాది నవంబర్‌లోనే జిల్లా కలెక్టర్‌కు లేఖ ద్వారా సమాచారం ఇచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విక్రమ్ రెడ్డి విమర్శించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న దందాను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే చేపల గుంతలను పరిశీలించేందుకు వచ్చామని తెలిపారు. సంగం ప్రాంతంలో ఒక స్థానిక నాయకుడు ఈ వ్యవహారాన్ని నడిపిస్తుండగా, రవాణా మరియు నగదు లావాదేవీలను చూసే మరో నాయకుడు లక్షల రూపాయలు సంపాదిస్తూ నేరుగా మంత్రి కార్యాలయానికి లెక్కలు చెబుతున్నారని ఆరోపించారు. మంత్రి అండతోనే ఈ అక్రమాలు కొనసాగుతున్నాయని, అందువల్ల అధికారులు కూడా చర్యలు తీసుకోలేకపోతున్నారని విక్రం రెడ్డి మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ నియోజకవర్గ నాయకులు సంగం మండల నాయకులు పాల్గొన్నారు.

## పోస్ట్ ఆఫీస్ పథకాలపై అవగాహన



**పరకాల మార్చి 5 (వుదయం ప్రతినిధి ):** శాయంపేట మండలంలోని హుస్సేన్ పల్లి గ్రామంలో పోస్ట్ బ్రాంచ్ ఆఫీసర్ కోడెల రమేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ ఖాతాను తీసుకోవాలని, అమ్మాయిల సంరక్షణ అమ్మాయిల చదువు నినాదంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 10 సంవత్సరాల లోపు అమ్మాయిల కోసం సుకన్య సమృద్ధి యోజన పేరుతో పథకాన్ని ప్రవేశపెట్టారని, అమ్మాయిల సంక్షేమం భవిష్యత్తు కోరుకునే తల్లిదండ్రులు పోస్ట్ ఆఫీస్ లో ఖాతా తెరుచుకోవాలని సూచించారు. గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎట్లా సరూప సుధాకర్ రావు, ఉప సర్పంచ్ లక్ష్మణ్ రావు, గుజ్జుల రవీందర్ జీ, కిషన్ రావు, మహేందర్ నాగేశ్వరరావు శ్రీనివాస్ రాజేందర్ నిరంజన్ రావు శంకర్రావు, విమల, నర్సమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

## శివాజీ జయంతి ర్యాలీపై సుమోటో కేసులు

### మొగుళ్లపల్లి టిఆర్పి మండల అధ్యక్షుడు రాజేష్ పటేల్



**భూపాలపల్లి మార్చి 5 వుదయం ప్రతినిధి** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో నిర్వహించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీకి సంబంధించి మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయడాన్ని టీ ఆర్పిమొగుళ్ళ పల్లి మండల అధ్యక్షుడు బోనగిరి రాజేష్ పటేల్ తీవ్రంగా ఖండించారు. ఫిబ్రవరి 19న హనుమాన్ దేవాలయం నుంచి జాతీయ రహదారి మీదుగా శాంతియుతంగా నిర్వహించిన శోభాయాత్రపై కేసులు నమోదు చేయడం అన్యాయమని ఆయన అన్నారు. మున్నూరు కాపులను లక్ష్యంగా చేసుకుని పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సామాజిక వర్గం తరఫున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.




## చండూరులో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం

**చండూరు, మార్చి 05 (వుదయం విలేఖరి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని చండూరులో శుక్రవారం ఉదయం 9 గంటలకు మున్సిపల్ కార్యాలయం పక్కనున్న గెస్ట్ హౌస్‌లో ప్రారంభించనున్నారని మున్సిపల్ కమిషనర్ మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిల్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది మరియు పట్టణ ప్రజలు పాల్గొననున్నారని వారు పేర్కొన్నారు.



## మృతుడి కుటుంబానికి ఎమ్ఎల్‌వీ భాస్కర్ ఫౌండేషన్ సాయం

**చండూరు , గట్టుప్పల్ మార్చి 05 (వుదయం విలేఖరి)** గట్టుప్పల్ మండలం తెరెట్‌పల్లి గ్రామానికి చెందిన బరిగల యాదయ్య ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ELV భాస్కర్ ఫౌండేషన్ సభ్యులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి తమ సానుభూతిని వ్యక్తం చేశారు.కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఫౌండేషన్ సభ్యులు ముందుకు వచ్చి ఆర్థిక, ఆహార సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి 50 కేజీల బియ్యం, 5 లీటర్ల వంట నూనె అందించారు. భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు.





## అధికారులు విధులను సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవు

### ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**వుదయం, సిద్ధిపేట ప్రతినిధి (మార్చి05)** అధికారులు విధులను సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, రక్షణ, అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు పూర్తిగా అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. విధులను సక్రమంగా నిర్వహించని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ వసతిగృహాలు, సంక్షేమ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, కళాశాలలలో సివిల్ సప్లై మరియు నిత్యావసరాల సరఫరా, అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు. వసతిగృహాలు మరియు సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలోని అంగన్వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందుతున్నదా లేదా అని మండల స్థాయి స్పెషల్ ఇన్‌చార్జ్ అధికారులు వారానికి రెండు సార్లు స్వయంగా వెళ్లి పరిశీలించాలని సూచించా రు. అవసరమైతే అక్కడే భోజనం చేసి నాణ్యతను తనిఖీ చేయాలని తెలిపారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించి నమోదైన కేసుల విచారణను వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని చైర్మన్ సూచించారు.అనంతరం అధికారులు చైర్మన్ బక్కి వెంకటయ్య ఇచ్చిన ఆదేశాల మేరకు పని చేస్తామని హామీ ఇచ్చారు.

## మాజీ ఎంపీపీ కుమారుడి వివాహానికి హాజరైన మేకపాటి



**ఆత్మకూరు రూరల్ చేజర్ల (వుదయం ప్రతినిధి) మార్చి 5వ తేదీ** చేజర్ల మండల వైఎస్సార్సీపీ మాజీ మండలాధ్యక్షుడు ప్రస్తుత వైఎస్సార్సీపీ జిల్లా బూత్ కమిటిక అధ్యక్షుడు బాలిరెడ్డి సుధాకర్ రెడ్డి కుమారుడు జైదీప్ వివాహా వేడుకలకు హాజరై నూతన వధువరూలను ఆశీర్వదించిన నెల్లూరు పార్లమెంట్ మాజీ సభ్యులు, మేకపాటి రాజమోహన్ రెడ్డి , మాజీ ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి , జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మరియు ఆత్మకూరు నియోజకవర్గ నాయకులు హాజరయ్యారు.

## రాజీవ్ రహదారిపై ట్రాఫిక్ కష్టాలకు చెక్

### వంటిమామిడి మార్కెట్ వద్ద పోలీసుల ప్రత్యేక చర్యలు



**గజ్వేల్, మార్చి 05 (వుదయం ప్రతినిధి)** సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ (ఐ.పి.యస్) ఆదేశాల మేరకు రాజీవ్ రహదారిపై ప్రయాణికులకు, రైతులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ములుగు మండలం వంటిమామిడి మార్కెట్ వద్ద పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ ఏసీపీ ఎం. సుమన్ కుమార్ పర్యవేక్షణలో గజ్వేల్ ట్రాఫిక్, రూరల్, గౌరారం మరియు ములుగు పోలీసులు సంయుక్తంగా రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మార్కెట్‌కు వచ్చే రైతులు, వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఏసీపీ సుమన్ కుమార్ స్థానిక సీఐలను ఆదేశించారు. రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నిలిపి, రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సైలకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన పలు వాహనదారులకు ఈ సందర్భంగా జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి, రూరల్ సీఐ రవి రాజు, ఎస్సైలు కరుణాకర్ రెడ్డి, దామోదర్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మార్చి 6 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహణ

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- 12న జిల్లా స్థాయిలో సర్పంచ్, కౌన్సిలర్ లకు వర్క్ షాప్ నిర్వహణ
- ప్రతీ కార్యాలయంలో పెండింగ్ ఫైల్స్ 10 రోజులలో క్లియర్ చేయాలి
- మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక
- 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ



**ఖమ్మం, వుదయం బ్యూరో మార్చి –05:** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మార్చి 6 నుంచి 15 వరకు గ్రామ, పట్టణంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ అమలుపై గురువారం జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుందని అన్నారు. మార్చి 6న ఉదయం 10 గంటలకు జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు, మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. మార్చి 6 నుంచి మార్చి 15 వరకు పారిశుద్ధ్య నిర్వహణ, ఫైల్ క్లియరెన్స్ అంశాలపై ప్రాధాన్యత తో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామాలు, పట్టణాలలో మాత్రమే కాకుండా ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టాలని, పాత ఫర్నీచర్ తొలగించాలని, దీనిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ ఉన్న ఫైల్స్ 10 రోజులలో క్లియర్ చేయాలన్నారు. మార్చి 12న జిల్లా స్థాయిలో సర్పంచ్, పట్టణాలలోని కౌన్సిలర్ లకు వర్క్ షాప్ నిర్వహిస్తున్నా మని, దీనికి ప్రతి ఒక్కరు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

## చైర్మన్ మల్లన్న, కౌన్సిలర్లను సన్మానించిన ఐటీఐ వాకర్స్ అసోసియేషన్



**పెద్దపల్లి ఫిబ్రవరి 05 (వుదయం ప్రతినిధి)** పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లను పెద్దపల్లి ఐటిఐ వాకర్స్ అసోసియేషన్ ఘనంగా సన్మానించింది. గురువారం ఉదయం వాకర్ అసోసియేషన్ ఆహ్వానం మేరకు ఐటిఐ మైదానంకు వచ్చిన మున్సిపల్ చైర్మన్ మల్లన్న తో పాటు కౌన్సిలర్ల బృందానికి వాకర్స్ అసోసియేషన్ బృందం పూల బొకే అందించి పూలమాలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మల్లన్న మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ కు వెన్నంటి ఉండి పెద్దపల్లి ఎమ్మెల్యే విజ్జన్న సహకారంతో ఐటిఐ మైదానంలో నిర్మాణం అవుతున్న స్విమ్మింగ్ పూల్, వాకింగ్ ట్రాక్ నిర్మాణం కోసం తన వంతు సహకారం ఉంటుందని అలాగే మున్సిపల్ కౌన్సిల్లో మాట్లాడి జిమ్ము పరికరాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ ఉప్పు స్వరూప రాజు తో పాటు మూడో వార్డు కౌన్సిలర్ మొలుగూరి కమల్, నాలుగో వార్డ్ కౌన్సిలర్ కొమ్ము సుధాకర్, ఐదవ వార్డ్ కౌన్సిలర్ గుజ్జుల కుమార్ తో పాటు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కొట్టే లక్ష్మయ్య, చింతపండు రాజమల్లుతో పాటు అధిక సంఖ్యలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# జాతీయం-అంతర్జాతీయం



## రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన నితీష్ కుమార్



**న్యూఢిల్లీ, మార్చి 5 (వుదయం) :**
దశాబ్దాలుగా బీహార్ రాజకీయాలలో కీలక పాత్ర పోషించిన ముఖ్యమంత్రి నితీష్ కుమార్ గురువారం రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. ఆయన త్వరలోనే ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలగనున్నారు. తనకు పార్లమెంటు ఉభయ సభలు, శాసనసభ ఉభయసభలలో సభ్యుడిగా సేవా చేయాలని కోరిక ఉందని సామాజిక మాధ్యమం ఎక్స్‌పై నితీష్ పోస్ట్ చేశారు. ఆయన లోక్‌సభ ఎంపీగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పని చేసి ఉన్నారు. ఇప్పుడు రాజ్యసభలో సభ్యత్వం ఆయన కోరిక తీర్చనుంది. గత నవంబర్‌లో జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో కలిసి నితీస్ కుమార్ ఎన్డీఏను ఘన విజయం సాధించడానికి నడిపించిన నాలుగు నెలల తర్వాత ఈ పరిణామం చోటు చేసుకుంది. ఆ తర్వాత నితీష్ కుమార్ 10వ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి రికార్డు
సృష్టించారు. ఆయన రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేయడం ద్వారా, దశాబ్దాల అనంతరం తొలిసారి బీజేపీ సొంత ముఖ్యమంత్రిని కలిగి ఉండేందుకు మార్గాన్ని సుగమం చేశారు. నితీష్ ఆరోగ్య పరిస్థితి దెబ్బతింటున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంటుందని విశ్లేషకులు పేర్కొంటూనే ఉన్నారు. బుధవారం రాత్రి ఆయన నిష్క్రమణానికి ఎన్డీయే అన్ని ఏర్పాట్లూ చేసినట్టు తెలుస్తోంది. నితీష్ కుమార్ నామినేషన్ దాఖలు చేయడంతో పాట్నాలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.

**నితీష్ కుమార్ ఏమన్నారు?**
నామినేషన్ దాఖలు చేసే ముందు జనతాదళ్ (యునైటెడ్) అధిపతి వారి సుదీర్ఘకాల మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. వారి విశ్వాసమే రెండు దశాబ్దాల పాటు రాష్ట్రానికి సేవ చేసే అవకాశాన్ని కల్పించిందని ఆయన అన్నారు. నా పార్లమెంటరీ ప్రయాణం ప్రారంభమైనప్పటి నుంచి, నేను బీహార్ శాసనసభ, పార్లమెంటు ఉభయ సభల సభ్యుడిని కావాలనే కోరికతో ఉన్నాను. ఆ ఆకాంక్షకు అనుగుణంగా, ఈసారి జరుగుతున్న ఎన్నికల్లో రాజ్యసభ సభ్యుడిని కావాలని నేను కోరుకుంటున్నాను అని సామాజిక మాధ్యమం ఎక్స్‌పై ఆయన హిందీలో పోస్ట్ చేశారు. భవిష్యత్తులో కూడా వారితో తన బంధం కొనసాగుతుందని, అభివృద్ధి చెందిన బీహార్‌ను నిర్మించడానికి వారితో కలిసి పనిచేయాలనే తనసంకల్పం స్థిరంగా ఉంటుందని మీకు (మద్దతుదారులకు) పూర్తి నిజాయితీతో హామీ ఇస్తున్నాను అని ఆయన అన్నారు.

**నిరసన తెలిపిన జెడి (యు) సభ్యులు**
గురువారం ఉదయం జనతాదళ్ (యునైటెడ్) సభ్యులు నితీష్ కుమార్ పార్లమెంటు రాజ్యసభకు మారవచ్చనే ఊహాగానాల నేపథ్యంలో నినాదాలు చేశారు. బీహార్ ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ మాత్రమే ఉండాలని తాము కోరుకుంటున్నామని ఆ పార్టీ సభ్యులు పట్టి చూపారు. పార్టీ సభ్యులు ముఖ్యమంత్రి నివాసం ఎదుట గుముగూడి, బీహార్ ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ మాత్రమే ఉండాలని, నితీష్ కుమార్ రాజ్యసభకు వెళ్లడానికి తాము వ్యతిరేకమని నినాదాలు చేశారు. ఆయన కుమారుడు నిశాంత్ కుమార్ రాజ్యసభకు వెళ్లాలని తాము కోరుకుంటున్నట్టు పార్టీ సభ్యుడు రాజీవ్ రంజన్ పటేల్ పేర్కొన్నారు. నితీష్ కుమార్ రాజ్యసభకు వెళ్లాలని ఇప్పటికే నిర్ణయించుకుంటే, ఆయన చర్యను పార్టీ సభ్యులు వ్యతిరేకించలేరని జెడి (యు) నాయకుడు సంజయ్ సింగ్ అన్నారు. రాజ్యసభకు వెళ్లాలని ఆయన నిర్ణయం తీసుకుంటే, మేము దానిని వ్యతిరేకించలేము, కానీ బీహార్ ప్రజలు ఆయన బీహార్ ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరుకుంటున్నారు అని ఆయన తెలిపారు.

## సుంకాలను వడ్డీతో సహా చెల్లించండి



**వుదయం డెస్క్, మార్చి 5 :**
చట్టవ్యతిరేకంగా వసూలు చేశారంటూ అమెరికా సుప్రీం కోర్టు తీర్పు చెప్పిన సుంకాలకు సంబంధించి అమెరికా వాణిజ్య కోర్టు ట్రంప్ ప్రభుత్వాన్ని కుదిపి వేసే తీర్పు చెప్పింది. దాదాపు బిలియన్ల డాలర్ల విలువైన సుంకాలు చెల్లించిన దిగుమతిదారులకు వడ్డీతో సహా వాపసు ఇవ్వడం ప్రారంభించమని ప్రభుత్వాన్ని ఆదేశించింది. సుంకాలను సరిగ్గా అంచనా వేయకుండా అమెరికాలోకి ప్రవేశించిన మిలియన్ల కొద్దీ షిప్‌మెంట్‌ల ధరను లెక్కించడం ప్రారంభించాలని యుఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ న్యాయమూర్తి రిచర్డ్ ఈటన్ ప్రభుత్వాన్ని ఆదేశించారు. కోర్టు దాఖలు ప్రకారం, వాపసులలో వడ్డీ కూడా ఉండాలి. చట్ట విరుద్ధమైన సుంకాలను తిరిగి చెల్లించాలని కస్టమ్స్‌ను ఆదేశించిన అమెరికా కోర్టు సాధారణ దిగుమతి ప్రక్రియలో, వస్తువులు దేశంలోకి ప్రవేశించినప్పుడు కంపెనీలు అంచనా వేసిన సుంకాన్ని చెల్లిస్తాయి. తుది మొత్తాన్ని దాదాపు 314 రోజుల తర్వాత లిక్విడేషన్ అని పిలిచే ప్రక్రియ ద్వారా నిర్ణయిస్తారు. వివాదాస్పద సుంకాలను వర్తింపజేయకుండా లిక్విడేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఈటన్ యుఎస్ కస్టమ్స్ & బోర్డర్ ప్రొటెక్షన్ (సిబిపి)ని ఆదేశించారు. దీని ఫలితంగా స్వయంచాలకంగా వాపసులు లభిస్తాయి. దీన్ని ఎలా చేయాలో కస్టమ్స్‌కు తెలుసు అని న్యాయమూర్తి ఈటన్ అన్నారు. ఏజెన్సీ ఇటువంటి ప్రక్రియలను క్రమం తప్పకుండా నిర్వహిస్తుందని, దాని వ్యవస్థలను తదనుగుణంగా సర్దుబాటు చేయగలగాలి అని ఆయన అన్నారు. వారు దీన్ని నిత్యం చేస్తారు. వారు ఎంట్రీలను లిక్విడేట్ చేసి వాపసు చేస్తారు, అని ఆయన అన్నారు.

**అక్రమ సుంకాల రూపంలో 130 బిలియన్ల డాలర్ల వసూలు**
రీఫండ్ ప్లాన్‌లను అమలు చేయడంలో ఏజెన్సీ పురోగతిని సమీక్షించడానికి న్యాయమూర్తి శుక్రవారం మరో విచారణను జరుపనున్నారు. టారిఫ్ వాపసు కేసులను తాను నిర్వహిస్తానని కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూచించారని ఈటన్ అన్నారు. అయితే, ఇది చాలా భారీ పని కావచ్చని సిబిపి కోర్టు పత్రాలలో వాదించింది. లెక్కల నుండి సుంకాలను తొలగించడానికి 70 మిలియన్లకు పైగా దిగుమతి ఎంట్రీలను మాన్యువల్‌గా సమీక్షించాల్సి రావచ్చని ఏజెన్సీ తెలిపింది. వాపసులను ప్రక్రియ ఎలా నిర్వహించవచ్చో అంచనా వేయడానికి నాలుగు నెలల వరకు సమయం పడుతుందని అధికారులు కోర్టుకు తెలిపారు. మొత్తంమీద, ప్రభుత్వం 130 బిలియన్ డాలర్లకు పైగా అక్రమ సుంకాలను వసూలు చేసింది, ఇవి ట్రంప్ వాణిజ్య విధానానికి కేంద్రంగా ఉన్నాయి. ఈ తీర్పు విస్తృత వాపసు విధానాన్ని సూచిస్తుందని న్యాయ నిపుణులు అంటున్నారు. వాణిజ్య శాఖ మాజీ అధికారి ర్యాన్ మేజెరస్ మాట్లాడుతూ, "ఈ క్రమంలోని భాష దిగుమతిదారులు ఐఇఇపిఎ వాపసులకు అర్హులు అనే సమగ్ర విధానాన్ని బలంగా సూచిస్తుంది, అని ఆయన అన్నారు. దాదాపు మూడు లక్షలకు పైగా దిగుమతిదారులు, అధికంగా చిన్న వ్యాపారులు సుంకాలు చెల్లించారు. ఇప్పుడు తమ నిధులను వసూలు చేసుకునేందుకు సరళమైన ప్రక్రియను ఆశిస్తున్నారు.

## 50 రోజులకు సరిపోయేంత
# ఇంధనం ఉంది

### ఎప్పటినుంచో ఇంధన సరఫరాలకు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగిస్తున్నాం



న్యూఢిల్లీ, మార్చి 5 (వుదయం): పశ్చిమాసియాలో సంఘర్షణ కొనసాగుతున్నప్పటికీ, రానున్న 50 రోజులకు సరిపోయేంత పెట్రోలియం, సహజ వాయువు నిల్వలు భారతదేశంలో ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. దేశంలో ఇంధనం అందుబాటుకు సంబంధించి తక్షణ ఆందోళనలు లేవని అధికారులు తెలిపారు. పెట్రోలియం మంత్రిత్వ శాఖ వర్గాల ప్రకారం, రష్యాతో సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రధాన ముడి చమురు సరఫరాదారులతో సంప్రదింపులలో మంత్రిత్వ శాఖ ఉంది. భారత్ వద్ద 50 రోజులకు సరిపడా పెట్రోలియం, సహజవాయువు ఉందని, సమస్య లేదని వారు అన్నారు. ముడి చమురు సరఫరా చేసే ప్రభుత్వ యాజమాన్యంలోని, ప్రైవేటు కంపెనీలు భారతీయ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు వారు తెలిపారు.

**ప్రపంచ చమురు సరఫరాదారులతో ప్రభుత్వ సంప్రదింపులు**
సరఫరాలో కొనసాగింపును నిర్ధారించడానికి పెట్రోలియం మంత్రిత్వ శాఖ ప్రధాన అంతర్జాతీయ ముడి చమురు ఉత్పత్తిదారులతో క్రమం తప్పకుండా సంప్రదింపులు జరుపుతోందని ఆ వర్గాలు తెలిపాయి. హోర్ముజ్ జలసంధిలో పరిస్థితి కారణంగా దిగుమతులు కొద్దిగా తగ్గవచ్చని అధికారులు తెలిపారు. అయితే,షిప్‌మెంట్లు ఆగవని వారు తెలిపారు. ప్రపంచ ఇంధన ప్రధాన మార్గాలలో హోర్ముజ్ జలసంధి కీలకమైంది. ఇరుకైన ఆ మార్గం ద్వారా ప్రపంచ చమురు, ఎల్ఎన్‌జి షిప్‌మెంట్లలో అధిక భాగం రవాణా అవుతుంది. పరిస్థితి గంభీరంగా ఉన్నప్పటికీ, తీవ్రమైన అంతరాయాలు జరుగుతాయని ప్రభుత్వం భావించడం లేదని అధికారులు తెలిపారు.

**హోర్ముజ్ జలసంధిపై పరిమితంగా ఆధారపడ్డాం**
భారతదేశ ముడి చమురు సరఫరాలో దాదాపు 40 శాతం మాత్రమే హోర్ముజ్ జలసంధి ద్వారా వస్తుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మిగిలిన 60 శాతం ఇతర దేశాల నుంచి మరియు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వస్తుంది. ఈ వైవిధ్యీకరణ కారణంగా, ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగినప్పటికీ భారతదేశం సరఫరా సమస్యను పెద్దగా ఎదుర్కొనే అవకాశం లేదు.
హోర్ముజ్ పరిస్థితి కారణంగా సహజ వాయువు సరఫరాలో స్వల్ప తగ్గుదల సాధారణ వినియోగదారులను ప్రభావితం చేయదని అధికార వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగినప్పటికీ దేశీయ ఇంధన ధరలు పెరగవని వారు అన్నారు. ప్రపంచ స్థాయిలో ధరలు పెరిగినప్పటికీ భారతదేశంలో ముడి చమురు ధరలు పెరగవు అని ఆ వర్గాలు తెలిపాయి.

**ఇంధన పరిస్థితిపై ప్రతిరోజూ సమీక్షా సమావేశాలు**
అమెరికాఇరాన్ వివాదం కొనసాగుతున్నందున ప్రభుత్వం ఇంధన పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోందని అధికారులు తెలిపారు. పెట్రోలియం, సహజ వాయువు సరఫరా పరిస్థితులను అధికారులు ప్రతిరోజూ రెండుసార్లు సమీక్షిస్తున్నారనిఆ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశాలలో పెట్రోలియం మంత్రి, ప్రభుత్వ రంగ చమురు కంపెనీల సీనియర్ అధికారులు పాల్గొంటున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ ఎరువుల సరఫరా స్థిరంగా ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. భారత రైతులు ఎరువుల కొరతను ఎదుర్కోరని వారు చెప్పారు. ఈ ప్రాంతంలోని పరిణామాలకు సంబంధించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఖతార్ , ఒమన్ నాయకత్వంతో ప్రత్యక్ష సంప్రదింపులు జరుపుతున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారతదేశం అంతర్జాతీయ ఇంధన సంస్థ, అమెరికాలోని అధికారులతోకూడా సమన్వయం చేసుకుంటోంది. ముడి చమురును రవాణా చేసే కార్గో కంపెనీలకు ఐడిఎఫ్‌సి ద్వారా బీమా రక్షణను అమెరికా అందించిందని అధికార వర్గాలు తెలిపాయి. ఎటువంటి అంతరాయం లేకుండా ఎగుమతులు కొనసాగేలా చూడటం ఈ చర్య లక్ష్యం. ముడి చమురు, సహజ వాయువు సరఫరాల విషయంలో ప్రభుత్వం ఇప్పటికీ సౌకర్యవంతమైన స్థితిలో ఉందని అధికారులు తెలిపారు.

## శ్రీలంక జలాల్లో రెండవ యుద్ధ నౌక



**వుదయం డెస్క్, మార్చి 5 :**
శ్రీలంక సమీపంలో ఉన్న ఒక ఇరానియన్ నౌక "అత్యవసర పోర్ట్ కాల్" కోసం అభ్యర్థించిందని శ్రీలంక ఎంపీ నమల్ రాజపక్స గురువారం అన్నారు. ఐరిస్ దేనాను అమెరికా జలాంతర్గామి పేల్చి,ముంచివేసి వేసిన ఒక రోజు తర్వాత ఇరాన్ నావికాదళ నౌక నుండి ఈ అత్యవసర అభ్యర్థన వచ్చింది. మరో ఇరానియన్ నౌక శ్రీలంక ప్రత్యేక ఆర్థిక మండలంలో, తమ ప్రాదేశిక జలాలకు వెలుపల ఉందని తమ దృష్టికి వచ్చిందని, అత్యవసరంగా పోర్టుకు కాల్ చేయడానికి ప్రభుత్వ అనుమతి కోరిందని ఆయన ఎక్స్‌పై పోస్ట్ చేశారు.అయితే, ఇది ఇంకా ప్రభుత్వ అనుమతి కోసం వేచి ఉందని తెలిపారు. రెండవ ఇరానియన్ యుద్ధనౌక శ్రీలంక జలాలకు ఆవల ఉందంటూ మీడియా మంత్రి నలింద జయతిస్సా, ఇతర వివరాలు ఇవ్వకుండా పేర్కొన్న తర్వాత శ్రీలంక ఎంపీ ప్రకటన వెలువడింది.బుధవారంనాడు, అమెరికా జలాంతర్గామి ఐఆర్ఐఎస్ దేనాను పేల్చి,ముంచివేసిన విషయం తెలిసింది. భారత్‌లోని విశాఖపట్నంలో సైనిక విన్యాసాలు పూర్తి చేసుకొని హిందూ మహాసముద్రంలో శ్రీలంక జలాలలో ఈ యుద్ధ నౌక ఉంది. ఇరాన్‌కు రెండువేల నాటికల్ మైళ్ల దూరంలో జరిగిన దాడిలో సుమారు 87మంది మరణించారు. శ్రీలంక ప్రభుత్వం ప్రకారం సోదా ఆపరేషన్ల సమయంలో 32 మంది నావికులను కాపాడారు, అనేకమంది సముద్రంలో పడిపోయి, మరణించారని భావించారు. అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ యుఎస్ దాడిని ఖరారు చేసి, యుద్ధనౌక విధ్వంసం అన్నది వాషింగ్టన్‌కు గొప్ప విజయమని అభివర్ణించారు. అమెరికా నిర్ణయాత్మకంగా, వినాశకరంగా, కనికరం లేకుండా గెలుస్తోంది. అధ్యక్షుడు ట్రంప్ ప్రత్యక్ష ఆదేశం మేరకు, యుద్ధ శాఖ శనివారం తెల్లవారుజామున ఈ ఆపరేషన్‌ను ప్రారంభించింది, అని ఇజ్రాయెల్‌తో ఈ ఉమ్మడి ఆపరేషన్‌లో విజయం సాధించేలా అమెరికా నిర్ధారిస్తుందని అన్నారు.

## ఇరాన్‌పై ఐరోపా నాయకుల ఐక్యకూటమి

**వుదయం డెస్క్, మార్చి 5 :**



యుద్ధం ప్రారంభమై ఆరు రోజుల తర్వాత మరింతమంది ఇయు నాయకులు సైప్రస్ , గల్ఫ్ లోని మిత్రదేశాలకు రక్షణ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. రెండు రోజుల కింద, సైప్రస్ ద్వీపంలోని అక్రోటిరి వద్ద ఉన్న ఆర్ ఎఎఫ్ స్థావరంపై డ్రోన్లతో దాడులు జరిపిన తర్వాత, ఆ దేశానికి నౌకలు, వైమానిక రక్షణ దళాలను పంపుతున్నట్లు గ్రీస్, యుకె, ఫ్రాన్స్ తెలిపాయి. ఇప్పుడు ఇటలీ, స్పెయిన్ కూడా వారితో చేరాయి. నెదర్లాండ్స్ కూడా సహాయం అందించే విషయాన్ని పరిశీలిస్తోంది. నిదానంగా అయినా, యూరోప్‌లోని కీలక నాటో మిత్రదేశాలు ఐక్య కూటమిగా ఏర్పడుతున్నాయి. తొలుత ఈ యుద్ధంలో జోక్యం చేసుకోవడం పట్ల ఇటలీ, స్పెయిన్ అనాసక్తతను ప్రదర్శించాయి. ఇరాన్‌పై దాడి జరిపేందుకు మొరోన్, రోటాలో ఉన్న ఉమ్మడి వైమానిక స్థావరాలను అమెరికా ఉపయోగించుకోవడానికి నిరాకరించాయి. యూరోపియన్ యూనియన్, దాని తూర్పు సరిహద్దు పట్ల ఉన్న నిబద్ధత కారణంగా మిత్రదేశాల కూటమిలో చేరుతున్న స్పెయిన్ రక్షణ మంత్రి ఫ్రిగేట్ క్రిస్టోబోల్ కొలన్ ప్రకటించారు. గల్ఫ్‌లోని తమ భాగస్వాములకు రక్షణ కల్పిస్తున్నందున, అమెరికా యుద్ధ విమానాలు తమ స్థావరాలను తాత్కాలికంగా ఉపయోగించుకునేందుకు అధికారం ఇవ్వడానికి ఇటీవల అంగీకరించిన ఫ్రాన్స్ కు భిన్నమైన సందేశమిది. పొరుగు దేశాలపై బాంబు దాడి చేయాలనే ఇరాన్ నిర్లక్ష్య నిర్ణయాన్ని ఖండిస్తూ, బాంబు దాడుల కోసం అమెరికా విమానాలు ఇటలీలోని స్థావరాలను ఉపయోగించాలనుకుంటే, దానికి ప్రభుత్వం, పార్లమెంట్ రెండూ అనుమతి పొందాల్సి ఉంటుందని ఇటలీ ప్రధాని జార్జియా మెలోని అన్నారు. ఫ్రాన్స్, ఇటలీ, గ్రీస్ నుండి వెలువడిన నేటి ప్రకటనలను బట్టి చూస్తే, యూరోపియన్ మిత్రదేశాలు తూర్పు మధ్యధరా ప్రాంతంలో సంఘీభావం ప్రదర్శించాలనుకుంటున్నట్లే ఎర్ర సముద్రంలో నౌకా రవాణా భద్రతను కూడా నిర్ధారించాలని కోరుకుంటున్నట్టు కనిపిస్తోంది.

## యుద్ధం మన పెరట్లోకి వచ్చింది, మోడీ మౌనం వీడరా?

**న్యూఢిల్లీ, మార్చి 5 (వుదయం):**



శ్రీలంక దక్షిణ తీరంలో, హిందూ మహాసముద్ర అంతర్జాతీయ జలాల్లో అమెరికా జలాంతర్గామి ఇరాన్ యుద్ధనౌక ఐఆర్ఐఎస్ దేనాను పేల్చి, ముంచివేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటన కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీల నుండి విమర్శలకు దారితీసింది. ఈ సంఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మౌనం వహించడం, ప్రకటన విడుదల చేయక పోవడంపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ గురువారం విమర్శల వర్షం కురిపించారు. అమెరికా, ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం ఇంటి వెనుక ప్రాంగణానికి చేరుకుందని రాహుల్ గాంధీ పట్టి చూపారు. ఈ కీలకమైన అంశంపై ప్రధానమంత్రి స్పందించకపోవడంపై సందేహాలు వ్యక్తం చేశారు.

**ఏం జరిగింది?**
బుధవారంనాడు శ్రీలంక సమీపంలోని అంతర్జాతీయ జలాలలో ఇరాన్‌కు చెందిన సరికొత్త చిన్న యుద్ధనౌకలలో ఒకటైన ఐఆర్ఐఎస్ దేనాను అమెరికా జలాంతర్గామి పేల్చివేసింది. ఇరాన్‌పై దాడి చేసేందుకు అమెరికా భారతీయ ఓడరేవులను ఉపయోగిస్తోందన్న వార్తలను భారత్ గురువారం ఖండించింది. ఇరాన్‌పై దాడులు జరిపేందుకు భారతీయ నావికా దళ స్థావరాలను వాషింగ్టన్ ఉపయోగించుకుంటోందని యుఎస్ సైన్యంలో కల్నల్ డగ్లస్ మెక్‌గ్రాగర్ సూచించిన నేపథ్యంలో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దీనిపై స్పందించింది. ఒక అమెరికన్ ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చిన సమయంలో మెక్‌గ్రాగర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధమని ఎక్స్‌పై విదేశాంగ శాఖ ఫ్యాక్ట్ చెక్ ఖాతా పేర్కొంది. ఇటువంటి నిరాధారమైన, కల్పిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా మేము మిమ్మల్ని హెచ్చరిస్తున్నాం అని విదేశాంగ శాఖ ఎక్స్‌పై పేర్కొంది.

**ప్రతిపక్షం ఏమంటోంది?**
ప్రపంచం అస్థిర దశలోకి ప్రవేశించింది. ముందున్నది క్లిష్ట కాలం. భారతదేశ చమురు సరఫరాలు ముప్పులో ఉన్నాయి, మన దిగుమతుల్లో 40% కంటే ఎక్కువ హోర్ముజ్ జలసంధి ద్వారా రవాణా అవుతాయి. ఎల్‌పిజి, ఎల్ ఎన్‌జి పరిస్థితి మరింత దారుణంగా ఉంది, అంటూ సామాజిక మాధ్యమం ఎక్స్‌పై రాహుల్ గాంధీ హెచ్చరించారు. ఈ వివాదం మన ఇంటి వెనుక పెరటికి చేరుకుంది, ఇరాన్ యుద్ధనౌక హిందూ మహాసముద్రంలో మునిగిపోయింది. అయినప్పటికీ ప్రధానమంత్రి స్పందించలేదు. ఇలాంటి సమయంలో, మనకు స్థిరమైన నాయకత్వం అవసరం. బదులుగా, భారతదేశం మన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని ఇతరులకు అప్పగించిన, రాజీపడిన ప్రధానమంత్రిని కలిగి ఉంది, అని ప్రతిపక్ష నాయకుడు విమర్శించారు. అమెరికా చర్య భారతదేశంపై అపారమైన ప్రభావాలను కలిగిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేష్ పట్టి చూపారు. ఇరాన్ నౌక మునిగిపోవడంపై ఇంకా అధికారిక స్పందన రాకపోవడం ఆశ్చర్యకరమని ఆయన అన్నారు. మోడీ ప్రభుత్వం ఇరాన్‌లో జరిగిన హత్యలపై ఇంకా మౌనం వీడలేదు కనుక ఈ విషయంపై అధికారిక స్పందన లేకపోవడం ఆశ్చర్యం కలిగించదని రమేష్ పట్టి చూపారు. అమెరికాఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించడాన్ని ఆయన ప్రస్తావించారు. కాంగ్రెస్ మీడియా విభాగం చైర్‌పర్సన్ పవన్ ఖేడా కూడా ప్రధాని వైఖరిపై ప్రశ్నలు లేవనెత్తారు. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే: అమెరికా చర్యలను విమర్శించడానికి, ఇరాన్‌కు సంతాపం తెలియజేయడానికి, శ్రీలంకకు రక్షణ, సహాయ చర్యలలో మద్దతు ఇవ్వడానికి నైతిక ధైర్యాన్ని చూపిస్తారా? లేదా దానికి కూడా వాషింగ్టన్, టెల్ అవీవ్ నుండి అనుమతి అవసరమా? అంటూ ఆయన అడిగారు. భారతదేశం ఆహ్వానం మేరకు ఇరాన్ తన ఓడను 'మిలన్ ఎక్సర్‌సైజ్ 2026' కోసం పంపింది. ఈ ఓడ లక్షణాలను గౌరవనీయులైన రాష్ట్రపతి ముందు ప్రదర్శించారు. యునైటెడ్ స్టేట్స్ ఈ ఓడను కూల్చివేసింది, దీనిలో 100మందికి పైగా నావికులు మరణించారు మన అతిథులు మరణించారు మోడీ మౌనంగా ఉన్నారు, అని ఆప్ నాయకుడు, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు.

## ఖమేనీ మృతికి సంతాపం తెలిపిన భారత్



**న్యూఢిల్లీ, మార్చి 5 (వుదయం) :** ఇరాన్ సుప్రీం నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీ మరణానంతరం గురువారం నాడు భారత్ సంతాపం తెలిపింది. న్యూఢిల్లీలో గల ఇరాన్ రాయబార కార్యాలయాన్ని సందర్శించిన విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిశ్రి సంతాప పుస్తకంలో భారత ప్రభుత్వం తరుపున సానుభూతిని వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణకు సంబంధించిన సైనిక దాడుల్లో ఖమేనీ మరణించినట్లు వార్తలు వచ్చిన తర్వాత ప్రాంతీయంగా ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఈ చర్య వచ్చింది. భారత ప్రభుత్వం తరపున విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రి గురువారం న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయంలో సంతాప పుస్తకంలో సంతకం చేసి, హత్యకు గురైన ఇరాన్ సుప్రీం నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీకి సంతాపం తెలిపారు.

## ప్రపంచం భారత్ నుంచి నేర్చుకోవాలి

**న్యూఢిల్లీ, మార్చి 5 (వుదయం):**
ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యుఎన్ ఎస్‌సి)లో భారతదేశ శాశ్వత సభ్యత్వానికి ఫిన్‌లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ మద్దతు ఇచ్చారు, పరిణామం చెందుతున్న ప్రపంచ క్రమాన్ని రూపొందించడంలో భారత్ కీలక పాత్ర పోషించాలని అన్నారు. మార్చి 4 నుండి మార్చి 7 వరకు నాలుగు రోజుల భారత పర్యటనలో ఉన్న స్టబ్, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో కలిసి నిర్వహించిన ఉమ్మడి విలేకరుల సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. సార్వభౌమత్వాన్ని గౌరవించడంలో, ఆచరణాత్మక దౌత్యాన్ని అనుసరించడంలో భారతదేశం చేపట్టిన విధానం నుండి ప్రపంచం నేర్చుకోవచ్చని కూడా ఆయన అన్నారు.

**ప్రపంచ క్రమం మారుతోంది**
వేగంగా మారుతున్న ప్రపంచక్రమంలో భారతదేశ పాత్ర గురించి మాట్లాడుతూ, గ్లోబల్ సౌత్‌లో తన భాగస్వాములతో పాటుగా భారత్, అంతర్జాతీయ సంబంధాల భవిష్యత్ దిశను మలచడంలో తోడ్పడుతుందని స్టబ్ అన్నారు. ప్రపంచం మారుతోంది. ప్రపంచ క్రమ పరివర్తనలో మనం ఉన్నాం, భారత దేశం, గ్లోబల్ సౌత్‌లోని తన స్నేహితులతో కలిసి, ఈ క్రమం ఏ దిశలో సాగుతుందో నిర్ణయిస్తుంది. నేడు, ఈ ప్రాంతంలోని భద్రతా సమస్యలను గురించి మేం చర్చించాం. పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లో రక్షణ అంశాలు, సంఘర్షణల గురించి కూడా మేం చర్చించాం. యుద్ధాన్ని ముగించడం అందరికీ ప్రయోజనకరమనే అంగీకారానికి వచ్చాం. ఐక్యరాజ్య సమితి సూత్రాలను గౌరవిస్తేనే శాశ్వత శాంతిని సాధించగలం, అని ఆయన అన్నారు.

**ఫిన్‌లాండ్ అధ్యక్షుడు స్టబ్**



ఐరాస భద్రతా మండలిలో భారత్ సభ్యత్వానికి మద్దతు ప్రపంచ పాలనకు భద్రతా మండలిలో భారతదేశం ఉనికి చాలా కీలకమని స్టబ్ పునరుద్ఘాటించారు. భారతదేశం, యూరప్ మధ్య బలమైన సంబంధాల ప్రాముఖ్యతను కూడా ఆయన పట్టి చూపారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో స్థానం భారతదేశానికి చాలా ముఖ్యమైనదని నేను భావిస్తున్నాను. భారతదేశం, ఇయు మధ్య సంబంధాన్ని కూడా మేం చర్చించాం. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ముఖ్యమని తాను నమ్ముతున్నానని ఆయన అన్నారు. ఇది మంచి ప్రారంభం. సాంకేతికత నుండి క్వాంటం, ఉపగ్రహాలు, నెట్‌వర్క్‌లు, ఆహారం, గ్రీన్ టెక్ వంటి రంగాలలో పనిచేస్తున్న 20 ఫిన్నిష్ కంపెనీలు తనతో పాటు ఉన్నాయని చెప్పారు.

**భారతదేశ ఆర్థిక, వ్యూహాత్మక పాత్రకు ప్రశంసలు**
ప్రపంచంలోని అత్యంత ప్రభావవంతమైన దేశాలలో ఒకటిగా ఫిన్నిష్ అధ్యక్షుడు భారతదేశాన్ని అభివర్ణించారు. యూరప్‌కు వ్యూహాత్మక భాగస్వామిగా దాని ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. భారతదేశం ప్రపంచంలోని అతిపెద్ద , అత్యంత ప్రభావవంతమైన దేశాలలో ఒకటి, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం. ఇప్పుడు యూరప్‌కు కీలకమైన వ్యూహాత్మక భాగస్వామి. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో భారత్ ఒటి, దీనిని మనం ప్రతిరోజూ ఇక్కడ చూడవచ్చు అని ఆయన అన్నారు.

**ప్రపంచం కొంచెం భారతీయంగా మారాలి**
భారతదేశ విదేశాంగ విధానాన్ని స్టబ్ ప్రశంసించారు. దీనిని ఆచరణాత్మకమైన, వాస్తవికతపై ఆధారపడినదిగా అని అభివర్ణించారు. మీ విదేశాంగ విధానపు అందం ఏమిటంటే, మీరు ఎప్పుడూ ఎటువంటి భ్రమల్లో ఉండరు. మీరు ఎప్పుడూ మీ విదేశాంగ విధానాన్ని ఆచరణాత్మకమైన, వాస్తవికతపై ఆధారపడి రూపొందించుకుంటారు. బహుపాక్షికత, ప్రపంచ సహకారానికి మద్దతు ఇస్తూనే వ్యూహాత్మక అప్రమత్తతను కొనసాగించడం, స్వయంప్రతిపత్తిని కాపాడుకోవడం ఎంత ముఖ్యమో మీరు ప్రపంచానికి చూపించారు. ప్రపంచం కొంచెం భారతీయంగా మారాలని నేను వ్యక్తిగతంగా నమ్ముతున్నాను అని స్టబ్ పేర్కొన్నారు.




వుదయం






" భారత్, ఫిన్ లాండ్ లు చట్టబద్ధ పాలనకు కట్టుబడి ఉన్నాయి. చర్చలు, దౌత్యం ప్రధాన పరిష్కార మార్గాలని నమ్ముతున్నాయి. సైనిక ఘర్షణలు, యుద్ధాల వల్ల సమస్యలు, వివాదాలు కొలిక్కిరావని గట్టిగా భావిస్తున్నాయి. ఇది ఉక్రెయిన్ యుద్ధానికి, పశ్చిమాసియా సమరానికి ఒకేవిధంగా వర్తిస్తుంది. ఈ యుద్ధాలు త్వరలో ముగిసిపోవాలని ఆశిస్తున్నాము. అందుకోసం జరిగే కృషికి ప్రయత్నాలకు మా మద్దతు కొనసాగుతుంది. శాశ్వత శాంతిని నెలకొనాలన్నదే మా ఆకాంక్ష. సుస్థిరత్వం కోసం సౌభాగ్యం కోసం కలసి పనిచేసే స్వర్ణయుగంలో ఇండియా, యూరప్ లు ప్రవేశిస్తున్నాయి. ఈ రోజున ప్రపంచం ఆస్థిరత్వం, అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్నది. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయి. మా మధ్య పెరుగుతున్న సహకారం అంతర్జాతీయ సుస్థిరత్వానికి, అభివృద్ధికి కొత్తబలాన్ని ఇస్తుందని ఆశిస్తున్నాం. "

* – ఫిన్ లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ తో కలిసి ప్రధాని మోడీ

## వే'మన'పద్యం

ఒరుని చెరచెదమని యుల్లమందెంతురు
తమకు చేటెరుగని ధరణి నరులు
తమ్ము జెరచువాడు దైవంబులేడొకో
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# చంద్రబాబు ముగ్గురు బిడ్డల విధానం

దేశ జనాభా తగ్గిపోతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు, ఎక్కడో కాదు, సాక్షాత్తు ఆ రాష్ట్ర శాసనసభలోనే. అందుచేత దానికి విశేష ప్రాధాన్యమున్నది. ఒక రాష్ట్ర విధానకర్త శాసనసభానాయకుడు ఇటువంటి ఆందోళన వ్యక్తం చేయడం చిన్న విషయం కాదు. అందులోనూ దేశ జనాభా చైనాను కూడా దాటిపోయి 145 కోట్ల వద్ద భయపెడుతున్న సంగతి మాన్య ముఖ్యమంత్రికి తెలియదా?2025 లో భారత జనాభా 146 కోట్లు.అదే సమయంలో 2026 ప్రారంభం నాటికి చైనా జనాభా 140 కోట్లు పైచిలుకు మాత్రమే. దేశంలో వృద్ధులు తక్కువగా ఉండి పనివయసులోని జనాభా ఎక్కువ ఉంటే అది ఆ దేశ పురోభివృద్ధికి బాగా ఉపయోగపడుతుంది.ఈ రకంగా చూసుకున్నా ఇండియా లాభదాయక స్థితిలోనే ఉన్నది.ప్రపంచంలోనే అత్యధిక పనివయసు జనాభా ఇండియాలో ఉంది.2025 ఆరంభంలోనే దేశంలో పనివయసు (15-64)జనాభా 99కోట్ల 50 లక్షల మంది. నిజం చెప్పాలంటే ఇంతమంది పనివయసువారికి ఆత్మాభిమాన, ఆత్మ గౌరవ హాని లేని విధంగా సరైన పని కల్పించగల స్థితిలో మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేవు. రాజ్యాంగం 21 అధికరణ పూర్తిగా అమలుకు నోచుకోవడం లేదు.వాస్తవ పరిస్థితి ఇది అయితే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు ఇంటికి ముగ్గురు బిడ్డల కొత్త విధానాన్ని బోధించడం విడ్డూరంగా ఉంది. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిది మొదటి నుంచి ఆధునిక పాశ్చాత్య తరహా అభివృద్ధి వ్యూహమే తప్ప జనాభాకు సంబంధించిన అలోచన గతంలో ఎప్పుడూ ఆయన నుంచి వినబడలేదు. ఇప్పుడెందుకు వినిపిస్తోంది అనే దానికి సరైన సమాధానం లేదు.రెండవ, మూడవ బిడ్డను కనే దంపతులకు చంద్రబాబు పాతిక వేల రూపాయల ప్రోత్సాహకాన్ని కూడా ప్రకటించినట్టు వార్తలు చెబుతున్నాయి..ఒక పసిపాప పెరిగి మంచి వ్యక్తిగా, బాధ్యతగల పౌర లక్షణాలు పుంజుకునేలా రూపొందే క్రమంలో విద్య, వైద్య సదుపాయాలు, శారీరక ఆరోగ్యం,సౌష్టవం కల్పించడానికి మధ్యతరగతి, కింది వర్గాల ప్రజలకు ఎంత ఖర్చు అవుతుందో తెలియంది కాదు. అందులో ఏ పి ప్రభుత్వం ఇచ్చే పాతిక వేలు ఎంత? ఇది ప్రభుత్వం తన ప్రజలతో ఆడుతున్న కపట నాటకం కిందికే వస్తుంది.దేశ జనాభాలో మూడింట రెండొంతుల మంది ప్రభుత్వం కల్పించే ఆహార భద్రత మీద ఆధారపడి బతుకుతున్నారు.అంటే 20.21కోట్ల రేషన్ కార్డుల ద్వారా 80.26 కోట్లమంది లబ్ధి పొందుతున్నారు. వీరిలో అత్యధికులు తమ కాళ్ళ మీద తాము నిలబడలేని స్థితిలో ఉన్నట్టే కదా!ఉట్టికేగలేనమ్మ స్వర్గానికి నిచ్చెన వేసినట్టు పరిమిత సంతానానికే వసతులు కల్పించలేని పాలకులు మరింతమందిని కనాలని ప్రజలకు సూచించడంలోని విజ్ఞతారాహిత్యాన్ని ఏమనాలి? చంద్రబాబు నాయుడు మాదిరిగా అధిక సంతాన ఉద్బోధ చేసింది ఇతరులు ఎవరని ఆలోచిస్తే ఒకేఒక్క ప్రముఖుడు మనసులో మెదులుతారు. ఆయనే ఆర్ ఎస్ ఎస్ అధినేత మోహన్ భగవత్.దేశంలో జనాభాపరమైన సమతూకాన్ని కాపాడడానికి ప్రతి హిందువూ కనీసం ముగ్గురు పిల్లలను కనాలని గత నెలలో కూడా ఆయన ఉద్బోధించారు. ఇంతకు ముందు అనేకసార్లు మోహన్ భగవత్ ఈ ఉద్బోధకు పాల్పడ్డారు.మెజారిటీ హిందువులను వేరు చేసి వారికి ఇలా బోధించడంలో ఆర్ ఎస్ ఎస్ లక్ష్యమేమిటో వివరించనక్కరలేదు.చంద్రబాబు నాయుడు మాత్రం ఈ మతపరమైన విభజన జోలికి వెళ్లకపోవడం ఆయనలోని ఔన్నత్యానికి నిదర్శనమని భావించాలి.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# సాంకేతిక శతాబ్దంలో మారిన యుద్ధ స్వరూపం

ఇరవై ఒకటవ శతాబ్దంలో యుద్ధం స్వరూపం మూలాల నుంచి మారిపోయింది. ఒకప్పుడు యుద్ధం అంటే సరిహద్దుల్లో సైన్యాల సమీకరణ, భూమిపై ట్యాంకుల గర్జన, ఆకాశంలో యుద్ధ విమానాల భీభత్సం. నేడు యుద్ధం కనిపించక పోయినా జరుగుతుంది; శబ్దం వినిపించక పోయినా దేశాల వ్యవస్థలను కుదిస్తుంది; సైనికులు కాల్పులు చేయక ముందే శత్రుదేశం మౌలిక సదుపాయాలు స్తంభించిపోతాయి. ఆధునిక యుద్ధం అంటే సాంకేతిక ఆధారిత సమగ్ర దాడి. ఇది భూభాగం మీదే కాదు, సమాచార రంగంలో, అంతరిక్షంలో, ఆర్థిక వ్యవస్థలో, సైబర్ ప్రపంచంలో ఒకేసారి జరుగుతుంది. ఈ పరిణామాన్ని అర్థం చేసుకోవాలంటే గత రెండు దశాబ్దాల యుద్ధాల పూర్వాపరాలను పరిశీలించాల్సి ఉంటుంది. సోవియట్ విఘటనతో అమెరికా అగ్రశక్తిగా ఎదిగింది. గల్ఫ్ యుద్ధం, ఇరాక్ దాడి, ఆఫ్ఘనిస్తాన్ యుద్ధం వంటి సంఘటనల్లో అమెరికా సాంకేతిక ఆధిక్యం స్పష్టమైంది. ఉపగ్రహ మార్గ దర్శిత క్షిపణులు, ఖచ్చిత లక్ష్య ఛేదన వ్యవస్థలు, గూఢచర్య ఉపగ్రహాలు యుద్ధాన్ని వేగవంతం చేశాయి. 1991 గల్ఫ్ యుద్ధంలో అమెరికా వాడిన ఖచ్చిత లక్ష్య క్షిపణుల శాతం సుమారు ఏడు శాతం మాత్రమే ఉండగా, 2003 నాటికి ఇరాక్ యుద్ధంలో అది అరవై శాతానికి పైగా పెరిగింది. ఇది సాంకేతిక పరిణామ వేగానికి నిదర్శనం. 2001 తర్వాత డ్రోన్ యుద్ధం ప్రారంభమైంది. ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ ప్రాంతాల్లో వందల సంఖ్యలో డ్రోన్ దాడులు జరిగాయి. మానవ నష్టం తగ్గించాలనే ఉద్దేశంతో ప్రారంభమైన ఈ విధానం ఇప్పుడు ప్రధాన యుద్ధ వ్యూహంగా మారింది. లాటిన్ అమెరికాలోని వెనిజులా రాజకీయ సంక్షోభం సాంకేతిక యుద్ధం యొక్క మరో రూపాన్ని చూపించింది. అక్కడ ప్రత్యక్ష సైనిక దాడి జరగలేదు; కానీ ఆర్థిక ఆంక్షలు, బ్యాంకింగ్ వ్యవస్థపై నియంత్రణలు, చమురు ఎగుమతుల నిరోధం ద్వారా ఆ దేశ ఆర్థిక వ్యవస్థను బలహీన పరిచే ప్రయత్నాలు జరిగాయి. సైబర్ దాడుల ఆరోపణలు, విద్యుత్ వ్యవస్థలో అంతరాయాలు కూడా నమోదయ్యాయి. అంటే ఆధునిక యుద్ధం ఎప్పుడూ బాంబుల తోనే జరగదు; ఆర్థిక, సాంకేతిక ఒత్తిడి కూడా యుద్ధమే.

మధ్య ప్రాచ్యంలో ఇరాన్ పరిస్థితి మరింత సంక్లిష్టం. ఇరాన్ అణు కార్యక్రమం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. అంతర్జాతీయ అణు శక్తి సంస్థ నివేదికల ప్రకారం ఇరాన్ యురేనియం శుద్ధి శాతం 60కు పైగా చేరినట్లు గత సంవత్సరాల్లో వెల్లడైంది. అణు ఆయుధ తయారికి 90 శాతం శుద్ధి అవసరం. ఈ పరిణామం ఇజ్రాయిల్‌కు తీవ్రమైన భద్రతా ఆందోళన. ఇజ్రాయిల్ తన భద్రతను కాపాడేందుకు ముందస్తు దాడులు చేయాలనే సిద్ధాంతాన్ని అనుసరిస్తోంది. 1981లో ఇరాక్ అణు రియాక్టర్‌పై ఇజ్రాయిల్ చేసిన వైమానిక దాడి దీనికి ఉదాహరణ. 2007లో సిరియాలో అనుమానిత అణు కేంద్రాన్ని కూడా ఇజ్రాయిల్ ధ్వంసం చేసింది. ఈ చరిత్రను పరిగణనలోకి తీసుకుంటే ఇరాన్ విషయంలో కూడా సాంకేతిక ఆధారిత గూఢచర్యం, సైబర్ దాడులు, లక్ష్యిత చర్యలు కొనసాగు తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. సైబర్ యుద్ధంలో అత్యంత ప్రాచుర్యం పొందిన ఉదాహరణ స్టక్స్‌నెట్ అనే వైరస్. స్టక్స్‌నెట్ (Stuxnet) అనేది



2010లో వెలుగులోకి వచ్చిన అత్యంత అధునాతనమైన, ప్రమాదకరమైన కంప్యూటర్ వార్మ్ (worm) మాల్వేర్. ఇది ప్రధానంగా ఇరాన్ అణు కేంద్రాలలోని పారిశ్రామిక నియంత్రణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని, భౌతిక యంత్రాలను (సెంట్రిఫ్యూజ్‌లు) నాశనం చేయడానికి రూపొందించ బడింది. ఇది సైనిక దాడి కాకుండా కంప్యూటర్ కోడ్ ద్వారా చేసిన యుద్ధం. ఈ సంఘటన తర్వాత ప్రపంచ దేశాలు సైబర్ భద్రతపై భారీగా పెట్టుబడులు పెట్టడం ప్రారంభించాయి. నేటి పరిస్థితుల్లో ఒక దేశ విద్యుత్ గ్రిడ్, నీటి సరఫరా, రైల్వే కమ్యూనికేషన్, బ్యాంకింగ్ వ్యవస్థ— సైబర్ దాడులకు గురయ్యే అవకాశం ఉంది. డ్రోన్ యుద్ధం కూడా విస్తరించింది. 2020 జనవరి 3న మధ్య ప్రాచ్య రాజకీయాలను కుదిపేసిన ఒక కీలక సంఘటనలో... అమెరికా నిర్వహించిన డ్రోన్ దాడిలో ఖాసిం సొలేమానీ మరణించారు. ఖాసిం సొలేమానీ ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్‌లోని కుద్స్ దళానికి ప్రధానాధికారిగా ఉన్నారు. ఆయనను ఇరాన్‌లో జాతీయ హీరోగా పరిగణించేవారు. ఈ సంఘటన ఆధునిక యుద్ధంలో లక్ష్యిత హత్యలు ఎలా సాధ్యమవు తున్నాయో చూపించింది. అయితే ఇరాన్ అగ్ర నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ ఖతం టెక్నాలజీ వినియోగానికి తిరుగులేని సాక్ష్యం. ఈ ఉదాహరణలు చూపిస్తున్నది ఏమిటంటే నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకునే సాంకేతిక సామర్థ్యం పెరిగింది; కానీ ప్రతి వార్త నిజం కాదని కూడా గుర్తుంచు కోవాలి. సమాచార యుద్ధం లోపల తప్పుడు ప్రచారం కూడా ఆయుధం గానే వాడ బడుతోంది. ఇప్పుడు అమెరికా పాత్రను పరిశీలించాలి. అమెరికా ప్రపంచ వ్యాప్తంగా సైనిక స్థావరాలు కలిగిన దేశం. దాని రక్షణ వ్యయం ప్రపంచంలోనే అగ్రస్థానం. 2023 అంచనాల ప్రకారం అమెరికా రక్షణ వ్యయం ఎనిమిది వందల బిలియన్ డాలర్లకు పైగా ఉంది. అదే సమయంలో చైనా రక్షణ వ్యయం సుమారు మూడు వందల బిలియన్ డాలర్లకు సమీపంలో ఉంది. రష్యా వ్యయం తక్కువగానే ఉన్నా సైనిక సాంకేతికతలో ప్రత్యేక నైపుణ్యం కలిగిన దేశం. భారత దేశం కూడా ప్రపంచంలో అగ్ర రక్షణ వ్యయం కలిగిన దేశాల్లో ఒకటి. ఈ గణాంకాలు ప్రపంచంలో శక్తి సమీకరణాలు మారుతున్నాయని సూచిస్తున్నాయి. అమెరికా చర్యలు కేవలం ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకున్నవేనా అనే ప్రశ్నకు తక్షణ సమాధానం లేదు. మధ్య ప్రాచ్యంలో చమురు మార్గాల భద్రత, ఇజ్రాయిల్ రక్షణ, అణు వ్యాప్తి నియంత్రణ— ప్రత్యక్ష కారణాలు. కానీ దీని వెనుక గ్లోబల్ శక్తి సమతుల్యత అంశం కూడా ఉంది. చైనా ఆర్థిక ప్రభావాన్ని పెంచుకుంటూ మధ్య ప్రాచ్య దేశాలతో సన్నిహిత సంబంధాలు పెంచుతోంది. రష్యా సిరియా యుద్ధంలో సైనికంగా జోక్యం చేసుకుని తన ప్రభావాన్ని చాటింది. ఈ నేపథ్యంలో అమెరికా తన మిత్ర దేశాలకు మద్దతు ఇవ్వడం ద్వారా ప్రత్యర్థి శక్తులకు పరోక్ష సందేశం పంపుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఇది ప్రత్యక్ష యుద్ధం ప్రారంభించడమనే అర్థం కాదు; వ్యూహాత్మక ఆధిపత్యాన్ని కాపాడుకోవాలనే ప్రయత్నం.

భవిష్యత్తు యుద్ధాలపై దృష్టిపెడితే సాంకేతికత మరింత కీలకం కానుంది. హైపర్సోనిక్ క్షిపణులు శబ్ద వేగం కంటే ఐదు రెట్లు వేగంగా ప్రయాణించ గలవు. ఇవి సంప్రదాయ క్షిపణి నిరోధక వ్యవస్థలకు సవాల్. అంతరిక్షంలో ఉపగ్రహాలపై దాడులు చేసే సామర్థ్యం పెరుగుతోంది. ఉపగ్రహాల ద్వారా కమ్యూనికేషన్, నావిగేషన్, గూఢచర్యం జరుగుతున్నందున వాటి ధ్వంసం ఒక దేశాన్ని అంధుడిని చేయడమే. కృత్రిమ మేధస్సు ఆధారిత స్వయంచాలక ఆయుధాలు మానవ జోక్యం లేకుండానే లక్ష్యాన్ని ఛేదించే స్థాయికి చేరుకుంటున్నాయి. ఇది నైతిక, చట్టపరమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. సమాచార యుద్ధం కూడా భవిష్యత్తులో ప్రధాన రంగం. తప్పుడు వార్తలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం, ఎన్నికలపై ప్రభావం చూపే ప్రయత్నాలు—ఆధునిక పోరాట పద్ధతులే. ఒక దేశాన్ని లోపల నుంచే విభజించడం, ప్రజల్లో అనిశ్చితి సృష్టించడం యుద్ధ వ్యూహంలో భాగమవుతోంది. ఆర్థిక ఆంక్షలు, వాణిజ్య నిరోధాలు కూడా యుద్ధ ఆయుధాలుగా మారాయి. ఈ సమగ్ర పరిస్థితుల్లో దేశాల భద్రత అంటే కేవలం సైనిక బలం కాదు. సాంకేతిక స్వావలంబన, సైబర్ రక్షణ, అంతరిక్ష సామర్థ్యం, ఆర్థిక స్థిరత్వం— సమానంగా అవసరం. శత్రువు ఎక్కడి నుంచి దాడి చేస్తాడో తెలియని కాలం ఇది. సరిహద్దు దాటి సైన్యం రాకపోయినా డేటా ద్వారా దాడి జరగవచ్చు. విద్యుత్ నిలిచి పోవచ్చు. బ్యాంకింగ్ వ్యవస్థ కుదేలవచ్చు. ప్రజాభిప్రాయం మారి పోవచ్చు. మొత్తంగా ఆధునిక యుద్ధం ఒక సమగ్ర సాంకేతిక పోరు. వెనిజులా ఉదాహరణ ఆర్థిక-సైబర్ ఒత్తిడి రూపాన్ని చూపిస్తే, ఇరాన్ ఉదాహరణ అణు రాజకీయాలు, డ్రోన్ దాడులు, సైబర్ యుద్ధం, దౌత్య ఒత్తిడి— కలిసిన సంక్లిష్ట సమీకరణాన్ని చూపుతోంది. అమెరికా చర్యల వెనుక ప్రాంతీయ భద్రతా అవసరాలే ప్రధాన కారణమని ఒక వాదన; గ్లోబల్ శక్తి సమతుల్యతను కాపాడుకోవాలనే వ్యూహం కూడా భాగమని మరో వాదన. ఏదేమైనా యుద్ధ స్వరూపం శాశ్వతంగా మారిపోయింది. భవిష్యత్తులో దేశాలపై దాడులు వేగవంతంగా, ఖచ్చితంగా, కనీస మానవ నష్టంతో కానీ గరిష్ఠ వ్యూహాత్మక ప్రభావంతో జరిగే అవకాశముంది. ఈ వాస్తవాన్ని అంగీకరించి దేశాలు తమ రక్షణ విధానాలను పునర్ వ్యవస్థీకరించు కోవాల్సిన కాలం ఇది.



సంగనబట్ల
9440595494

## మధ్య ప్రాచ్యానికి ఆ పేరు ఎలా వచ్చింది?

ప్రస్తుతం పశ్చిమాసియా అట్టుడికిపోతోంది. అమెరికా, ఇజ్రాయెల్ చేసిన ఉమ్మడి దాడిలో ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా ఖమేనీ సహా పలువురు నాయకులు మరణించిన విషయం తెలిసిందే. దానితో ప్రస్తుతం ఆ పేరు తరచుగా వినిపిస్తోంది. కానీ పశ్చిమాసియా అని కాదు, మధ్యప్రాచ్యమని. ఇంతకీ పశ్చిమాసియాను మధ్యప్రాచ్యమని ఎందుకంటారు? నిన్న మొన్నటి వరకూ అందరూ కూడా యాంత్రికంగా అదే పదాన్ని ఉపయోగించేవారు. అసలు మధ్య ప్రాచ్యమనే పేరును ఆ ప్రాంతానికి ఎవరు ఇచ్చారు? ఆధునిక కాలంలో కూడా దానిని మధ్య ప్రాచ్యమని పిలవడం

**ఎంతవరకూ సమంజసం?** : మధ్య ప్రాచ్యమనే పేరు ఎక్కడి నుంచి వచ్చింది? ఈ పదాన్ని తొలుత 1850ల్లో బ్రిటిష్ ఇండియా అధికారులు తమ సౌకర్యం కోసం ఈ పదాన్ని సృష్టించినా, అమెరికన్ నావికాదళ వ్యూహకర్త ఆల్ఫ్రెడ్ థాయెర్ మహన్ 1902లో ప్రాచుర్యంలోకి తెచ్చాడు. మధ్యప్రాచ్యమనే పదం నిజానికి ఒక రాజకీయ నిర్మితి మాత్రమే, దానికి భౌగోళిక వాస్తవాలతో సంబంధం లేదు. నిజానికి బ్రిటిష్ వారు ఆసియా ప్రాంతాన్ని మూడు ప్రత్యేక ప్రాంతాలుగా తమ సౌకర్యం కోసం విభజించుకొని నామకరణం చేశారు. ఒకటి నియర్ ఈస్ట్ – ఒట్టమాన్ సామ్రాజ్యం, బాల్కన్ ప్రాంతాలు ఉన్న ప్రదేశం. ఫార్ ఈస్ట్ అన్నది పసిఫిక్ మహా సముద్రం వెంట ఉన్న ఆసియా దేశాలు. వీటి మధ్య ఉన్న ప్రాంతానికి మిడిల్ ఈస్ట్ అని వారు పేరు పెట్టారు. బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రయోజనాలను గురించి రాస్తూ, పర్షియన్ గల్ఫ్, భారతదేశం మధ్య ఉన్న ప్రాంతాన్ని మిడిల్ ఈస్ట్ అంటే మధ్య ప్రాచ్యమని ఆయన పేర్కొన్నాడు. ఆయన యూరోప్‌ను దృష్టిలో పెట్టుకుని ఆ ప్రాంతాన్ని ఆ దృష్టితో చూశాడు. ఈ దృక్పథం నుంచి చూస్తే, యూరోప్ కేంద్ర ప్రదేశంలో ఉంది. బ్రిటిష్ సామ్రాజ్యం ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించిన నేపథ్యంలో, తన విస్తృత ప్రాంతాలకు ఒక పేరు కావలసి వచ్చింది. లండన్‌కు తూర్పున ఉండడంతో ఈజిప్టు వంటి దేశాలను కూడా మధ్య ప్రాచ్యంలో జత చేశారు. కానీ ఇది తూర్పు ఆసియాలో అంత దూరంగా లేదు. బ్రిటిష్ ఇండియాను ఫార్ ఈస్ట్‌గా పరిగణించేవారు. ఎందుకంటే, అది సామ్రాజ్యవాద యూరోప్ కు తూర్పున సుదూరంగా ఉంది.

**ఈ పదం ఎందుకు కొనసాగింది?** : మిడిల్ ఈస్ట్ లేదా మధ్య ప్రాచ్యం అనే పదం కొనసాగడానికి కారణం దాని సరిహద్దులు నిర్వచించక పోవడమే. కాలక్రమంలో ఆ ప్రాంతాన్ని ప్రస్తావించేందుకు క్లుప్త పదంగా దీన్ని ఉపయోగించడం ప్రారంభించారు. కానీ, ఆ ప్రాంతంలో ఉన్న దేశాలు అన్నీ కూడా తమ తమ సంస్కృతి, భాష, భౌగోళిక ప్రాంతాన్ని కలిగి ఉన్నాయి. మనకు మిడిల్ ఈస్ట్ అన్న పదాన్నిఇచ్చినవారే ఫార్ ఈస్ట్ అనే పదాన్ని కూడా ఇచ్చారు. ఈ ప్రతి పదం కూడాయూరోప్‌ను కేంద్రంగా దృష్టిలో ఉంచుకొని, ప్రతి ప్రాంతాన్ని వాటిదూరాన్ని బట్టి వివరించారు.భారతదేశం స్వాతంత్రం సాధించిన తర్వాత, దేశ తొలి ప్రధానిజవహర్‌లాల్ నెహ్రూ ఈ పదం స్థానంలో పశ్చిమాసియా అనే పదాన్నిఉపయోగించాలని వాదించారు. అప్పట్లో చాలామంది ఆయన సూచనను సమర్థించారు. కానీ, మధ్య ప్రాచ్యమనే పదాన్ని వాడుకగా ఉపయోగించడం మానలేదు.

## డాక్టరేట్ లెక్చరర్లకు రీసర్చ్ ప్రాజెక్టులు ఇవ్వాలి

యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్ ఆధ్వర్యంలో వివిధ యూనివర్సిటీ ప్రొఫెసర్లకు వివిధ అంశాలలో పరిశోధన ప్రాజెక్టులను ఇస్తున్నట్లుగానే తెలంగాణ రాష్ట్రంలోని గురుకులాలలో కళాశాలలో డాక్టరేట్ పట్టా పొందిన లెక్చరర్లకు కూడా పరిశోధన ప్రాజెక్టులను మంజూరు చేయాలి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిశోధనలకు ప్రాధాన్యత కల్పించాలి. ప్రతి సంవత్సరం రాష్ట్ర బడ్జెట్ లో పరిశోధనల కోసం నిధులు మంజూరు చేయాలి. ఆర్థిక సామాజిక రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి గాను పరిశోధనలు మెరుగుపరచాలి . డాక్టరేట్ లెక్చరర్ లకు తెలంగాణ రాష్ట్రంలోని విద్యారంగంలో నూతన సంస్కరణలో భాగంగా విద్యా విధానంలో మార్పులు విద్యాభివృద్ధికి గాను పరిశోధనలు అవసరం. కేంద్ర ప్రభుత్వం పంచవర్ష ప్రణాళికల కాలంలో వ్యవసాయ రంగం, పరిశ్రమల రంగం, గ్రామీణ అభివృద్ధితో పాటుగా ప్రస్తుతం ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ. వికలాంగుల. మహిళా సంక్షేమం వంటి అంశాలపై 2026-2027 ఆర్థిక సంవత్సరం నుండి తెలంగాణ రాష్ట్రంలో వివిధ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల అమలు విధానంలో తప్పనిసరిగా పరిశోధనలు జరగవలసిన అవసరం ఉంది. అందుకుగాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల నుండి వివిధ అంశాలపై పరిశోధనలు చేసి డాక్టరేట్ పట్టా పొందిన వారితో పరిశోధనలు కొనసాగించవలసిందిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి.

డాక్టర్. ఈదునూరి
వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

# అమెరికా సామ్రాజ్యవాద యుద్ధోన్మాదం

సామ్రాజ్యవాద రక్త పిపాసి అమెరికా మరో సారి ఇరాన్ పై విరుచుకుపడింది. తన పెంపుడు బిడ్డ ఇజ్రాయిల్ తో కలిసి 28-2-26న ఇరాన్ లోని అనేక ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. ఇరాన్ సుప్రీమ్ నాయకుడు అలీ ఖమేని హత్య చేసింది. ఇంకా అనేక మంది ఇరాన్ నాయకులు అమెరికా దాడిలో మరణించారు. ఆధునిక కాలంలో యుద్ధాలకు మూలం సామ్రాజ్యవాద మే. సామ్రాజ్యవాదుల మోసపూరితమైన శాంతి పంథానూ, దురాక్రమణ పూరితమైన




యుద్ధాలను రెండు చేతులా ఉపయోగిస్తారు. తాము జరిపిన దురాక్రమణ యుద్ధాలనూ, యుద్ధ ప్రయత్నాలను శాంతి వచనాల ముసుగుతో కప్పిపెట్టుకో ప్రయత్నిస్తారని లెనిన్ మహాశయుడు అన్నారు. ఆయన ఇంకా ఇలా అన్నారు. సామ్రాజ్యవాద ప్రభుత్వాలు శాంతి గురించి కబుర్లు చెబుతాయి . వాస్తవంలో ఆక్రమణ యుద్ధాలను, బందిపోటు దండయాత్రలను కొనసాగిస్తాయి. సాత్విక వాదాన్ని ప్రచారం చేయడంలో ఒకే ఒక్క ఆశయమున్నది. శాంతిని గురించి వాగాడంబరంతో ప్రజలను మోసగించడం దాని చాటున మరో కొత్త యుద్ధానికి సన్నాహాలు చేయడం ,ఇదే సామ్రాజ్యవాద ఆవశ్యమని వివరించారు స్టాలిన్. లెనిన్, స్టాలిన్ చెప్పిన మాటలు నేడు అమెరికా సామ్రాజ్యవాదానికి వర్తిస్తాయి. అది చేసిన దురాక్రమణ యుద్ధాలకు, సైనిక జోక్యాలకు కమ్యూనిజం, టెర్రరిజం వల్ల ప్రపంచ శాంతికి ప్రమాదం ఏర్పడుతుందని, శాంతి ఏర్పడాలంటే వాటిపై దాడి చేయాలని అమెరికా చెబుతూ తన దురాక్రమణ విధానాలను సమర్థించుకుంటున్నది. ఇరాన్ పై దాడికి ఇలాంటి శాంతి జపాన్నే వల్లిస్తూ ఉన్నది. ఇరాన్ యురేనియం శుద్ధి పెద్దఎత్తున కొనసాగిస్తూ అణ్వాయుధాల తయారీకి సిద్ధమౌతున్నదని, పెద్దఎత్తున మిస్సైల్స్ ఉత్పత్తి చేసిందని ఇది ప్రపంచానికి ముఖ్యంగా అమెరికా రక్షణకు చాలా ప్రమాదమని అందుకే ఇరాన్ యురేనియం శుద్ధి కార్యక్రమాన్ని ఆపివేయాలని లేని వెడల దానిపై ఆంక్షలు విధిస్తామని అవసరమైతే దాడి కూడా చేస్తామని అమెరికా బెదిరింపులు ప్రారంభించింది. ఇరాన్ విధానాల వల్ల పశ్చిమాసియా కి ప్రమాదమని ముఖ్య గా తన పెంపుడు బిడ్డ ఇజ్రాయిల్ కి ప్రమాదమని అమెరికా బావిస్తున్నది. అందుకే ఇరాన్ ను తన చెప్పు చేతుల్లో ఉంచుకునేందుకు అవసరమైన విధానాలు అమలు జరుపుతున్నది. ఇరాన్ లో సహజ వనరులు అనేకం ఉన్నాయి. ప్రపంచం లోనే అగ్రశ్రేణి ఇంధన వనరులు కలిగిన దేశం. ప్రపంచంలో 3వ అతిపెద్ద సహజ వనరుల నిల్వలను మరియు 2వ అతిపెద్ద సహజ వాయువు నిల్వలు కలిగి ఉంది.బొగ్గు, రాగి, సీసం, యురేనియం వంటి ఖనిజ సంపద పుష్కలంగా ఉన్న దేశం. ఇవి కాక కుంకుమ పువ్వు, పిస్తా వంటి వ్యవసాయ ఉత్పత్తులలో కూడా అగ్ర స్థానంలో ఉంది. ఇరాన్ లో208.6 మిలియన్ల చమురు నిల్వలు మరియు ఇతర ఖనిజాలు, సుమారు 2కోట్ల, 20 లక్షల టన్నుల స్వచ్ఛమైన బంగారం ఉన్నాయి. వీటి విలువ 27.30 ట్రిలియన్ డాలర్లు. ఇరాన్ యొక్క విస్తారమైన సహజ వనరులను తన అవసరాలకు వినియోగించుకునే విధానాలు అమలు జరిపేలా ఆ దేశ పాలకులను అమెరికా ప్రభావితం చేసింది.

అమెరికా మద్దతుతో కొనసాగిన షా మొహమ్మద్ రెజా పహ్లవి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటుకి షా నిరంకుశ పాలన, అమెరికా అనుకూల విధానాలు, తీవ్ర ఆర్థిక అసమానతలు , మరియు ఇస్లామిక్ సాంప్రదాయాలను విస్మరించడం, అవినీతి, సామాజిక అణచివేత కారణాలుగా ఉన్నాయి. చమురు కార్మికులు సమ్మెలు చేశారు. ప్రవాసంలో ఉన్నఖొమేని షా పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపర్చాడు. ప్రజల తిరుగుబాటుతో షా ప్రభుత్వం కూలి పోయింది.1979 ఇరాన్ విప్లవం తర్వాత అమెరికా దోపిడీ ప్రయోజనాలకు ఆటంకం ఏర్పడింది. ఫలితంగా ఇరాన్ పట్ల అమెరికా శత్రుత్వ వైఖరి చేపట్టింది. రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఇరాన్ అణు శుద్ధి కార్యక్రమం మధ్యప్రాచ్యంలో ప్రభావం చూపింది. తన పెంపు బిడ్డ ఇజ్రాయిల్ కు, తన ప్రయోజనాలకు ఇరాన్ ఆటంకంగా ఉందని అమెరికా భావించింది.దానిపై దాడి చేయడానికి ఉగ్రవాదానికి ఇరాన్ మద్దతు ఇస్తుందనే ప్రచారం అమెరికా ప్రారంభించింది. 1985 నుంచి ఇజ్రాయిల్ ని ఇరాన్ పై ఘర్షణకు సిద్ధమైంది.

2018లో సంయుక్త సమగ్ర కార్యాచరణ ప్రణాళిక నుండి వైదొలిగిన అమెరికా, ఇరాన్ పై అనేక ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షలు ఇరాన్ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఇరానియన్ రియాల్ కరెన్సీ విలువ గణనీయంగా తగ్గింది. ఇరాన్ తో వ్యాపారం చేసే అనేక అంతర్జాతీయ బ్యాంకులు భారీ జరిమానాలు చెల్లించాయి. అన్ని ప్రధాన యూరోపియన్ కంపెనీలు అమెరికాకు భయపడి ఇరాన్ తో వ్యాపారం మాని వేశాయి. ఫలితంగా ఆర్థికంగా ఇరాన్ బాగా దెబ్బతిన్నది.

అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ రష్యా, చైనాలతో అనేక ఒప్పందాలు చేసుకుంది. 2025 జనవరిలో రష్యాతో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంపై సంతకం చేయగా, చైనాతో 2021లో 25 సంవత్సరాల సహకార ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందాలు సైనిక, ఆర్థిక సహకారానికి పెంచుకోవడానికి ఇరాన్ కు తోడ్పడ్డాయి. రష్యా ప్రధానంగా ఇరాన్ కు ఆయుధ సరఫరా దారుగా ఉంది. చైనాతో కుదిరిన 25 ఏళ్ల సమగ్ర సహకార ఒప్పందం ద్వారా చైనా నుంచి ఇరాన్ ఇంధన రంగానికి భారీగా నిధులు పొందింది.

చైనా, రష్యా, ఇరాన్, ఉత్తర కొరియా దేశాలు, పాశ్చాత్య దేశాల ఆర్థిక ఆధిపత్యాన్ని ముఖ్యంగా అమెరికా ఆంక్షలను సవాలు చేయడానికి ఒక భౌగోళిక, రాజకీయ కూటమిగా ఏర్పడ్డాయి. ఈ ఒప్పందాలు వల్ల షాంఘై సహకార సంస్థ బ్రిక్స్ ద్వారా సహకారాన్ని పొందుతున్నాయి. రష్యా, చైనాలతో ఒప్పందాలు తన ప్రపంచ ఆధిపత్య విధానాలకు ప్రమాదంగా అమెరికా భావించింది. తన ఆధిపత్య విధానాలకు వ్యతిరేకంగా ఉన్న ఉన్న ఇరాన్ ను దెబ్బ తీయడానికి ఆ దేశంపై దాడులు ప్రారంభించింది. 2003లో, 2024లో, 2025లో ఇరాన్ పై దాడులు చేసింది. వెనిజులా పై దాడి తర్వాత ఇరాన్ ను అమెరికా లక్ష్యంగా చేసుకుంది. దానిపై దాడి చేయడానికి కుంటి సాకులు ప్రచారం చేయడం ప్రారంభించింది. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తున్నదని దానివల్ల ప్రపంచానికి, అమెరికాకు ప్రమాదమని పేర్కొంది. యురేనియం శుద్ధిని, అణ్వాయుధాల తయారీని మానుకోవాలని అందుకు చర్చలకు రావాలని, చర్చలకు రాక పోతే ఇరాన్ పై దాడి చేస్తామని బెదిరించింది. ఇరాన్ చర్చలకు ఆమోదం తెలిపింది. రెండు దేశాల మధ్య చర్చలు జరిగాయి. జెనీవాలో రెండవ రౌండ్ చర్చలు జరగాల్సి ఉంది. ఈ సందర్భంగా 27-2-26న ఒమన్ విదేశాంగ మంత్రి బదర్ అల్ బుసైది మాట్లాడుతూ, చర్చల్లో పురోగతి ఉందని చెప్పారు. రెండవ దఫా చర్చలు జరగాల్సిన సమయంలో ఇరాన్ కి వ్యతిరేకమైన అనేక ప్రకటనలు అమెరికా చేసింది. ఇరాన్ చుట్టూ యుద్ధ నౌకలను మోహరించింది. అనేక బెదిరింపులు చేస్తూ 28-2-26న ఇజ్రాయిల్ తో కలిసి ఇరాన్ పై దాడి చేసింది. దీంతో దాని శాంతి చర్చల భూటకత్వం వెల్లడైంది. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తున్నదని అది ప్రపంచానికి ప్రమాదమని అమెరికా చెప్పడం పెద్ద వింతగా ఉంది. పెద్ద ఎత్తున అణ్వాయుధాలతో ప్రపంచ దేశాలను బెదిరిస్తున్న అమెరికా ప్రపంచానికి ప్రమాదమా, దేశ అవసరాల కోసం యురేనియం శుద్ధి చేసుకుంటున్న ఇరాన్ ప్రపంచానికి ప్రమాదమా! అణ్వాయుధాల ప్రమాదం గురించి మాట్లాడే అమెరికా, తన వద్ద ఉన్న అణ్వాయుధాలను ఎందుకు నాశనం చేయడం లేదు. తను మాత్రం అణ్వాయుధాలు కలిగి ఉండాలి, ఇతర దేశాలకు ఉండ గూడదని చెప్పే నైతిక హక్కు అమెరికాకు ఎక్కడ ఉంది. అమెరికా దాడిని అనేక దేశాలు ఖండించగా, భారత ప్రధాని మోదీ మాత్రం ఖండించలేదు. ఇరాన్ దాడులను మాత్రం ఖండించారు. ఇది అమెరికాకు లొంగుబాటు విధానం కాదా! అమెరికా రకరకాల ప్రకటనలు చేస్తున్నది.ఇరాన్ పై దాడి చేసి ఖొమైనీతో సహా అనేక మంది నాయకులను చంపామని గొప్పలు చెప్పుకుంది. ఆచరణ లో అమెరికాకు తీవ్ర నష్టాలు జరిగిన తర్వాత యుద్ధాన్ని తాము ప్రారంభించలేదని, కాని యుద్ధాన్ని తామే ముగిస్తామని ఆ దేశ రక్షణ మంత్రి చేసిన ప్రకటన వింతగా ఉంది. చివరికి రెండు వైపుల నష్టాలు జరిగాయని ఒప్పుకోక తప్పలేదు. ఇరాన్ పై అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణ దాడిని ప్రపంచ ప్రజలూ ఖండించి దానికి వ్యతిరేకంగా ఉద్యమించాలి. అమెరికా సామ్రాజ్యవాదం మట్టి కాళ్ల మహా రాక్షసి. ఒక్క నెట్టు నెడితే కూలి పోతుంది. ఈ వాస్తవాన్ని అనేక దేశాల విప్లవ ప్రజలు రుజువు చేశారు.



బొల్లిముంత
సాంబశివరావు
9885983526

# పారిశుధ్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి మార్చి 05(వుదయం జిల్లా ప్రతినిధి):**



పారిశుధ్ధ్య కార్యక్రమాలు, పరిశుభ్రత, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.6వ తేదీ నుండి ప్రారంభం కానున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు నేపథ్యంలో గురువారం వివిధ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, పారిశుధ్ధ్య కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలలో స్వచ్ఛత కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు శుభ్రమైన వాతావరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు.అలాగే వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు సేవలను వేగవంతంగా అందించాలన్నారు. ప్రతి శాఖ తమ పరిధిలో ఉన్న పనుల పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు.ఈ టెలీకాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, డీపీఓ శ్రీలత, మున్సిపల్ కమిషనర్ జోనా,డీఎల్పీఓ మల్లికార్జున రెడ్డి అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపిఓలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- **జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

**కామారెడ్డి, మార్చి 5 (వుదయం):-**



ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేసి లబ్ధిదారులకు త్వరితగతిన గృహప్రవేశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం పేదల గృహ స్వప్నాన్ని నెరవేర్చడానికి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం పనులను నాణ్యతతో పాటు నిర్దేశిత కాలంలో పూర్తి చేయాలని ఆయన తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు అవసరమైన సామాగ్రి, సాంకేతిక సహాయం, ఇతర మౌలిక వసతులు సమయానికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి గ్రామం, వార్డు స్థాయిలో పనుల పురోగతిని క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణంలో చురుకుగా పాల్గొనేలా అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. నిర్మాణ పనులు పూర్తయిన ఇళ్లకు వెంటనే గృహప్రవేశాలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.



# కాళేశ్వర ఆలయంలో మంత్రి దంపతులకు వివాహ వార్షికోత్సవ పూజలు

**జయశంకర్ భూపాలపల్లి మార్చి 05(వుదయం జిల్లా ప్రతినిధి):**

దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కాళేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా, అనంతరం శుభానంద పార్వతీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థాన పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య దంపతులకు ఆశీర్వచనాలు అందించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వీట్లు పంపిణీ చేసి వేడుకలను సాదరంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ,గ్రామ శాఖ అధ్యక్షులు లక్ష్మణ్ ఆలయ మాజీ డైరెక్టర్ లు మెంగాని అశోక్, గందేసిరి సత్యనారాయణ, సుంకరి సీతయ్య, మాజీ సర్పంచ్ బందెల సత్యమ్మ, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శ మాడుగుల పవన్ శర్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు రేవెళ్లి నాగరాజు మాచెర్ల బ్రదర్స్, గందేసిరి మధుసూదన్, దూది వెంకటస్వామి, అరెవెల్లి సంతోష్, భక్తులు పాల్గొన్నారు.

# సొంతింటి కలను నిజం చేసిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి





గ్రామీణ ప్రజల దీర్ఘకాలిక కల అయిన స్వంతింటి సాధన దిశగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, సర్పంచ్ రామన్న, టైగర్ రమేష్, జీవన్, కిరణ్, అతిక్, సర్పంచులు, అలాగే మహమ్మద్ నగర్ మండల యువజన అధ్యక్షులు సంతోష్ రాథోడ్ కీలక పాత్ర పోషించారు...అలాగే సీనియర్ నాయకులు, గంజి హన్మాండ్లు, సిద్దు పటేల్, సాయ గౌడ్, ఇస్మాల్, గ్రామ యువకులు, గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమం లో పాలుగొనడం జరిగింది......మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి, గ్రామానికి చెందిన పేదవారు కలలు కనే స్వంతింటి నిర్మాణానికి సంబంధించిన సమస్యలను ఆయన ముందుండి పరిష్కరించేందుకు కృషి చేశారు....గురువారం మహమ్మద్ నగర్ మండలంలోని గాలిపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన అంశంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి గ్రామస్తులతో సమావేశమయ్యారు... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు సహకారంతో ప్రభుత్వం పేదలకు ఇళ్ల నిర్మాణంలో అండగా నిలుస్తోందని తెలిపారు...అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్ల నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.... గ్రామంలో మిగిలిన అర్హుల జాబితాను సిద్ధం చేసి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు వేగవంతం చేయనున్నట్లు పేర్కొన్నారు....ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు....

# నిధులు మంజూరు చేసిన మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు

**జయశంకర్ భూపాలపల్లి మార్చి 05 (వుదయం జిల్లా ప్రతినిధి)**



మహాదేవపూర్ ఉమ్మడి మండల మైనారిటీ అభివృద్ధి కోసం రూ. 1 కోటి 45 లక్షల నిధులను మంజూరు చేసిన ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కు మహాదేవపూర్ గ్రామ సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ మైనార్టీ మహాదేవపూర్ అధ్యక్షుడు అస్రార్ ఖురేషి, కృతజ్ఞతలు తెలిపారు గురువారం వారు వుదయం ప్రతినిధితో మాట్లాడుతూ మహాదేవపూర్ ఉమ్మడి మండల ముస్లిం మైనారిటీ ప్రజల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు, కాళేశ్వరం, అన్నారం, పంకెన, గ్రామాలతోపాటు మహాదేవపూర్ మండల కేంద్రంలోని జామా మస్జీద్, మదీనా మస్జీద్, కలిమ మస్జీద్,ల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఖబ్రస్తాన్ వద్ద సీసీ రోడ్డు మరియు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి తో పాటు పలు నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయడం జరిగింది ఈ అభివృద్ధి కార్యక్రమాలు మైనారిటీ సమాజానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు ప్రజల సంక్షేమం మరియు అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు అలాగే, ఈ నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా నేడు ఉదయం 10:00 గంటలకు మహాదేవపూర్‌లో సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్, ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటాలకు పాలాభిషేక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మహాదేవపూర్ మండలంలోని ప్రజలు, మైనారిటీ సోదరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# పెండింగ్ సిఎంఆర్ రైస్ బకాయిల పై సంబంధిత రైస్ మిల్లర్లతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి, మార్చి- 05 (వుదయం ప్రతినిధి)**



బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్ల పై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష హెచ్చరించారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పెండింగ్ సిఎంఆర్ రైస్ బకాయిల పై డిసిపి రాం రెడ్డి, అదనపు కలెక్టర్ డి.వేణ తో కలిసి సంబంధిత రైస్ మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు.
జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ అనేక సార్లు గడువు ఇచ్చినప్పటికీ సిఎంఆర్ లక్ష్యం మేరకు బియ్యం ఇవ్వని రైస్ మిల్లర్లకు విధించిన జరిమానా రుసుము శనివారం నాటికి చెల్లించాలని లేనిపక్షంలో క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.
ఖరీఫ్ ,రబీ సీజన్ సంబంధించి రికార్డుల మీద ఉన్న ధాన్యం మిల్లులలో కనిపించడం లేదని, దీనికి సంబంధించి మిల్లర్ల నుంచి ధాన్యానికి సంబంధించిన బకాయిలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. బకాయిలు చెల్లించని మిల్లర్ల పై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు బ్లాక్ లిస్టులో పెడతామని కలెక్టర్ హెచ్చరించారుడిఫాల్టర్లుగా గుర్తించడం విలువలకు సంబంధించి ఓనర్లు, డైరెక్టర్, లీజు దారులు, కుటుంబ సభ్యుల ఆస్తులపై లావాదేవీలు జరగకుండా కట్టడి చేస్తామని అన్నారు. *డిసిపి రాంరెడ్డి మాట్లాడుతూ, రైస్ మిల్లర్లు డిఫాల్టర్లుగా మారితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని, అనవసరంగా జైలు కు వెళ్ళాల్సి వస్తుందని, అటువంటి పరిస్థితి తెచ్చుకోకుండా బకాయిలు సకాలంలో చెల్లించాలని అన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, ఎసిపి రమేష్ పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.
జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, పెద్దపల్లిచే జారీ చేయనైనది.

# ఇంటర్ మొదటి సంవత్స ఏడవ రోజు పరీక్ష ప్రశాంతం

- **ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన**
- **ఇంటర్ మొదటి సంవత్సరం మ్యాథమెటిక్స్ ఐబి/ జంతు శాస్త్రం/ చరిత్ర పరీక్షకు (96%) మంది విద్యార్థులు హాజరు**

**పెద్దపల్లి, మార్చి-05 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ఏడవ రోజు గురువారం ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. ఏడవ రోజు ఇంటర్ మొదటి సంవత్సరం మ్యాథమెటిక్స్ ఐబి / జంతు శాస్త్రం/ చరిత్ర భాష పరీక్షలు జరిగాయని, ఈ పరీక్షకు (4306) మంది హాజరు కావాల్సి ఉండగా, (4176)మంది హాజరు కాగా,(130) మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, ఏడవ రోజు 96శాతం హాజరు నమోదు కావడం జరిగిందని ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, పెద్దపల్లిచే జారీ చేయనైనది.



# యాదవ చారిటబుల్ ట్రస్ట్ భవన నిర్మాణ భూమి పూజ

**పెద్దపల్లి ఫిబ్రవరి 05 (వుదయం ప్రతినిధి) ;**

ఈరోజు పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి లోని 11వ వార్డు లో యాదవ చారిటబుల్ ట్రస్ట్ భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న గౌరవ మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య గారు ,11వ వార్డ్ కౌన్సిలర్ పూదరి అనూష మహేందర్ గారు ,యాదవ సంఘం నాయకులు, మారం తిరుపతి యాదవ్,మేకల మల్లేశం యాదవ్, గంట రాములు యాదవ్,సందనబోయిన రాజేందర్ యాదవ్, తమ్మడబోయిన ఓదెలు యాదవ్,,రాజాం కొమురయ్య యాదవ్, బత్తిని లక్ష్మయ్య యాదవ్, కొమ్ము సంపత్ యాదవ్, అట్ల లక్ష్మయ్య యాదవ్ మరియు సంఘం సభ్యులు పాల్గొన్నారు



# 1962 సంచార పశు వైద్య సేవలపై ఉన్నతాధికారుల పరిశీలన

- **మూగజీవాలకు తక్షణ వైద్యం అందించాలని సూచనలు**

**చేవెళ్ల, మార్చి 05 (వుదయం):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జీవీకే ఈఎమ్ఆర్ఐ సంస్థ నిర్వహిస్తున్న 1962 సంచార పశు వైద్యశాల టోల్ ఫ్రీ సేవలు మూగజీవాలకు అత్యవసర సమయంలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాయని జిల్లా మేనేజర్ షేక్ జాన్ షాహిద్ తెలిపారు.చేవెళ్లలో పని చేస్తున్న 1962 సంచార పశు వైద్యశాల అంబులెన్స్ సేవలను రాష్ట్ర ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. భగీష్ మిశ్రా గురువారం సందర్శించి సమగ్రంగా పరిశీలించారు .ఈ సందర్భంగా అంబులెన్స్‌లో ఉన్న వైద్య పరికరాలు, మందులు, సేవలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రజల నుంచి సమాచారం అందిన వెంటనే స్పందించి ఘటన స్థలానికి చేరుకుని మూగజీవాలకు తక్షణ వైద్యం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సేవలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.ఈ సేవలను సమర్థవంతంగా నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారం కీలకంగా ఉందని అధికారులు తెలిపారు. అలాగే చేవెళ్లలో సేవలందిస్తున్న 1962 సంచార పశు వైద్యశాల సిబ్బంది పారావెట్ రాజు, పైలట్ నర్సింలును అభినందించారు .ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్ షాహిద్, రంగారెడ్డి జిల్లా మేనేజర్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



# రెవెన్యూ శాఖ పై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి, మార్చి 05 (వుదయం ప్రతినిధి)**

రెవెన్యూ పరిధిలో పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.
గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్ డి. వేణు తో కలిసి సమీక్ష నిర్వహించారు.
**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
మాట్లాడుతూ, షెడ్యూల్ ప్రకారం 99 రోజుల కార్యాచరణ రెవెన్యూ శాఖ లో అమలు చేయాలని అన్నారు. రెవెన్యూ శాఖలో ఎక్కడ కూడా పెండింగ్ దరఖాస్తులు లేకుండా చూడాలని అన్నారు. మార్చి 6 నుంచి వచ్చే దరఖాస్తులు మరో 15 రోజుల లోగా డిస్పోస్ కావాలని అన్నారు.డిజిటల్ పద్దతిలో జనగణన కార్యక్రమం ఉంటుందని, ఏప్రిల్, మే నెలలో హౌజ్ లిస్టింగ్ కార్యక్రమం నిబంధనల ప్రకారం పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఓటర్ జాబితా సంబంధించి ఎస్.ఐ.ఆర్ అమలు ఎన్నికల కమిషన్ తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిందని, దీనిని కట్టుదిట్టంగా అమలు చేసేందుకు అవసరమైన ప్రిపరేటరీ పనులు పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు
బి.గంగయ్య, సురేష్ , కలెక్టరేట్ ఏవో బండి ప్రకాష్, తహసిల్దార్ లు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.
జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, పెద్దపల్లి చే జారీ చేయనైనది.

# ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు అర్ధరహితం

- **కరీంనగర్ పోలీస్ కమిషనర్ పై : ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్.**

**కరీంనగర్, మార్చి 05 (వుదయం ప్రతినిధి) :**



సమాజ హితం కోసం, కుల, మతాల కతీతంగా అహర్నిశలు పని చేస్తున్న కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలంపై, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని, సిపి పై ఆరోపణలు చేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి సుద్దపూస కాదని, అతడు ఒక బ్లాక్ మెయిలర్ అని ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. వీణవంకలో సమ్మక్క సారక్క జాతర అంశంపై, ఇటీవలే జరిగిన ఘటనలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఎంతటి వారైనా, చట్టం ఎవరికి చుట్టం కాదని నిరూపించిన సమర్థవంతమైన అధికారి గౌస్ ఆలంపై కక్షగట్టి, ముందుగా తురుకోడని కులం, జాతి పేరుతో దుర్భాషలాడి, 2014లో బిఆర్ఎస్ అధికారంలో వచ్చినాటి నుంచి 2023 వరకు 9 ఏండ్ల పాలనలో ఎస్పీలు, సిపిలు ఎందరో పనిచేసి, మారినప్పటికీ ఆనాడు ఎవరిపై విమర్శలు చేయని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు, ఇప్పుడు సిపి గౌస్ ఆలంపై లేనిపోని ఆరోపణలు పనిగట్టుకొని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆపార్టీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని,భూ ఆక్రమణలు చేసి, స్థానికులను భయభ్రాంతులకు గురిచేసి జైలుకు వెళ్లి వచ్చారని, ఒకఎమ్మెల్యే, మాజీ మంత్రి అనుచరులు దేశం విడిచి వెళ్లిన సంఘటనలను గుర్తు చేశారు. తక్షణమే బిఆర్ఎస్ పార్టీ పెద్దలు స్పందించి కౌశిక్ రెడ్డి లాంటి బ్లాక్ మెయిలర్లను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. రెండు పర్యాయాలు ముస్లింల ఓట్లతో బీఆర్ఎస్ పార్టీ గెలిచిందని గుర్తు చేశారు. గంగాజమున తహజీబ్ను కాపాడే పనిలో కేసీఆర్, కేటీఆర్ ఉంటే, ముస్లింలను కులం పేరుతో దూషిస్తూ, కౌశిక్ రెడ్డి పార్టీని బద్నాం చేస్తున్నాడని దుయ్యబట్టారు. కౌశిక్ రెడ్డి కరీంనగర్ వస్తే తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కరీంనగర్ సీపీకి భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



# ప్రైవేట్ కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- **పటాన్చెరువు ఎమ్మెల్యే జిఎంఆర్**
- **ఉన్నత పాఠశాల భవనం ప్రారంభోత్సవం**

**జిన్నారం మార్చి 5(వుదయం ప్రతినిధి)**

ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని పటాన్చెరువు ఎమ్మెల్యే ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం జిన్నారం మున్సిపల్ కేంద్రంలో న్యూ ల్యాండ్ పరిశ్రమ సహకారంతో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పరిశ్రమల సహకారంతో విద్యాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాణ్యమైన విద్య వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెల్సీలను స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్ధన్ కౌన్సిలర్లు నాయకులు పరిశ్రమ ప్రతినిధులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా ప్రమాణాల పై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి, మార్చి 05 (వుదయం ప్రతినిధి)**



రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా Arrive Alive థీమ్ తో చేపడుతున్న కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.
గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రోడ్డు భద్రతా ప్రమాణాల పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, రొడ్డు ప్రమాదాల నియంత్రణ లక్ష్యంగా జిల్లాలో చేపట్టిన పలు కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని, గత సంవత్సరంతో పోల్చితే ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గాయని, ఇదే దిశగా అధికారులు మరింత మెరుగ్గా పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.
99 రోజుల కార్యాచరణలో భాగంగా ArriveAlive పేరిట ప్రభుత్వం ఏప్రిల్ 13 నుంచి ఏప్రిల్ 18 వరకు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు నిర్ణయించిందని, మన పెద్దపల్లి జిల్లాలో ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.రహదారుల మీద ప్రమాదాలు జరిగితే 10 నిమిషాల వ్యవధిలో అంబులెన్స్ వచ్చే విధంగా వ్యవస్థ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఈఈ ఆర్&బీ భావ్ సింగ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ప్రమోద్ కుమార్, ట్రాఫిక్ పోలీసులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.
జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, పెద్దపల్లి చే జారీ చేయనైనది.

# ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు ముమ్మరం చేయాలి

**పెద్దపల్లి ఫిబ్రవరి 05 (వుదయం ప్రతినిధి)**



ఈరోజు జిల్లా కలెక్టర్ గారి ఛాంబర్ లో క్లినిక్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ 2010 ప్రకారం డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ యొక్క సమావేశం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గారి చైర్ పర్సన్ గా వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గారు ప్రైవేట్ ఆస్పత్రులను క్రమంగా తనిఖీ చేయాలని అన్నారు. జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్2010ను పూర్తిస్థాయిలో ఇంప్లిమెంట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫైర్ ఎక్స్టెన్షర్ ల గ్యాస్ వ్యాలిడిటీ పూర్తి అయినచో మళ్లీ గ్యాస్ ఫిల్లింగ్ చేసుకునేలా ఆదేశించాలని అన్నారు.
ఈ సమావేశంలో 11 ఫెసిలిటీస్ మరియు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ కు దరఖాస్తు చేసుకోగా వాటిని పరిశీలించి అనుమతించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి, ఎసి పి రమేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే ప్రమోద్ కుమార్, ఐఎంఏ సెక్రెటరీ డాక్టర్ ప్రణీత్ పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పెద్దపల్లి

# 4 లక్షల సబ్సిడీతో వ్యవసాయ డ్రోన్లు

- **ఎస్.విజయ చంద్ర,సహాయ వ్యవసాయ సంచాలకులు**

**మధిర మార్చి 5, వుదయం ప్రతినిధి;**



తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే కాకుండా ,సాగులో లేటెస్ట్ టెక్నాలజీనిప్రవేశ పెట్టేందుకు డ్రోన్లను నలభై శాతం సబ్సిడీ తో ఇచ్చుటకు నిర్ణయించడం జరిగింది .రైతులకు శ్రమ తగ్గించి,దిగుబడి పెంచడమే ఈ పథకం వెనుక ఉన్న లక్ష్యం. ఒక్కో డ్రోన్ కొనుగోలుపై 40 శాతం సబ్సిడీ లేదా గరిష్టంగా రూ.4 లక్షల వరకు రాయితీ ఇవ్వనున్నారు.ఈ పథకంలో మొదటి విడతలో భాగంగా మధిర డివిజన్ లో రెండు డ్రోన్లను సబ్సిడీ మీద ఇవ్వడం జరుగుతుంది. నేరుగా రైతులకే కాకుండా,రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రాథమిక సహకార సంఘాలకు,మహిళా సంఘాలకు మంజూరు చేయడం జరుగుతుంది.వ్యవసాయంలో డ్రోన్ల తో పొలాల్లో పురుగుమందులు,సూక్ష్మ పోషకాలను పిచికారీ చేయడానికి కేవలం నిమిషాల్లోనే ఆ పని పూర్తి చేయవచ్చు. దీనివల్ల సమయం దాదాపు 80 శాతం వరకు ఆదా అవుతుంది.అంతే కాకుండా, మందులు పంట అంతటా సమానంగా పడటం వల్ల పురుగుల ఉధృతి తగ్గి దిగుబడి పెరుగుతుంది. కూలీల కోసం వెతకాల్సిన అవసరం లేకుండా, ఖర్చు కూడా భారీగా తగ్గుతుంది.ఈ పథకం కింద లబ్ధి పొందలనుకునే రైతులు తమ మండల వ్యవసాయ అధికారి మరియు వ్యవసాయ విస్తరణ అధికారి కార్యాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చెయ్యవచ్చు.సబ్సిడీ శాతం, అర్హతలు,దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు.వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు మంజూరు చేయబడునని ఎస్ విజయ చంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు తెలిపారు.

# పదవ తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి





**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవడమే తల్లిదండ్రులకు ఇచ్చే అతి పెద్ద బహుమతి**

**భయం, ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలకు హాజరు కావాలి**

**విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం మెనూ ప్రకారం అందించాలి**

**కోదాడ క్రాస్ రోడ్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులం (బాలికల) ను ఆకస్మికంగా తనిఖీ చేసి,**

**పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల పై అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం, వుదయం బ్యూరో మార్చి -05:**
విద్యార్థులు ఏలాంటి భయం, ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పదవ తరగతి వార్షిక పరీక్షలకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు.గురువారం ఖమ్మం రూరల్ మండలం కోదాడ క్రాస్ రోడ్ వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులం (బాలికల) ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా తరగతి గదులు, పరిసరాలను తిరుగుతూ, మౌలిక సదుపాయాలు, వంటగది పరిశుభ్రత, ఆహార నాణ్యత, నిల్వ విధానాలు, స్టోర్ రూమ్‌లో ఉన్న బియ్యం, పప్పులు, కూరగాయలు, కోడిగుడ్లు, ఇతర సరుకుల సామగ్రిని తనిఖీ చేసి రికార్డు లెక్కలను క్షుణంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న కామన్ మెనూ ప్రకారం వండుతున్న ఆహారం అన్నం, కూరలను పరిశీలించారు.విద్యార్థుల తో నేరుగా ముచ్చటించి పాఠశాలలో కల్పిస్తున్న వసతుల గురించి, మెస్ కమిటీ వ్యవహారాలపై వివరాలు అడిగి తెలుసుకుని, కమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెనూకు అనుగుణంగా నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ పదవ తరగతి గది సందర్శించి, విద్యార్థుల తో ముచ్చటించారు. ఏలాంటి భయం, ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధం కావాలని హితబోధ చేస్తూ, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ విద్యార్థులు చదువు పై దృష్టి పెట్టి పరీక్షలకు హాజరు కావాలని, పరీక్షలకు మరో 9 రోజులు ఉందని, ఉన్న సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మనం ఎంత సమయం చదువుతున్నాం అనే దానికంటే ఎంత శ్రద్ధగా చదువుతున్నా మనేది చాలా ముఖ్యమని తెలిపారు. ఉపాధ్యాయుల సహకారం తీసుకుంటూ పరీక్షలకు బాగా సన్నద్ధం కావాలని, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని కలెక్టర్ సూచించారు. పదవ తరగతి మెయిన్ పరీక్షల కంటే ముందు వీలైనంత మేర అధిక సంఖ్యలో ప్రీ ఫైనల్ పరీక్షలు రాయాలని తెలిపారు. పరీక్షలు అధికంగా రాయడం వల్ల తుది పరీక్షలను ఎటువంటి ఒత్తిడి లేకుండా సులభంగా రాయగలుగుతామని అన్నారు. మనం చదివిన దానికంటే రాసిన అంశాలు అధికంగా గుర్తుండి పోతాయని కలెక్టర్ తెలిపారు. మనం చదువు పై నమ్మకంగా ఉంటూ పరీక్షల కు హాజరైతే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. నెల రోజుల పాటు పదవ తరగతి పరీక్షలు ఉంటాయని, విద్యార్థులు ఏకాగ్రతతో సిద్ధమైతే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీవో జ్యోతి, ప్రిన్సిపాల్ కె. శ్రీ లత, వైస్ ప్రిన్సిపాల్ డి. సంధ్యారాణి, ఉపాధ్యాయులు సిహెచ్. ఏల్లిశ్వరి, జి. సంధ్యారాణి, కె. విజయలక్ష్మి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ్, పద్మావతి రెడ్డి నాయకత్వంలోనే కోదాడ సమగ్ర అభివృద్ధి

**మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్**

**కోదాడ, మార్చి 5:(వుదయం)**
మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి నాయకత్వంలోనే కోదాడ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ అన్నారు.గురువారం కోదాడ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన కోదాడ పట్టణ నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి నాయకత్వంలో వేల కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చి కోదాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. గత 30 సంవత్సరాలుగా అవినీతి మచ్చ లేకుండా ప్రజాసేవ చేస్తున్న ఘనత వారికి దక్కుతుందన్నారు.తాగునీరు, సాగునీరు, డ్రైనేజ్, సీసీ రోడ్లు, గ్రామాలకు రోడ్డు సౌకర్యం, విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాల ద్వారా ప్రజలకు, భావితరాలకు ఉపయోగపడే విధంగా ప్రణాళికలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఎలాంటి వర్గ బేధాలు లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. మచ్చలేని నాయకుల నాయకత్వంలో పనిచేయడం మనందరికీ అదృష్టమని అన్నారు. నూతన పాలకవర్గ సభ్యులు కోదాడ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రజలకు సంక్షేమం అందించాలని ఆకాంక్షించారు.అనంతరం మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ బాబు, వైస్ చైర్మన్ రాజేశ్వరి, కౌన్సిలర్లను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మరియు పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీరబాబు, వెంకట్ రెడ్డి, సూర్యం, వెంకటేశ్వర్లు, కోటయ్య, మణెమ్మ, నర్సిరెడ్డి, శ్రీను, అభిరామ్, శ్రీనివాస్, అమర్ సింగ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# పంటల సాగులో డ్రోన్లను వినియోగించుకోవాలి



**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**

**పంటల సాగుకు ఉపయోగపడే డ్రోన్ల పంపిణీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్**

**హనుమకొండ, మార్చి 05 (వుదయం జిల్లా ప్రతినిధి) :**
పంటల సాగులో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని, ముఖ్యంగా వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సూచించారు.
పంటల సాగులో డ్రోన్లు ఉపయోగపడతాయని, వాటిని రైతులు వినియోగించుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సూచించారు.
గురువారం రోజున హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో నాబార్డ్ పథకం కింద వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రైతు సేవా సహకార సొసైటీ (నందనం)కు డ్రోన్లను కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై అందజేశారు. ఈ సందర్భంగా రైతు సేవా సహకార సొసైటీ( నందనం), పిఎసిఎస్ నర్సంపేట, పిఎసిఎస్ నెల్లికుదురులకు అందించే మూడు డ్రోన్లకు సంబంధించిన వివరాలను వ్యోమిక్ డ్రోన్స్ సంస్థ ప్రతినిధులు హనుమ, జగదీష్ జిల్లా కలెక్టర్ కు తెలియజేశారు. ఒక డ్రోన్ ఎన్ని ఎకరాలలో స్ప్రే చేయగలదు, రైతులకు ఎలా ఉపయోగపడుతుంది, డ్రోన్ పైలెట్లకు శిక్షణ ఇచ్చారా అని తదితర వివరాలను కలెక్టర్ అడిగారు.
**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ**
డ్రోన్ల ద్వారా ఎరువులు, పురుగుమందులు సమర్థవంతంగా పిచికారీ చేయడంతో పాటు సమయం, ఖర్చు తగ్గుతాయని రైతులు ఈ సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకోవాలని తెలిపారు.డ్రోన్లను వినియోగించుకొని పంటల ఉత్పత్తిని సాధించాలన్నారు. అదేవిధంగా రైతు సేవా సహకార సొసైటీ ( నందనం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రూరల్ మార్ట్ ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. మార్ట్ లో విక్రయానికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల వస్తువులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ రూరల్ మార్ట్ నిర్వహణ చాలా బాగుందని, ఇలాగే కొనసాగించాలని అన్నారు. రూరల్ మార్ట్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ మాజీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి చంద్రశేఖర్, వరంగల్ అధికారి చైతన్య, హనుమకొండ, వరంగల్ జిల్లాల డిసిఓలు సంజీవరెడ్డి, నీరజ, హనుమకొండ జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, ఏడిఏ ఆదిరెడ్డి, సహకార శాఖ ఏరియా అధికారి జగన్మోహన్ రావు, సర్పంచులు రఘు వంశీ, రాజు, తదితరులతో పాటు రైతులు పాల్గొన్నారు.

# మల్లికార్జున స్వామిని దర్శించుకున్న కలెక్టర్



**ఐనవోలు, మార్చి 05 (వుదయం ప్రతినిధి) :**
ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి వారిని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ గురువారం రోజున దర్శించుకున్నారు.ఆలయ అధికారులు, పూజారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభం, మంగళ వాయిద్యాలతో కలెక్టర్ కు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలను, స్వామి వారి ప్రసాదాన్ని కలెక్టర్ కు అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం ప్రాంగణంలో కుడా (కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ) నిధులతో నిర్మాణం చేపట్టిన డార్మెటరీ హాలు పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనులు నిలిచిపోయి అసంపూర్తిగా ఉండటంపై వివరాలు తెలుసుకుని, పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా స్థానిక తహసిల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీవో నర్మద, తదితరులు ఉన్నారు.




# న్యాయం అనే నమ్మకాన్ని బాధితుల్లో కలిగించాలి

**పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్ క్రైం, మార్చి 05 (వుదయం ప్రతినిధి) :**
పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని కలిగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ గురువారం ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ రోజు ఉదయం పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ కు ధర్మసాగర్ ఇన్స్ స్పెక్టర్ శ్రీధర్ రావు పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, ఆయా గ్రామాల్లోకి ప్రజల జీవన శైలి, పోలీస్ స్టేషన్ పరిధిలో అధికంగా జరిగే నేరాలు, రౌడీ షీటర్లు, అనుమానితులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పనితీరు, బీట్లు, పెట్రోలింగ్, రికార్డుల నిర్వహణ పై స్టేషన్ ఇన్స్ స్పెక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్ కు సంబందించి రికార్డులను సీపీ పరిశీలించారు.అనంతరం సీపీ మాట్లాడుతూ ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించాలని, విధి నిర్వహణలో అలసత్వంతో వ్యవహరించకుండా విధులు నిర్వహించాలని, ముఖ్యంగా పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని పొందాలని సీపీ తెలియజేసారు. పోలీస్ కమిషనర్ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి తో పాటు, ఎస్. ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా జగ్గయ్య

**ఖానాపురం, మార్చి 5 (వుదయం ప్రతినిధి):**
మండలంలోని రంగాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా గాడుదుల జగ్గయ్యయాదవ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యర్ల జగన్మోహన్ రెడ్డి తెలిపారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడిగా గాడుదుల జగ్గయ్యయాదవ్, ఉపాధ్యక్షుడు బండి శ్రీను, కార్యదర్శి బసవ శ్యామ్, సహాయ కార్యదర్శి భూక్య సంతోష్, కోశాధికారి భూక్య ఫుల్ సింగ్, గౌరవ అధ్యక్షుడు పిండి కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ గూగులోతు వెంకన్న, సలహాదారులు కందుల ఉపేందర్, భూక్య బద్రు, కత్తి బాబు, లింగాలా యకయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎర్రబెల్లి బలరాం, భూక్య నరసింహ, నాయకులు గూగులోతు నరేష్, మాచర్ల శ్రీను, తల్లా కొమ్మలు స్టాలిన్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలంపియాడ్ లో అల్ఫోర్స్ విద్యార్థులకు బంగారు పతకాలు




**కరీంనగర్, మార్చి 05 (వుదయం ప్రతినిధి) :**
ఇంగ్లీష్ భాష వలన కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయని,సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపును పొందగలుగుతామని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు.స్థానిక కొత్తపల్లి అల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలంపియాడ్ లో బంగారు పతకాలు సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు కమ్యూనికేషన్స్ తప్పనిసరని, కమ్యూనికేషన్ స్కిల్స్ ద్వారా అనేక విజయాలను సొంతం చేసుకోగలుగుతారన్నారు. నేటి పోటీ ప్రపంచంలో కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రతి విద్యార్థికి అనివార్యమని, వీటి ద్వారా వివిధ స్థాయిలలో గుర్తింపు పొందడమే కాకుండా పటిష్టమైనటువంటి అవకాశాలను సొంతం చేసుకొని ఉన్నతమైన జీవితాన్ని గడపగలుగుతారని వారు అభిప్రాయ పడ్డారు. అంతర్జాతీయ భాష అయిన ఇంగ్లీష్‌భాష పట్ల పట్టు సాధించాలని, కఠోర సాధన ద్వారా ధారళంగా మాట్లాడగలుగుతారని వారు అభిప్రాయ పడ్డారు.విద్యార్థులు అందరూ ఇంగ్లీష్ భాషలో పట్టు సాధించాలని, వాటిలోని విషయాల పట్ల సమగ్ర అవగాహనను పెంపొందించుకొని ముందంజలో నిలవాలని వారు చెప్పారు. ఇటీవల ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ అయినా సిల్వర్ జోన్ ఫౌండేషన్ వారు నిర్వహించిన అంతర్జాతీయ ఇంగ్లీషు ఒలంపియాడ్ లో పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థులు ఏ.శ్రియాన్ రెడ్డి రజత పతకం, వి.వేదవిహార్ బంగారు పతకం,జి.విశాల్ కాంస్య పతకం, 6వ తరగతి విద్యార్థి కే.సుకృత బంగారు పతకం,7వ తరగతి విద్యార్థులు ఏం.లిఖిత్ రజత పతకం, బి.తన్మయి బంగారు పతకం పి .సుశ్రిత్ కాంస్య పతకం, 8వ తరగతి విద్యార్థులు ఏం .విగ్నేష్ చంద్ర బంగారు పతకం, ఎల్. అక్షయ రజత పతకం,9వ తరగతి విద్యార్థులు ఏ.యాష్ చంద్ర కాంస్య పతకం,సిహెచ్ శ్రీహిత రజత పతకం టి.అమిత విక్రమ్ బంగారు పతకం సాధించగా విద్యార్థులకు అభినందనలు తెలిపి పుష్పగుచ్చాలను అందజేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# జిల్లా కలెక్టర్ ను సన్మానించిన మేయర్

**హనుమకొండ, మార్చి 05 (వుదయం ప్రతినిధి ) :**
ఇటీవల హన్మకొండ జిల్లా కలెక్టర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్ పాయ్ ను గురువారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో నగర మేయర్ గుండు సుధారాణి శాలువాతో సత్కరించి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ బల్దియా కమిషనర్ గా సేవలు అందిస్తూ హన్మకొండ జిల్లా కలెక్టర్ గా నియామకం కావడం సంతోషం గా ఉందని ప్రజలకు మరింతగా వారి సేవలు అందిస్తారని మేయర్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ జనార్ధన్ సి హెచ్ ఓ రమేష్ అకౌంట్స్ అధికారి శివ లింగం ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ ఏం హెచ్ ఓ డా.రాజేష్ హెచ్ ఓ లక్ష్మారెడ్డి ఈ ఈ సంతోష్ బాబు పాల్గొన్నారు.



# పౌష్టికాహారంతోనే తల్లి బిడ్డ క్షేమం


- **పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్**

**జన్నారం, మార్చ్ 5 (వుదయం విలేఖరి):**
పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారని పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ అన్నారు. గురువారం రోజున ఆమె పొనకల్ పట్టణంలో గల అంగన్వాడి 3 సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అంగన్వాడి సెంటర్లో ఉన్న ఆహార పదార్థాలను, పలు రికార్డు లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు అంగన్వాడి సెంటర్ కు వచ్చి మాత్రమే భోజనం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో అంగన్వాడి సూపర్వైజర్ కవిత,సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**జయశంకర్ భూపాలపల్లి మార్చి 05(వుదయం జిల్లా ప్రతినిధి):**
జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ విధానం, భద్రతా ఏర్పాట్లు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆయన పరిశీలించారు .ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో ఏర్పాటు చేసిన సీటింగ్ వ్యవస్థ, సీసీ కెమెరాలు, ఇన్విజిలేటర్ల విధులు, విద్యార్థుల హాజరు వివరాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్ లో సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కలెక్టర్ సూచించారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, వైద్య సదుపాయం, భద్రత వంటి అవసరమైన సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు.పరీక్షా కేంద్రాల్లో నిబంధనలు కచ్చితంగా పాటించడంతో పాటు ఎలాంటి మాల్ప్రాక్టీసులకు తావు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులను నిశితంగా పరిశీలించిన తదుపరి మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలని సూచించారు. ఈ కేంద్రంలో ఎంతమంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని సీఎస్ ను అడిగి తెలుసుకున్నారు. మొదటి సంవత్సరం పరీక్ష జరుగుతుందని 228 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 10 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ హరికృష్ణ, పరీక్షల విభాగం చీఫ్ సూపరింటెండెంట్ సదానందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులు



**జయశంకర్ భూపాలపల్లి మార్చి 05 (వుదయం జిల్లా ప్రతినిధి):**
మహాదేవపూర్ మండలం కుదురుపల్లి గ్రామంలో సర్పంచ్ చల్ల సమ్మిరెడ్డి ఆధ్వర్యం లో గురువారం ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు కుదురుపల్లి గ్రామంలోని పలు వార్డు లలో పూర్తిస్థాయి సాడిటేషన్ కార్యక్రమం నిర్వహించారు దానిలో భాగంగా మోరీలలో చెత్తను తొలగించారు గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యకరమైన గ్రామంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తూ పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నట్లు గ్రామంలో ఎలాంటి సమస్యలున్నా గ్రామపంచాయతీ కార్యదర్శి తో పాటు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు



# జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్



**పెద్దపల్లి, మార్చి 05 (వుదయం ప్రతినిధి) :**
మార్చి 6 నుంచి 15 వరకు గ్రామాలు, అర్బన్ ప్రాంతాలలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో 99 రోజుల కార్యాచరణ అమలు పై జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, డిసిపి రాం రెడ్డి తో కలిసి సమీక్ష నిర్వహించారు.
**ఈ సందర్భంగా *జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**
మాట్లాడుతూ,* మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుందని, ఇందులో భాగంగా ముందస్తుగా మార్చి 6 నుంచి 15 వరకుపారిశుధ్య నిర్వహణ , ఫైల్ క్లీయరెన్స్ అంశాల పై ప్రాధాన్యతతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.
గ్రామాలు, పట్టణాలలో మాత్రమే కాకుండా ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని, పాత ఫర్నీచర్ తొలగించాలని, దీన్ని పై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల లో పెండింగ్ ఉన్న ఫైల్స్ 10 రోజులలో క్లియర్ చేయాలన్నారు. పంచాయతీ, మున్సిపల్ శాఖ అధికారులు 10 రోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని , ఉదయం డిఎల్ పిఓ, ఎంపిఓ, పంచాయతీ కార్యదర్శుల, మున్సిపల్ కమిషనర్ ఫీల్డ్ లెవల్ లో తనీఖీలు నిర్వహిస్తూ ఎక్కడా రోడ్డు పై చెత్త లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వార్డు సభ్యులు, సర్పంచ్, మున్సిపల్ చైర్ పర్సన్, మేయర్ వంటి ప్రజాప్రతినిధులు పూర్తి స్థాయిలో భాగస్వామ్యం చేయాలని అన్నారు. పబ్లిక్ ప్లేసెస్ పారిశుధ్యం పట్ల అత్యంత ప్రాధాన్యత కల్పించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.
పారిశుధ్య డ్రైవ్ అనంతరం కూడా స్థానిక సంస్థల అధికారులు రెగ్యులర్ గా పారిశుధ్యం పై ఫోకస్ పెట్టాలని, ప్రతివారం గ్రామం, అర్బన్ ప్రాంతాల లో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పట్ల రిపోర్టు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రతి వారం ఒక శాఖకు సంబంధించిన కార్యక్రమాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. హెల్త్, సంక్షేమం, చైల్డ్ సేఫ్టీ, వ్యవసాయ, విద్యా, యువత స్పోర్ట్స్, మహిళా సంక్షేమం, పర్యావరణ వంటి అంశాలకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు విజయవంతంగా చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.
99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రత్యేక సమావేశాలకు నిర్ణయించిందన్నారు. ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో, ఏప్రిల్ 16న మండల స్థాయిలో, మే 2న నియోజకవర్గ స్థాయిలో, మే 22న జిల్లా స్థాయిలో, జూన్ 2న రాష్ట్ర స్థాయి సమావేశం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వం అమలు చేసే వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించాలని అన్నారు.
ప్రతి శాఖ పరిధిలో చివరి దశలో ఉన్న పనులను పూర్తి చేసి 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ శాఖకు సంబంధించి సోలార్ ప్యానెల్ ఏర్పాటు గురించి రైతులు, గృహ వినియోగదారులకు సంబంధించి విస్తృతంగా అవగాహన కల్పించాలని ప్రత్యేక అధికారులు వారంలో ఒక రోజైనా క్షేత్రస్థాయిలో పాఠశాలలు పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయాలని కలెక్టర్ సూచించారు.
ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని , జిల్లా సహకార అధికారి శ్రీ మాల, జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, సంబంధిత అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.
జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, పెద్దపల్లి చే జారీ చేయనైనది.

# రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలి

– జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

– మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్ మేళాలో జిల్లా కలెక్టర్






**వరంగల్, మార్చి 05 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

మారుతున్న వాతావరణ పరిస్థితులు మరియు వ్యవసాయ రంగంలో జరుగుతున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా రైతులు నూతన సాంకేతిక పద్ధతులను అవలంబిస్తూ ఆధునిక వ్యవసాయాన్ని చేపట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు.

గురువారం పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, హెడ్ డాక్టర్ అరుణ జ్యోతి ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి సాగు పై కిసాన్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. సత్య శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కిసాన్ మేళా సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ స్టాళ్లను కలెక్టర్ ప్రారంభించి పరిశీలించారు. రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతులు, పంటల నిర్వహణ విధానాలు, యంత్రాల వినియోగం, పంట రక్షణ చర్యలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలను ఆసక్తిగా సందర్శించి రైతులతో ముచ్చటించారు.అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా 2023-2025 మధ్య నిర్వహించిన అధిక సాంద్రత పత్తి సాగు కార్యక్రమాలు, ప్రదర్శనలు, రైతు శిక్షణలు మరియు ఫలితాలను ప్రతిబింబించే రెండు సంవత్సరాల కార్యకలాపాల సీడీని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు శాస్త్రవేత్తలు సూచించే ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా పంటల దిగుబడిని పెంచుకోవచ్చని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న శిక్షణలు, శాస్త్రీయ సూచనలు మరియు సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంట మార్పిడి పద్ధతులను అమలు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు అధిక సాంద్రత పత్తి సాగు పద్ధతిపై రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చి అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ కిషన్ కుమార్, వరంగల్ జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ బాలకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ అనురాధ, జాతీయ ఆహార భద్రత మిషన్ కన్సల్టెంట్లు సారంగం, సారంగపాణి, హనుమకొండ జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ నిర్మలతో పాటు కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య, డాక్టర్ రాజు, డాక్టర్ సాయికిరణ్, యంగ్ ప్రొఫెషనల్స్ హర్ష, సాయి చంద్, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం రైతులకు శాస్త్రీయ వ్యవసాయం పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు ఆధునిక పద్ధతులను ప్రోత్సహించే వేదికగా నిలిచింది.



## తహసీల్దార్, ఎంపీడీవో ఆఫీస్ లను తనిఖీ చేసిన కలెక్టర్

**ఐనవోలు, మార్చి 05 వుదయం ప్రతినిధి) :**

హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని తహసీల్దార్ మరియు ఎంపీడీవో కార్యాలయాలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడి అధికారులు, సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. అనంతరం రికార్డు రూమును పరిశీలించి భూ భారతి దరఖాస్తులు, సాదా బైనామా కేసుల వివరాలను తహసీల్దార్ విక్రమ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సంబంధించిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సమీపంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసి ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) అమలుపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఉపాధి పనులు, సిబ్బంది పనితీరుపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయానికి అదనపు గదుల నిర్మాణం అవసరమని ఎంపీడీవో నర్మద కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, అందుకు సంబంధించిన అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్ సూచించారు.ఈ తనిఖీ సందర్భంగా ఆయా కార్యాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే దొంతిని కలిసిన దేవోజు

**నర్సంపేట, మార్చి 5 వుదయం ప్రతినిధి:**

మాజీ కౌన్సిలర్ దేవోజు తిరుమల సదానందం క్యాంపు కార్యాలయం నందు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని దొంతి మాధవరెడ్డికి రాబోయే రోజుల్లో మంత్రి పదవి లభించాలని ప్రజలకు మరింత సేవ చేసే గొప్ప అవకాశం దక్కాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. అదేవిధంగా నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ ని వారి కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడవ వార్డు కౌన్సిలర్ ముత్తినేని, వెంకన్న, ఓబిసి జిల్లా అధ్యక్షులు ఓర్సు తిరుపతి, బైరీ మురళి, దేవోజు హేమ్చందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ అప్ డేషన్ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్





**పెద్దపల్లి, మార్చి- 05 (వుదయం ప్రతినిధి)**

ప్రతి పౌరుడికి ఆధార్ అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఆధార్ అప్ డేట్ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివి ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆధార్ కార్డు ఉండాలని, ఆధార్ కార్డు ఉన్న విద్యార్థులకు అవి అప్డేట్ అయి ఉండాలని కలెక్టర్ తెలిపారు. రాబోయే రోజులో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో పర్యటించి ఆధార్ కార్డు ప్రతి విద్యార్థికి అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని ప్రతి పౌరుడుకి ఆధార్ కార్డు అందేలా చర్యలు తీసుకోవాలని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆధార్ లేకుండా ఎవరు ఉండటానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆధార్ కార్డు లేని వ్యక్తులను గుర్తించి వారికి నూతన ఆధార్ కార్డు జారీ చేయడంతో పాటు ఆధార్ కార్డు సవరణ, అప్ డేట్ కూడా ఎప్పటికప్పుడు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, పెద్దపల్లిచే జారీ చేయనైనది.



## బల్దియా జే ఏ సి డైరీ ఆవిష్కరించిన మేయర్, కలెక్టర్

**వరంగల్ టౌన్, మార్చి 05 (వుదయం ప్రతినిధి) :**

మహానగర పాలక సంస్థ జాయింట్ యాక్షన్ కమిటీ (జే ఏ సి).2026 నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా రూపొందించిన డైరీ, క్యాలెండర్ ను నగర మేయర్ గుండు సుధారాణి హన్మకొండ జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లు గురువారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో సంయుక్తం గా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమం లో జే ఏ సి నాయకులు బోట్ల బిక్షపతి మాదిగ, బోట్ల రమేష్ , ఎల్పుల ధర్మరాజు రాజారపు భాస్కర్, పోశాల స్వామి, రామకృష్ణ, సుఖద దేవరకొండ సమ్మయ్య, బొక్క ఎలియా,ఉదయ్ ,సత్యం, దామెర రాజు,సురేష్,ఇజ్రాయిల్ ఆదామ్, ఏకు సుధాకర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## టీచర్స్ సమయపాలన పాటించి సిలబస్ పూర్తి చేయాలి



జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నపిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలి

గిరిజన ఆశ్రమ పాఠశాల, అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్, మార్చి 05 (వుదయం ప్రతినిధి) :**

విద్యాలయాల ద్వారా ఆరోగ్యం, ఉత్తమ విద్య బోధనలు పిల్లలకు అందించాలిని కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు.గురువారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని ఇస్లాపురం గిరిజన ఆశ్రమ పాఠశాల, అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గిరిజన ఆశ్రమ పాఠశాల, ప్రాథమిక ఉన్నత పాఠశాల,అంగన్వాడి కేంద్రంలలో స్టాక్, రిజిస్టర్, పిల్లలు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, స్టోర్ గది, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్, స్టడీ రూమ్, పరిసరాలను పరిశీలించారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ**

జిల్లాలో జిల్లాలోని (19) గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు ఆరు (6), పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ (9), గిరిజన ప్రైమరీ స్కూల్స్ జిపిఎస్, (104), లలో (881) పదవ తరగతి విద్యార్థులు, మొత్తం (7044), విద్యార్థినీ, విద్యార్థులు ఉండగా ప్రతి ఒక్కరిని వ్యక్తిగతంగా,మానసికంగా దృఢంగా ఉండే విధంగా చూడాలి. షెడ్యూలు ప్రకారం వారికి వైద్య పరీక్షలు నిర్వహించి,ఉపాధ్యాయుల ద్వారా అత్యుత్తమ విద్య బోధనలు అందించడం జరుగుతుందని ,(ప్రతి నాలుగు) హాస్టళ్లకు కలిపి ఒక ప్రత్యేక అధికారి అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, పిఎమ్ఆర్సిలు, ఏసీఎంఓలు, జిసిడిఓ, స్పోర్ట్స్ అధికారి ఎస్సీఆర్పిలను నియమించి 100% ఫలితాలు వచ్చే విధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలి.ప్రతి రోజు అదనపు కలెక్టర్లు,జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులు, స్థానిక సంబంధిత మండల స్థాయి అధికారులు అందరూ పరిశీలన, తనిఖీల ద్వారా అత్యుత్తమ ఫలితాలను సాధించడం కోసం కృషి చేయాలి. షెడ్యూలు ప్రకారం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులకు ఏలాంటి మానసిక ఒత్తిడి లేకుండా వారికి అర్థమయ్యే విధంగా నూతన డిజిటల్ తరగతులు ప్రాక్టికల్స్ ద్వారా విద్యను అందించాలి. ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు కచ్చితంగా సమయపాలన పాటించి సిలబస్ పూర్తి చేయాలన్నారు. ప్రతి విద్యార్థిని, గమనిస్తూ ఉండాలని, విద్యలో వెనుకబడిన పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రోత్సహించాలన్నారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టిక ఆహారం అందిస్తూ వారికి అర్థమయ్యే రీతిలో పాఠాలను బోధించాలని తెలిపారు,ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీరాం నాయక్, స్థానిక తహసిల్దార్ నాగరాజు, ఎంపీడీవో, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాల, అంగన్వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

**సూర్యాపేట, మార్చి 5(వుదయం ):**

మునగాల మండల పరిధిలోని ఆకుపాముల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల హాజరు వివరాలు తెలుసుకుని, ముఖ గుర్తింపు విధానంలో హాజరు నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం 7, 8, 9, 10 తరగతుల గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పఠన నైపుణ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. పాఠశాల ప్రాంగణ పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్ కుర్చీలు, బెంచీలు అవసరంపై ప్రతిపాదనలు సమర్పించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేలా ఉపాధ్యాయులు సృజనాత్మకంగా బోధించాలని ఆయన సూచించారు. పదాల సరైన ఉచ్చారణతో పాటు ఆంగ్ల పదాలను తెలుగులో సరిగ్గా అనువదించి బోధించాలని తెలిపారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్టానికి కొర్రీలు




◆ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్

**దమ్మపేట మార్చి 5 (వుదయం ప్రతినిధి):**

గ్రామీణ ఉపాధి చట్టానికి మోడీ ప్రభుత్వం ఊరేస్తున్నది అని కె వై సి డిజిటలైజేషన్ పేరుతో లక్షలాది మంది కూలీలను తొలగించి వారి పొట్ట కొట్టిందని ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తున్నది అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. గురువారం దమ్మపేట ఉపాధి హామీ కూలీల వద్ద జరిగిన సమావేశంలో అర్జున్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉపాధి మౌలిక హామీ చట్టానికి కొర్రీలు పెడుతూ కూలీలకు వందరోజుల పని కల్పించాల్సిన బాధ్యతనుండి తప్పుకు చూస్తున్నది అని అన్నారు. పని స్థలాల్లో రెండుసార్లు ఫోటోలు ఉదయం సాయంత్రం ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని నిబంధన తెచ్చిందని, చేసిన పనికి వారం రోజుల్లో వేతనాలు చెల్లించాలని చట్టం చెబుతుంటే నెలలు తరబడి వేతనాలు కేంద్ర ప్రభుత్వం పెండింగ్లో పెడుతుందని అన్నారు. అనంతరం మండల కన్వీనర్ రఘు మాట్లాడుతూ కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలకు వ్యతిరేకంగా బిజెపి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని వీటిని ఎండగడుతూ ఈనెల 24న ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్రావు, సీతమ్మ,దుర్గమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## సుల్తానాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను తనిఖీ చేసిన కలెక్టర్




**సుల్తానాబాద్, మార్చి- 05 (వుదయం ప్రతినిధి)**

ఆసుపత్రిలో మందుల కొరత రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.

గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆసుపత్రి ఓపి సేవలను పరిశీలించి డెంటల్ ఓపి కు వస్తున్న కేసులు , అందిస్తున్న చికిత్స గురించి వివరాలు తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలకు రెగ్యులర్ హెల్త్ చెక్ అప్ షెడ్యూల్ ప్రకారం జరిగేలా చూడాలని, అవసరమైన వ్యాక్సినేషన్ 100% పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. రోగులతో ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఆసుపత్రి కి వచ్చిన పేషంట్ లతో మాట్లాడారు.ఎన్.సి.డి విభాగం పరిశీలించి ఎట్టి పరిస్థితుల్లో మందుల కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆసుపత్రి ఆర్.ఎం.ఓ, సిబ్బంది, పాల్గొన్నారు.

జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, పెద్దపల్లిచే జారీ చేయనైనది.

## జంగేడు కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ రాహుల్ శర్మ





విద్యార్థుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్

పరీక్షలకు ధైర్యంగా సిద్ధం కావాలని సూచన

**జయశంకర్ భూపాలపల్లి మార్చి 05(వుదయం జిల్లా ప్రతినిధి):**

జంగేడు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడి వారు ఎలా ఉన్నారు, బాగా చదువుతున్నారా అంటూ వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు.అనంతరం 6వ, 10వ తరగతులు మరియు ఇంటర్ తరగతులను పరిశీలించారు. వసతి గృహంలో నిత్యావసర వస్తువుల నిల్వలు, భోజనశాల, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, డైనింగ్ హాలు, ఆర్ ఓ ప్లాంట్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కూడా టాపరేనని ఎవరూ తక్కువ కాదని బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదివి మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందిస్తామని తెలిపారు.10వ తరగతి పరీక్షలకు ఇంకా 9 రోజులు మాత్రమే సమయం ఉందని పేర్కొంటూ, విద్యార్థులకు మాక్ పరీక్షలు నిర్వహించి పరీక్షలపై భయం తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు పరీక్షలు అంటే బయపడొద్దని ధైర్యంగా వ్రాయాలని తెలిపారు.ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులను ఇప్పటి వరకు ఎన్ని పరీక్షలు వ్రాశారు, ఎలా రాశారు, ఇంకా ఎన్ని పరీక్షలు మిగిలి ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పరీక్షలు కూడా బాగా వ్రాయాలని సూచించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని బెస్ట్ విషెస్ తెలిపారు. అనంతరం సైన్స్, ఎలక్ట్రానిక్ మెషిన్ ల్యాబ్‌ను పరిశీలించారు. ప్రహరీ నిర్మాణ పనులు వేగవంతం చేపించాలని డీఈఓకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ హరికృష్ణ, డీఈఓ రాజేందర్, ఎస్ఓ ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల సబ్ కమిటీలో మంత్రి అడ్లూరి

◆ సీఎం కు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి అడ్లూరి

**ధర్మపురి మార్చి05 (వుదయం ప్రతినిధి):**

గోదావరి పుష్కరాలు-2027 నిర్వహణ పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పుష్కరాల ఏర్పాట్లు, నిర్వహణను సమన్వయం చేయడానికి క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన 9 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సభ్యుడిగా చోటు దక్కించుకున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు జి.ఓ.ఆర్.టి. నెం.319 ద్వారా ఈ ఉత్తర్వులను విడుదల చేశారు .2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు ప్రారంభించింది. ఇందులో భాగంగా కీలక శాఖలకు చెందిన మంత్రులతో ఈ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది.ఇటీవల గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించి న మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కీలక పాత్ర పోషిం చారు. తక్కువ సమయంలో ఏర్పాట్లు పూర్తి చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా చూడడంలో ఆయన సఫలమయ్యారు.ఈ నేపథ్యంలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించిన సబ్ కమిటీలో సభ్యుడిగా అవకాశం ఇవ్వడంపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి అడ్లూరి కృతజ్ఞతలు తెలిపారు.



## శోభాయమానంగా నరసింహ స్వామివారి దక్షిణ దిగ్యాత్ర





ధర్మపురి పోలీస్ స్టేషన్ లో స్వామివారికి ప్రత్యేక పూజలు

ఠాణాలో పూజలందుకోవడం క్షేత్ర ప్రత్యేకత

**ధర్మపురి మార్చి 05 (వుదయం ప్రతినిధి):**

ధర్మపురి క్షేత్రంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ యోగ ఉగ్ర నరసింహా స్వామి వారి దక్షిణ దిగ్యాత్ర నిర్వ హించారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం ఈఓ సంకటా ల.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చ కుల మంత్రోచ్చారణలతో స్వామి వారి ఉత్సవమూర్తులను సేవపై ఆశీనులను చేసి మేళతా ళాల తో,ఆటపాటలతో,నృత్యాల తో ,రకరకాల విన్యాసాలతో పురవిధులగుండా రక్షకభట నిలయానికి వెళ్లగా మహిళలు స్వామివారికి మంగళహారతులు ఇచ్చారు.ఠాణాలో అలంకరించిన ప్రత్యేక వేదికపై శ్రీ యోగ ఉగ్ర నరసింహా స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ఆశీనులను చేసి ముందుగా స్వామివారి ముందు ఆయుధాల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించగా ముఖ్య అతిధులుగా డిఎస్పీ రఘుచందర్ దంపతులు పాల్గొనగా సీఐ రాం నరసింహా రెడ్డి దంపతులు, జగిత్యాల సీఐ కరుణాకర్ దంపతులు మాల్యాల సిఐ రవి దంపతులు,ఎస్సైలు మహేష్ దంపతులు,రవీందర్ దంపతులు,వెల్గటూర్ ఎస్సై ఉదయ్ కుమార్ దంపతులు, గొల్లపెల్లి ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి, ఎస్సై శ్రీధర్ రెడ్డి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంలో డిఎస్పీ మాట్లాడు తూ బ్రహ్మోత్స వాల్లో భాగంగా ప్రతి ఏటా పోలీస్ స్టేషన్లో స్వామి వారి దక్షిణ యాత్రలో భాగంగా స్వామి వారు రావడం ఆనవాయి తీగా వస్తుందని,దీనిని పోలీస్ శాఖ గౌరవంగా భావిస్తోం దని,ప్రజలందరూ సుఖ సంతోషా లతో ఉండాలని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం మా అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అనంతరం సిఐ మాట్లాడుతూ బ్రహ్మోత్స వాల్లో భాగంగా స్వామివారు పోలీస్ స్టేషన్ కు రావడం దేశంలో ఎక్కడా లేదని అది ధర్మపురి స్వామివారి ప్రత్యేకత అని స్వామి వారి బ్రహ్మోత్సవాలలో సేవలందిం చడం అదృష్టంగా భావిస్తున్నామ ని అన్నారు.ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్,మున్సిపల్ చైర్మన్ వేముల. నాగలక్ష్మి రాజేష్,వైస్ చైర్మన్ ఇందారపు.రామన్న, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు, కౌన్సిలర్లు,దేవస్థానం ధర్మకర్తలమండలి సభ్యులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంఘనబట్లదినేష్, పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు నాయకు లు, గ్రామస్తులు,భక్తులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు పదవ తరగతి ఎంతో కీలకం

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




గద్వాల ,మార్చి 05 (వుదయం ప్రతినిధి)

విద్యార్థుల భవిష్యత్తు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు పదోతరగతి ఎంతో కీలకంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని అన్ని విద్యాసంస్థల 10వ తరగతి విద్యార్థులకు వివిధ సబ్జెక్టుల నిపుణులతో జూమ్ మీటింగ్ ద్వారా ఆయా సబ్జెక్టుల్లోని ముఖ్యాంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షల్లో వచ్చిన మార్కులను పరిశీలించగా ఎక్కువగా గణితం, హిందీ, తెలుగు సబ్జెక్టుల్లో తక్కువ మార్కులు వచ్చాయన్నారు. అలాగే ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థులకు వచ్చిన మార్కులను ఆధారంగా చేసుకుని విద్యార్థులను ఏ, బి, సి, డి కేటగిరీలుగా విభజించడం జరిగిందన్నారు. ఈనెల 14 నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తుండడంతో ప్రధానంగా సి, డి కేటగిరీలలో ఉన్న విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల నుంచి అడిగే ముఖ్యమైన అంశాలను తెలియజేసేందుకు నిపుణులచే అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలకు చాలా తక్కువ సమయం ఉండడంతో విద్యార్థులు గత ఐదు సంవత్సరాలుగా ఎస్ ఎస్ సి పబ్లిక్ పరీక్షల్లో అడిగిన ప్రశ్న పత్రాలను పరిశీలించి వాటిలో నుంచి ఎక్కువసార్లు అడిగిన ప్రశ్నలను సాధన చేస్తే సి, డి కేటగిరీలలో ఉన్న విద్యార్థులు కూడా మంచి మార్కులతో పాస్ అవుతారన్నారు.

*జోగులాంబ గద్వాల జిల్లా టాప్ 15 లో ఉండాలి*

జోగులాంబ గద్వాల జిల్లా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 2024 – 2025 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో 26వ స్థానంలో, 2023–2024 విద్యా సంవత్సరంలో 31 వ స్థానంలో ఉందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మన జిల్లా కనీసం టాప్ –15 లో ఉండేలా ఫలితాలు రావాలంటే ఆయా విద్యాసంస్థల ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి పరీక్షకు నాలుగైదు రోజులు ఖాళీ ఉండటంతో ఆ సమయంలోను వివిధ సబ్జెక్టుల్లోని ముఖ్యమైన ప్రశ్నలను గురించి పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు కూడా తప్పనిసరిగా పరీక్షల మధ్యన వచ్చిన సమయాన్ని సద్వినియోగం చేసుకునేందుకు తమ విద్యాసంస్థల్లో ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు తెలియజేసే ముఖ్యమైన అంశాలను శ్రద్ధగా సాధన చేసి మంచి మార్కులు పొందాలని ఆకాంక్షించారు.

*ఒత్తిడి, భయాన్ని వీడేందుకు ధ్యానం సాధన చేయాలి*

పరీక్షలనగానే కొంతమంది విద్యార్థులు ఒత్తిడికిలోనై ఇబ్బంది పడుతున్నారని, భయాన్ని వీడేందుకు కొంత సమయాన్ని ప్రశాంతంగా ధ్యానం చేసేందుకు కేటాయించాలన్నారు. ఫలితంగా విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి పెరిగి తాము చదివిన పాఠ్యాంశాలు బాగా గుర్తు ఉంటాయన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో గత విద్యా సంవత్సరంలో రెండు శాతం విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదన్నారు. విద్యార్థులు పరీక్షలకు చిన్న చిన్న కారణాలతో గైర్హాజరు కావడం వలన ఆ ప్రభావం సంబంధిత విద్యాసంస్థల పాస్ శాతంపై పడుతుందన్నారు. ప్రతి విద్యాసంస్థలో వంద శాతం ఫలితాలు రావాలంటే ప్రతి విద్యార్థి అన్ని పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులను సంబంధిత పాఠశాలలో ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా కలిసి కౌన్సిలింగ్ నిర్వహించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు.

*విద్యార్థులు తగిన జాగ్రత్తలు పాటిస్తే మంచి మార్కులు*

విద్యార్థులు పరీక్షలు ముగిసే వరకు సెల్ ఫోన్స్ కు, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకుంటూ, వేసవిని దృష్టిలో ఉంచుకొని తగినంత నీళ్లు తాగాలన్నారు. కనీసం 6 నుంచి 8 గంటల పాటు నిద్ర పోవాలని, రాత్రివేళ నిద్రపోకుండా మేలుకొంటే పరీక్ష రాసే సమయంలో ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ప్రాథమిక చికిత్స అందించేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. విద్యార్థులకు అనుకోకుండా ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా అవసరమైన వైద్య సహాయం అందించబడుతుందన్నారు. విద్యార్థులు హాల్ టికెట్స్ తో పాటు మంచి పెన్నులు, ఇతర అవసరమైన విద్యాసామాగ్రిని సిద్ధంగా ఉంచుకొని పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు నిర్దేశిత సమయం కంటే ముందుగానే చేరుకొని పరీక్ష సమయం ముగిసేంతవరకు అన్ని ప్రశ్నలకు జవాబులు రాయాలని సూచించారు. సమయం మిగిలితే రాసిన జవాబులన్నింటిని సరిచూసుకోవాలని, ఆయా సమాధానాలకు అవసరమైన శీర్షికలు, ఉపశీర్షికలు పెట్టడం వలన మంచి మార్కులు సాధించవచ్చన్నారు. మంచి చేతి వ్రాత కూడా ఎక్కువ మార్కులు సాధించేందుకు ఉపకరిస్తుందన్నారు.

*కేటగిరివారీగా టాపర్లకు సైకిళ్ల బహుమతి*

జిల్లాలోని మండలాల వారీగా కేజీబీవీలు, గురుకులాలు, జడ్పిహెచ్ఎస్, తదితర కేటగిరీల వారీగా పదవ తరగతి పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు సైకిళ్లను బహుమతిగా ఇవ్వనున్నట్లు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రకటించారు. తాను ఇదివరకు పనిచేసిన జనగామ జిల్లాలో గతేడాది పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఆయా కేటగిరీలలో టాపర్లుగా నిలిచిన సుమారు 300 మంది విద్యార్థులకు సైకిళ్లను బహుమతిగా ఇచ్చినట్లు పేర్కొన్నారు.

*విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేందుకే కలెక్టర్ లేఖల అందజేత*

జిల్లా విద్యాశాఖ సౌజన్యంతో జిల్లాలోని అన్ని విద్యాసంస్థల పదవ తరగతి విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేందుకు తాను స్వయంగా రాసిన కలెక్టర్ సర్ లేఖను అందించడం జరిగిందన్నారు. ప్రతి విద్యార్థి ఈ లేఖలోని ఏడు ముఖ్యాంశాలను చదివి ప్రేరణ పొందాలని ఆకాంక్షించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలను ఎలాంటి ఇబ్బంది లేకుండా విజయవంతంగా రాయాలని ఈ సందర్భంగా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

*500కు పైగా మార్కులు సాధించేందుకు కృషి యాలి*

జోగులాంబ గద్వాల జిల్లా విద్యార్థులు ఎక్కువ శాతం 500 కు పైగా మార్కులు సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలు విద్యాసంస్థల విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ వారి మార్కుల లక్ష్యాన్ని సబ్జెక్టుల వారీగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం గద్వాల ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు, రచయిత అనిమోని మహేందర్ రాసిన అమర శ్రీ వ్యాకరణం పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి , డిపిఓ శ్రీకాంత్, సెక్టోరియల్ అధికారి మైఖేల్, ఆయా సబ్జెక్టుల నిపుణులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ కేంద్రంలో
# గర్భిణీలకు సీమంతం

కోదాడ ,మార్చి 5(వుదయం)

కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ మహిళలకు గురువారం సాంప్రదాయబద్ధంగా సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ దొంతగాని అప్పారావు ముఖ్య అతిథిగా హాజరై గర్భిణీలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా గర్భిణీ మహిళలకు పండ్లు, పౌష్టికాహార పదార్థాలు అందజేశారు. గర్భిణీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అంగన్వాడీ కేంద్రం ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సూచించారు.కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.


## నిర్మాణ పనులలో
# నాణ్యత పాటించాలి



- కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- హన్మకొండ పరిధి లో
- శానిటేషన్, అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపు కోసం తనిఖీలు
- నిర్దేశిత ప్రణాళిక ప్రకారం డ్రైన్ ల క్లీనింగ్ చేపట్టాలి

వరంగల్ టౌన్, మార్చి 05 (వుదయం ప్రతినిధి) :

నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూడాలని హన్మకొండ జిల్లా కలెక్టర్/ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం రోజున హన్మకొండ పరిధి లో శానిటేషన్ తనిఖీలతో పాటు పూర్తి చేసిన వివిధ అభివృద్ధి పనుల కు బిల్లుల చెల్లింపు కోసం ప్రత్యక్షం గా కొలతలు వేసి పరిశీలించి సమర్థవంతం గా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా 6 వ డివిజన్ లోని బొక్కల గడ్డలో రోడ్లు, డ్రైన్ పనులను, 4వ డివిజన్ లో జ్యోతిరావు పూలే నగర్ లో రోడ్లు, డ్రైన్ పనులను, 29 వ డివిజన్ లోని రామన్న పేట లో రోడ్డు నిర్మాణ పనులు, 30 వ డివిజన్ లోని జూ పార్క్ లో నిర్మాణం కొనసాగుతున్న స్ట్రాం వాటర్ డ్రైన్ పనులతో పాటు పద్మాక్షి రోడ్ లో ఆర్ 1 కు చెందిన రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించారు. అభివృద్ధి పనులను పరిశీలించే క్రమం లో చెత్త కుప్పలు ఉండడాన్ని గమనించిన కలెక్టర్ ఏ సమయంలో చెత్త కుప్పలను తీస్తున్నారని అడిగి తెలుసుకొని ఎప్పటికపుడు తొలగించాలన్నారు, స్వచ్ఛ ఆటో లు ప్రతి గృహం నుండి తడి పొడి చెత్తను వేరుగా సేకరించాలని, నిర్దేశిత ప్రణాళిక ప్రకారం డ్రైన్ ల క్లీనింగ్ జరగాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమం లో ఏం హెచ్ ఓ డా.రాజేష్, ఈఈ రవి కుమార్, డి ఈ లు రాజ్ కుమార్, రాగి శ్రీకాంత్, సానిటరీ సూపర్ వైజర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



## నుతన వధువరులను ఆశీర్వదించిన
## బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం

దమ్మ పేట మార్చి5 (వుదయం ప్రతినిధి ):

అశ్వరావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం చీపురుగుడెం గ్రామం లో దుర్గారావు,లక్ష్మి దంపతుల కుమారుడు అర్జున్ – జ్యోతిల వివాహము కి హాజరు అయి నుతన వధువరులను ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలియజేసిన బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా నాయకులు సోయం వీరభద్రం .ఈ కార్యక్రమంలో సోయం ఎర్రయ్య,సత్యనారాయణ,తాటి చిన్న వెంకటేశ్వర్లు ,కోర్సా వెంకటేష్,బుద్దుల కృష్ణ,వుకే చలమరావు,రాం బాబు పలువులు పాల్గొన్నారు



## కలెక్టర్ ను కలిసిన మేయర్, డిప్యూటీ మేయర్

కరీంనగర్, మార్చి 05(వుదయం ప్రతినిధి): జిల్లా బ్యూరో : కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై.సునీల్ రావు గురువారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు అంశాలపై చర్చించారు.

## పదవ తరగతి విద్యార్థులు గణిత శాస్త్రం పై
# ప్రత్యేక శ్రద్ధ వహించాలి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి ,మార్చ్5 (వుదయం ప్రతినిధి)

పదో తరగతి విద్యార్థులు గణిత విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఒక్కరు కూడా ఫెయిల్ అవ్వకుండా మంచి మార్కులు సాధించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలనీ, వడ్డించే ముందు సూపర్వైజర్ తప్పనిసరిగా ఆహారాన్ని రుచి చూసి తనిఖీ చేయాలనీ సిబ్బందికి సూచించారు. అనంతరం పాఠశాల వంటగదిని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించారు. ఆహారంలో నాణ్యతను ఎప్పటికప్పుడు కాపాడాలని సిబ్బందిని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం కోసం వండే ఆహారాన్ని తప్పనిసరిగా గ్యాస్ సిలిండర్ పైనే చేయాలని కట్టల పోయి వాడకాన్ని ఆపేయాలని సూచించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమై రాబోయే బోర్డు పరీక్షలపై పలు సూచనలు చేశారు. ఏ విషయాల్లో వెనుకబడి ఉన్నారో వాటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి చదవాలని సూచించారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తే అవి జీవితాంతం ఉపయోగపడతాయని చెప్పారు. ఈసారి పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాకూడదని తెలిపారు.అలాగే వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ముఖ్యంగా గణితంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. తదనంతరం కలెక్టర్ పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను సందర్శించి విద్యార్థులు నేర్చుకుంటున్న ప్రాజెక్టుల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రాజెక్టులను సులభంగా అర్థం చేసుకునేలా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు రూపొందించిన చిత్రాలను (పెయింటింగ్స్) పరిశీలించి వారిని అభినందించారు.

జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, పాఠశాల సిబ్బంది, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# వెబ్ సైట్లతో జాగ్రత్తగా ఉండాలి



*నారాయణ పేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్*

నారాయణపేట టౌన్ మార్చి 5 (వుదయం ప్రతినిధి )

ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్న సందర్భంలో నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలందరికీ అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోగలమని ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం సమాజంలో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెటింగ్ అంటూ లాభాలు చూపిస్తామంటూ ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న మోసాలు సామాన్య ప్రజలకు తెలియాలని అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా వాట్సాప్ నందు టెలిగ్రామ్ నందు సోషల్ మీడియాలలో ఏపీకే ఫైల్స్ రావడం వాటి ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లడం లాంటి సంభవిస్తుందని వాటిని అడ్డుకోవడానికి అప్రమత్తత ప్రధానాస్త్రంగా ఉంటుందని తెలిపారు. ఒకవేళ మోసగాళ్ల చేత మోసపోయినట్లయితే వెంటనే (గోల్డెన్ హవర్) లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయడం మొదటి కర్తవ్యం గా వ్యవహరిస్తుందని తెలిపారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్లు, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటిది జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ముఖ్యంగా యువత మాయమాటలకు నమ్మి మోసపోకుండా ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ నేరగాళ్లు వినియోగిస్తున్న పద్ధతిని తెలియజేస్తూ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు ముఖ్యంగా డబ్బులను వారి సొంత వెబ్సైట్ ల నందు ఇన్వెస్ట్మెంట్ చేసిన దానికన్నా ఎక్కువగా చూపిస్తారని ఒకవేళ డబ్బులను తీయాలి

అనుకుంటే రాకుండా ఉంటాయని తెలియచేశారు.జిల్లా పరిధిలో ప్రజలకు సైబర్ నేరాల పైన విస్తృతంగా అవగాహన కార్యక్రమలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ తెలిపారు.

# కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని సందర్శన

*జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్.*



నల్గొండ, మార్చి 05 (వుదయం ప్రతినిధి) : విద్యార్థులు పరీక్షల సమయంలో భయపడకుండ ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు . గురువారం ఆయన తిప్పర్తి మండల కేంద్రంలోకస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడుతూ వారి చదువు పై ప్రశ్నలు అడిగారు.గత సంవత్సరం జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల విద్యార్థులు పదో తరగతిలో 563 మార్కులతో టాప్ ర్యాంక్ సాధించిన విషయాన్ని గుర్తుచేసిన కలెక్టర్, ఈసారి 563 కంటే ఎక్కువ మార్కులు ఎంతమంది తెచ్చుకుంటారని? విద్యార్థులను అడిగారు. దీనికి పది మంది విద్యార్థినులు స్పందిస్తూ తాము 563 కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకుంటామని సమాధానం ఇచ్చారు. విద్యార్థుల ధైర్యాన్ని అభినందించిన కలెక్టర్, వారికి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు తెలుసుకున్నారు. దీనిపై కలెక్టర్ విద్యార్థినులను ప్రోత్సహిస్తూ పరీక్షల సమయంలో భయపడకుండా ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు.తరువాత హాస్టల్ సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్, దోమలు ఉన్నాయా, బెంచీలు సరిపోతున్నాయా, మూత్రశాలలు బాగున్నాయా, ఇంకేమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అలాగే హాస్టల్ మెనూలో ఏ వంటలు చేశారో కూడా ప్రశ్నించారు. అనంతరం జిల్లా కలెక్టర్ విద్యార్థినులతో కలిసి నేలపై కూర్చొని

భోజనం చేశారు. మండల తహసిల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో జానయ్య, ఎంఈఓ నరసింహ నాయక్, ఏవో సన్నీ రాజు, ప్రిన్సిపాల్ కే. రాజరాజేశ్వరి, ఇంజనీరింగ్ ఏఈ జ్యోతి, సంబంధిత అధికారులు. కలెక్టర్ వెంట ఉన్నారు .

## ఏఐసీసీ ఓబీసీ విభాగం చైర్మన్ డా. అనిల్ జైహింద్ యాదవ్ కు ఘన స్వాగతం

హైదరాబాద్ మార్చి 05 (వుదయం ప్రతినిధి) :

ఏఐసిసి ఓబీసీ విభాగం చైర్మన్ డా. అనిల్ జైహింద్ యాదవ్ అధికారిక పర్యటనలో భాగంగా గురువారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొననున్నారు.హైదరాబాద్ విమానాశ్రయంలో ఆయనకు ఓబీసీ నాయకులు, వివిధ సంస్థల ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అల్లా రామకృష్ణ, అధ్యక్షులు – ఆల్ ఇండియా ఓబీసీ ఇంటెలెక్చువల్ ఫోరం; గౌడ్ కిరణ్ కుమార్, జాతీయ అధ్యక్షులు డా. కేతూరి వెంకటేష్, తెలంగాణ కాంగ్రెస్ ఓబీసీ కన్వీనర్; రాజేష్, తెలంగాణ ఓబీసీ వైస్ ప్రెసిడెంట్; అలాగే ఓబీసీ నాయకులు మధు బాబు, డా. అరుణ్ కేతన్ తదితరులు ఆయనను ఆహ్వానించారు.ఈ పర్యటనలో భాగంగా డా. అనిల్ జైహింద్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ నిర్వహించే పలు కార్యక్రమాలలో పాల్గొనడమే కాకుండా, ఓబీసీ విద్యార్థులు, ప్రొఫెసర్లు, మేధావులు మరియు వివిధ బీసీ సంఘాల ప్రతినిధులతో సమావేశమై సామాజిక న్యాయం, ప్రతినిధిత్వం మరియు వెనుకబడిన వర్గాల సాధికారతపై చర్చించనున్నారు.



# మోడల్ హౌసింగ్ కాలనీ ప్రారంభం

## సీఎం చేతుల మీదుగా హుజూర్నగర్ మోడల్ హౌసింగ్ కాలనీ ప్రారంభం

- రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాల్లో నిర్మాణం
- పెండింగ్ పనులు వారం రోజుల్లో పూర్తి చేయాలి: కలెక్టర్

సూర్యాపేట, మార్చి 5(వుదయం)

హుజూర్నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాల్లో నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని ఈ నెల రెండో వారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.గురువారం రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని ఆయన పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల బ్లాకులు, అంతర్గత రహదారులు, సభాస్థలి, పార్కింగ్ ప్రాంతాలను తనిఖీ చేసి, పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హత లేని వారి పేర్లు జాబితాలో ఉండకూడదని స్పష్టం చేశారు. అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సిద్ధార్థ, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, తహసీల్దార్ కవితతో పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడమే ప్రభుత్వ లక్ష్యం



- నేడు ఆరోగ్య కేంద్రంలో మెగా హెల్త్ క్యాంప్.
- నేటి క్యాంపు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా వైద్య అధికారి సాంబశివరావు.

ఖానాపురం, మార్చి 5 (వుదయం ప్రతినిధి):

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంతోపాటు ప్రజలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వైద్య అధికారి (డిఎంహెచ్ఓ) డాక్టర్ బి సాంబశివరావు ప్రజలకు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి నేడు శుక్రవారం నిర్వహించే మెగా హెల్త్ క్యాంపు ఏర్పాట్లను వైద్య అధికారులతో కలిసి పరిశీలించి వైద్య బృందానికి నేటి క్యాంప్ పై పలు సలహా సూచనలు చేశారు. అనంతరం మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను డిఎంహెచ్ఓ సందర్శించి నేడు నిర్వహించే హెల్త్ క్యాంప్ పై సంబంధిత ప్రిన్సిపాల్ ఉపాధ్యాయ బృందంతో మాట్లాడి విద్యార్థులకు అన్ని రకాల పరీక్షలు చేయించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ 99 రోజుల కార్యక్రమం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశాల మేరకు జిల్లాలోని ఖానాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపిక చేసి మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలుపుతూ, మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలకు అన్ని రకాల మెరుగైన వివిధ రకాల వైద్య పరీక్షలను నిర్వహించి మందులను ఉచితంగా అందజేస్తారని తెలుపుతూ, ఇట్టి మెగా హెల్త్ క్యాంపుకు మండలంలోని 21 గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలందరూ తప్పక హాజరై హెల్త్ క్యాంప్ ని విజయవంతం చేయాలని మండల ప్రజలకు తెలుపుతూ, ఈనెల 6 నుంచి 12 వరకు హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డిఎంహెచ్ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్య అధికారులు డాక్టర్ జ్యోతి, అరుణ్ జోషి, కళాశాల ప్రిన్సిపాల్ అనిత, కమ్యూనిటీ ఆఫీసర్ రాజయ్య, సీసీ నాగరాజు, హెల్త్ సూపర్వైజర్స్ దామోదర్ రెడ్డి, దేవిక, ఫార్మసీ ఆఫీసర్ శ్రీనివాసచారి, నర్సింగ్ ఆఫీసర్ చిన్ని, సబిత, హెల్త్ అసిస్టెంట్ లు భాస్కర్, రాంప్రసాద్ రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టోలిచౌకీ భవన నిర్మాణంలో ఘోర ప్రమాదం

హైదరాబాద్ మార్చి 05 (వుదయం ప్రతినిధి) :

నగరంలోని టోలిచౌకీలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఏడు అంతస్థుల భవన నిర్మాణంలో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా.. ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో మొత్తం 10 మంది కార్మికులు పని చేస్తున్నట్లు సమాచారం. కార్మికులు ఐదో అంతస్థు నుంచి జారి పడినట్లు తెలుస్తోంది. గాయపడిన వారిని దగ్గర్లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్లాస్టరింగ్ పని చేస్తూ.. కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



## 'వార్' నష్టాలకు బ్రేక్.. లాభాల్లో సూచీలు

దేశీయ మార్కెట్ సూచీలు గురువారం లాభాల్లో ప్రారంభమయ్యాయి. యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి భారీ నష్టాలను చవిచూసిన సూచీలు నేడు సానుకూలంగా కదలాడుతున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ.. కనిష్ఠాల వద్ద కొనుగోళ్లు సెంటిమెంట్‌ను కాస్త బలపరిచాయి. ఒక దశలో సెన్సెక్స్ 500 పాయింట్ల వరకు పెరిగింది. ఉదయం 9.42 గంటల సమయంలో 273 పాయింట్ల లాభంతో 79,389 వద్ద ఉండగా.. నిఫ్టీ 90 పాయింట్లు పెరిగి 24,570 వద్ద ట్రేడవుతున్నాయి.





# సామాన్యుల కోసం
# పోస్టాఫీస్‌లో బెస్ట్ స్కీమ్




సామాన్య ప్రజలు తాము సంపాదించిన దాంట్లో కొంత పొదుపు చేయాలనుకుంటారు. అలాంటి వారందరికీ పోస్టాఫీసులో అద్భుతమైన పథకం ఉంది. అదే రికరింగ్ డిపాజిట్ స్కీమ్. ఎలాంటి రిస్క్ లేకుండా స్థిర ఆదాయ అందిస్తుంది. ప్రతి నెలా కొద్ది కొద్దిగా పొదుపు చేసుకుని 5 ఏళ్ల తరువాత పెద్ద మొత్తంలో డబ్బులు అందుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ హా ఉండడంతో ఇందులో ఎలాంటి రిస్క్ ఉండదు. క్రమం తప్పకుండా పొదుపు చేస్తే మంచి ఆదాయం పొందవచ్చు. ప్రతి నెలా వేతనం పొందే వ్యక్తులు, గృహిణులు తమ పిల్లల భవిష్యత్తు కోసం పొదుపు చేసే వారికి చాలా మంచి పథకం. మరి ఈ పథకానికి సంబంధించిన వివరాలు, వడ్డీ రేట్లు తెలుసుకుందాం. పోస్టాఫీస్ రికరింగ్ డిపాజిట్ పథకం ద్వారా ప్రస్తుతం వార్షిక వడ్డీ 6.7 శాతంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. త్రైమాసికానికి ఒకసారి చక్రవడ్డీ లెక్కిస్తారు. అంటే వడ్డీపైన వడ్డీ లభిస్తుంది. జనవరి నుంచి మార్చి 2026 వరకు ఇదే వడ్డీ రేటు లభిస్తుంది. నెలకు కనీసం రూ.100 పెట్టుబడితో రికరింగ్ డిపాజిట్ ఖాతా తెరవవచ్చు. ఆ తర్వాత రూ.10 గుణిజాలలో ఎంతైన జమ చేసుకోవచ్చు. ఈ పథకంలో ఎలాంటి గరిష్ఠ పరిమితి లేదు. కాలపరిమితి 5 సంవత్సరాలుగా ఉంటుంది. 5 సంవత్సరాల మెచ్యూరిటీ టెన్యూర్ ఉంటుంది. క్రమం తప్పకుండా నెల నెలా పొదుపు చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని నెరవెర్చుకోవచ్చు. నెలకు రూ.11,111 జమ చేస్తూ వెళ్తే 5 ఏళ్లలో పెట్టుబడి మొత్తం రూ. 6,66,660 అవుతుంది. దీనిపై ఏడాదికి 6.7 శాతం వడ్డీ చొప్పున చూస్తే వడ్డీ రూపంలో రూ. 1,26,285 వస్తాయి. 5 సంవత్సరాలు పూర్తయితే మెచ్యూరిటీ నాటికి వడ్డీ, అసలు మొత్తం కలిపి రూ. 7,92,945 వస్తాయి. అంటే దాదాపు రూ.8 లక్షలు చేతికి అందుతాయి. ఈ రికరింగ్ డిపాజిట్ పథకంలో పెట్టుబడి పెట్టేవారికి వడ్డీ మాత్రమే కాకుండా మరికొన్ని అదనపు ప్రయోజనాలు ఉన్నాయి. ఏడాది పాటు వాయిదాలు చెల్లించిన తర్వాత డిపాజిట్ నుంచి కొంత రుణంగా తీసుకోవచ్చు. అనుకోని ఖర్చులు ఎదురైనప్పుడు ఈ లోన్ సదుపాయం ఉపయోగపడుతుంది. అత్యవసర పరిస్థితుల్లో డబ్బు అవసరమై అకౌంట్ క్లోజ్ చేసి అందులోని డబ్బులు మొత్తం తీసుకోవచ్చు. అయితే 3 ఏళ్లు పూర్తయిన తర్వాతే ఖాతా క్లోజ్ చేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ పథకంలో చేరేందుకు సప పోస్టాఫీసుకి వెళ్లి వివరాలు, కావాల్సిన డాక్యుమెంట్లు అందించి కనీస పెట్టుబడి ఇస్తే ఖాతా ఓపెన్ చేస్తారు. అయితే, పోస్టాఫీసు పథకాల్లో ప్రతి మూడు నెలలకు ఒకసారి వడ్డీ రేట్లను కేంద్ర ప్రభుత్వం సక్షిస్తుంది. కొన్నిసార్లు మార్చవచ్చు, కొన్నిసార్లు యథాతథంగా కొనసాగించే అవకాశం ఉంటుంది.

## ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్ యూజర్లకు

ప్రముఖ టెలికాం కంపెనీ భారతీ ఎయిర్ టెల్ పోస్ట్ పెయిడ్ కస్టమర్లకు శుభవార్త చెప్పింది. ప్రస్తుతం అందిస్తున్న అన్‌లిమిటెడ్ 5జీతో పాటు 4జీ డేటా సర్వీసులను సైతం అన్‌లిమిటెడ్‌గా అందిస్తామని తెలిపింది. ఈ మేరకు వ్యక్తిగత, ఫ్యామిలీ పోస్ట్ పెయిడ్ ప్లాన్లను అప్‌డేట్ చేసినట్లు తెలిపింది. దీనిపై అధికారికంగా కంపెనీ ప్రకటన చేయనప్పటికీ వెబ్‌సైట్లో ఆ మేరకు మార్పులు చేసింది. మొదట 10 సర్కిళ్లలో ప్రయోగాత్మకంగా అన్‌లిమిటెడ్ సర్వీసులు ప్రారంభించిన ఎయిర్ టెల్ దేశవ్యాప్తంగా అన్ని సర్కిళ్లలో ఈ సేవలను తీసుకొచ్చినట్లు తెలిపింది. అన్‌లిమిటెడ్ అంటే 300 జీబీ వరకు హైస్పీడ్ డేటాను యూజర్లు పొందవచ్చని తెలిపింది.అప్‌డేట్ చేసిన ప్లాన్ల ప్రకారం నెలకు రూ.449 వ్యక్తిగత ప్లాన్ ద్వారా 1 సిమ్




(ప్రైమరీ), అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్, అన్‌లిమిటెడ్ 4జీ, 4జీ డేటా (300 జీబీ వరకు), ఎయిర్ టెల్ ఎక్స్ ట్రీమ్ ప్లె, జియో హాట్ స్టార్ (3 నెలలు) వంటివి వస్తాయి. ఇక రూ.549 ప్లాన్ ద్వారా 1 సిమ్, అన్‌లిమిటెడ్ కాల్స్ ప్లస్ ఎస్ఎంఎస్, డేటాతో పాటు అదనంగా డిస్నీ ప్లస్ హాట్ స్టార్ 12 నెలలు, అమెజాన్ ప్రైమ్ 6 నెలలు వంటి ఓటీటీ బెనిఫిట్స్ సైతం వస్తాయి. రూ. 699 ప్లాన్ ద్వారా రెండు సిమ్ కార్డులు (1 ప్రైమరీ ప్లస్ మరొకటి అదనపు సిమ్) లభిస్తాయి. ఇద్దరు వ్యక్తులు అన్‌లిమిటెడ్ 4జీ, 5జీ సేవలు పొందవచ్చు. అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్, ఓటీటీ బెనిఫిట్స్ కూడా వస్తాయి. చిన్న కుటుంబాలకు రూ. 999 ప్లాన్ (1 ప్లస్ 2), రూ. 1199, రూ. 1399 (1 ప్రైమరీ ప్లస్ 3 సిమ్ కార్డులు) ప్లాన్లను కూడా తీసుకువచ్చింది. ఈ ప్లాన్లతో ఓటీటీ ప్రయోజనాలతో పాటు యాపిల్ టీవీ, యాపిల్ మ్యూజిక్ సైతం వస్తుంది. నెలకు రూ. 1749తో ఐదుగురు కుటుంబ సభ్యులకు సరిపోయేలా మరో ప్రీమియం ప్లాన్ కూడా ఇస్తోంది. ఇందులో 5 సిమ్ కార్డులు వస్తాయి.

# నెమ్మదించిన సేవల రంగ వృద్ధి



దేశీయ సేవల రంగ వృద్ధి ఈ ఏడాది ఫిబ్రవరిలో స్వల్పంగా నెమ్మదించింది. కొత్త ఆర్డర్లలో పెరుగుదల 13 నెలల కనిష్ఠానికి పడిపోవడం ఇందుకు కారణం. ద్రవ్యోల్బణం పెరగడం, గిరాకీ ఓ మోస్తరుగానే పుంజుకోవడమూ ప్రభావం చూపిందని ఓ నెలవారీ సర్వే తెలిపింది. హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ సూచీ ఫిబ్రవరిలో 58.1 పాయింట్లకు తగ్గింది. జనవరిలో ఇది 58.5 పాయింట్లుగా ఉంది. పీఎంఐ పరిభాషలో సూచీ 50 పాయింట్ల ఎగువన ఉంటే ఆ రంగంలో వృద్ధి ఉన్నట్లు; దిగువన ఉంటే క్షీణతగా పరిగణిస్తారు. ఫిబ్రవరిలో పీఎంఐ సూచీ 50 పాయింట్ల ఎగువన ఉన్నందున.. వృద్ధి ఉన్నప్పటికీ, జనవరితో పోలిస్తే స్వల్పంగా నెమ్మదించింది. పోటీ పెరగడంతో కొత్త ఆర్డర్ల రాక నెమ్మదించిందని హెచ్ఎస్‌బీసీ ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారి తెలిపారు. అంతర్జాతీయంగా విక్రయాలు పుంజుకోవడంతో, దానికి తగ్గట్లుగా నియామకాలను కంపెనీలు పెంచుకున్నాయని పేర్కొన్నారు. క్లయింట్ల ఎంక్వయిరీలు అధికంగా ఉండటం, మార్కెటింగ్ చర్యల వల్ల కొన్ని విభాగాల్లో విక్రయాలు పెరిగేందుకు తోడ్పడ్డాయని సర్వే వెల్లడించింది. పోటీ పరిస్థితులు పెరగడం వల్ల వృద్ధిపై ప్రభావం పడిందని కొన్ని కంపెనీలు తెలిపాయి. గత ఆగస్టు తర్వాత అంతర్జాతీయ విక్రయాల్లో వేగవంత వృద్ధి నమోదైనట్లు తెలిపింది. కంపెనీల నిర్వహణ వ్యయాలు గణనీయంగా పెరిగాయని, గత రెండున్నరేళ్లలోనే గరిష్ఠంగా నమోదయ్యాయని వివరించింది. దీంతో ఈ వ్యయాల భారంలో చాలా వరకు క్లయింట్లకే కంపెనీలు బదిలీ చేశాయని పేర్కొంది.

# అమెజాన్‌లో మరోసారి లేఆఫ్‌లు..
# రోబోటిక్స్ టీమ్‌పై వేటు




ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌లో లేఆఫ్‌లు కొనసాగుతున్నాయి. ఈసారి రోబోటిక్స్ విభాగంలోని ఉద్యోగులపై వేటు పడింది. సుమారు 100 మంది వైట్‌కాలర్ ఉద్యోగులపై ప్రభావం పడినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులను ఉటంకిస్తూ 'రాయిటర్స్' తన కథనంలో పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో 16 వేల మంది ఉద్యోగులను అమెజాన్ తొలగించింది. మరిన్ని తొలగింపులు ఉంటాయని అప్పట్లోనే సంకేతాలు ఇచ్చింది. అందులోభాగంగానే ఇప్పుడు తాజా లేఆఫ్‌లు చేపట్టింది. ఇందులోభాగంగా అమెజాన్ గోదాముల్లో పనిని ఆటోమేషన్ చేసేందుకు రోబోలను డిజైన్ చేసే టీమ్‌పై వేటు పడింది. కస్టమర్లకు మెరుగైన సేవలందించేందుకు తమ టీమ్‌ను ఎప్పటికప్పుడు సక్షించుకుంటామని అమెజాన్ ఓ ప్రకటనలో పేర్కొంది. అయితే ఎంతమందిని తొలగించిందీ పేర్కొనకుండా లేఆఫ్‌లను ధ్రువీకరించింది. వేర్‌హౌస్‌లో కార్మికులకు సాయపడేందుకు రోబోటిక్ విభాగమైన బ్లూ జే.. గతేడాది అక్టోబర్‌లో రోబోలను ప్రదర్శించింది. అయితే, ఇది ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో ఈ ఏడాది జనవరిలో వీటి తయారీని నిలిపివేసింది. ఈ నేపథ్యంలోనే ఉద్యోగుల కోతలను ప్రకటించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగ ప్రవేశం, ఖర్చుల తగ్గింపులో భాగంగా గతేడాది అక్టోబర్‌లో 14వేల మందిని, ఈ ఏడాది జనవరిలో 16 వేల మంది కలిపి ఇప్పటికే 30 వేల మంది ఉద్యోగులను అమెజాన్ పక్కనపెట్టింది.

# ఫోన్‌పే విలువ రూ. 81,000-94,500 కోట్లు!




ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే, రాబోయే తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) కోసం సంస్థ విలువను 9–10 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.81,000–94,500 కోట్లు)గా పరిగణించాలని ఆశిస్తోంది. ఐపీఓ ద్వారా కంపెనీ 1.1 బిలియన్ డాలర్లు (రూ.10,000 కోట్లకు పైగా) సకరించాలని భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. 2023లో ఫోన్‌పే 12 బిలియన్ డాలర్ల విలువ వద్ద, 100 మిలియన్ డాలర్లు సకరించింది. దీంతో పోలిస్తే ప్రస్తుతం అంచనా వేస్తున్న సంస్థ విలువ తక్కువే. అయినా కూడా, పోటీ సంస్థ పేటీఎం తర్వాత రెండో అతిపెద్ద ఫిన్‌టెక్ పబ్లిక్ ఇష్యూగా ఫోన్‌పే నిలవనుంది. 2021లో 20 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.4 లక్షల కోట్లు) విలువతో పేటీఎం నమోదైంది. ఫోన్‌పే ఐపీఓ పూర్తిగా ఆఫర్‌ఫర్ సేల్ రూపంలో రానుంది. ఫోన్‌పే ముసాయిదా పత్రాల ప్రకారం.. రూ.10,115 కోట్ల విలువైన షేర్లను వాల్‌మార్ట్, గర్ గ్లోబల్, మైక్రోసాఫ్ట్ గ్లోబల్ ఫైనాన్స్‌లు విక్రయించనున్నాయి.




## సెమీఫైనల్‌లో భారత్ అతడిని ఆడించాలి



టీ20 ప్రపంచకప్‌లో వేదికగా తలపడను తన ప్లేయింగ్ ఆడటానికి ఇంగ్లాండ్ దానికి బదులుగా ఫామ్‌లో ఉన్నాడా? వాన్ అన్నాడు. ఎక్కువగా ఉండేలా

భాగంగా ఈ రోజు టీమ్ఇండియా , ఇంగ్లాండ్ జట్లు సెమీఫైనల్–2లో ముంబయిలోని వాంఖడే స్టేడియంన్నాయి. ఈ నేపథ్యంలో ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ మైఖేల్ వాన్ ఓ కీలకమైన సూచన చేశాడు. టీమ్ఇండియా ఎలెవన్‌లో కుల్‌దీప్ యాదవ్‌కు చోటివ్వాలన్నాడు. 'నేనైతే కుల్‌దీప్ యాదవ్‌ను ఆడిస్తాను. అతడి బౌలింగ్‌లో బ్యాటర్లు ఇబ్బంది పడుతుంటారు. లోయర్ ఆర్డర్‌లో తిలక్ వర్మ, శివమ్ దూబెను ఆడించడం అవసరమా? కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించాలి. అయితే అతడికి ఆడే అవకాశాలు పెద్దగా రాలేదు కాబట్టి.. ప్రస్తుతం లేదో నాకు తెలియదు. కానీ ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌లో అతడిని ఆడిస్తే బాగుంటుంది' అని మైఖేల్ అలాగే కోచ్‌గా గౌతమ్ గంభీర్ వ్యూహాల గురించి అతడు మాట్లాడాడు. 'గౌతమ్ గంభీర్ బ్యాటర్లకు ప్రాధాన్యం ఇస్తాడు. ముఖ్యంగా టీ20లో 7, 8, 9 స్థానాల వరకు బ్యాటర్లు చూస్తాడు. కాబట్టి నేను చెప్పేది జరుగుతుందని నేను అనుకోవడం లేదు.

# రాంచీలో ఓవర్ స్పీడ్‌తో వెళ్లినందుకు ధోనీకి జరిమానా




టీమిండియా మాజీ కెప్టెన్, స్టార్ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీకి జరిమానా పడింది. రాంచీలో పరిమితికి మించి వేగంగా వాహనం నడిపినందుకు ఆయనకు ట్రాఫిక్ పోలీసులు రూ.1000 ఫైన్ వేశారు. తన ఇంటి సపంలో ధోనీ వాహనం వేగంగా వెళ్లడాన్ని నగరంలోని ఆటోమేటెడ్ ట్రాఫిక్ మానిటరింగ్ సిస్టమ్ గుర్తించింది. దీంతో మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 183 కింద అధికారులు ఆయనకు ఈ–చలాన్ జారీ చేశారు.ఈ ఉల్లంఘన చిన్నదే అయినప్పటికీ, ధోనీకి సంబంధించిన విషయం కావడంతో సోషల్ డియాలో, అభిమానుల్లో ఇది చర్చనీయాంశంగా మారింది. రాంచీలో ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్న క్రమంలో ఈ–చలాన్ జారీ అయినట్లు తెలుస్తోంది. కాగా, కొద్ది రోజుల క్రితమే ధోనీ మరో న్యాయపరమైన సమస్యను ఎదుర్కొన్నాడు. నివాసం కోసం కేటాయించిన స్థలాన్ని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలతో జార్ఖండ్ రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఆయనకు నోటీసులు జారీ చేసింది. రాంచీలోని హర్మూ రోడ్డులో ఉన్న ఈ ప్లాట్‌లో ధోనీ గతంలో నివసించాడు. ప్రస్తుతం ఆయన రింగ్ రోడ్డులోని తన కొత్త నివాసంలో ఉంటున్న విషయం తెలిసిందే. ఇలా వరుసగా రెండు ఘటనలతో ధోనీ వార్తల్లో నిలిచాడు.

# రబాడా అరాచకం..బౌండరీ గేట్ దగ్గర పడ్డ బేల్స్



టీ20 వరల్డ్ కప్ సెమీఫైనల్ లో ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. సౌతాఫ్రికా బౌలర్ కగిసో రబాడా వేసిన ఓ బంతికి న్యూజిలాండ్ ఆటగాడు టిమ్ సీఫెర్ట్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. అయితే ఆ బంతి వేగానికి వికెట్ల బేల్స్ బౌండరీ గేటు దగ్గర పడ్డాయి. దీనికి సంబంధించిన ఫోటో సోషల్ డియాను షేక్ చేస్తోంది. ఇక ఈ ఫోటోను చూసిన క్రికెట్ అభిమానులు షాక్ అవుతున్నారు. కగిసో రబాడా చాలా కసిగా బౌలింగ్ చేశాడని.. ఇంత ఫాస్ట్ బౌలింగ్ తామె ఎప్పుడూ చూడలేదని క్రికెట్ అభిమానులు కూడా కామెంట్స్ చేస్తున్నారు. బౌండరీ గేటు దగ్గర బేల్స్ పడడం చరిత్రలోనే తొలిసారి అంటున్నారు. దీంతో ఈ న్యూస్ హాట్ టాపిక్ అయింది. టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్స్ బరిలో న్యూజిలాండ్ నిలిచింది. ఈడెన్ గార్డెన్స్ లో తప్పక గెలవాల్సిన మ్యాచ్ లో సౌతాఫ్రికా చేతులెత్తేసింది. న్యూజిలాండ్ చేతిలో ఏకంగా తొమ్మిది వికెట్ల తేడాతో దారుణంగా ఓడిపోయింది సౌతాఫ్రికా. ఈతరుణంలో న్యూజిలాండ్ ఫైనల్ కు చేరుకుంది. మార్చి 8వ తేదీన టీ20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ ఉంటుంది. ఈ మ్యాచ్ అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఉండనుంది. కాగా భారత్, ఇంగ్లాండ్ లలో గెలిచిన జట్టు ఫైనల్ కు చేరుతుంది. ఇదిలా ఉండగా, తొలిసెస్‌లో సౌతాఫ్రికా మొదట బ్యాటింగ్ చేసి, 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు సాధించింది. ఇక ఈ లక్ష్యాన్ని ఒకే ఒక్క వికెట్ కోల్పోయి ఛేదించింది కివీస్. దీంతో ఫైనల్స్ లో అడుగు పెట్టింది న్యూజిలాండ్. టీ20 వరల్డ్ కప్ 2026 సెస్ దాకా అద్భుతంగా రాణించిన సౌతాఫ్రికా, ఇంటి దారి పట్టడం ఫ్యాన్స్ జీర్ణించుకోలేకపోయింది.

# సమిష్టిగా రాణిస్తేనే ఫైనల్ బెర్త్



టీమిండియా మరో కీలక పోరుకు సిద్ధమైంది. వాంఖడే స్టేడియంలో జరిగే టి20 ప్రపంచకప్ రెండో సెమీఫైనల్లో భారతజట్టు ఇంగ్లండ్‌తో తలపడనుంది. గురువారం జరిగే ఈ సెస్‌లో విజేతగా నిలిచిన జట్టు ఆదివారం జరిగే ఫైనల్లో టిల్ పోరుకు అర్హత సాధించనుంది. ఈ మెగా టోర్నీలో టీమిండియా ఆశించిన స్థాయిలో రాణించలేదు. లీగ్ దశలో సునాయాస విజయాలను నమోదు చేసుకున్నా.. నిర్ణయాత్మక సూపర్–8లో దక్షిణాఫ్రికా చేతిలో అనూహ్యంగా ఓటమిపాలైంది. తాడో పేడో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను చిత్తుచేసి సెస్ బెర్త్ సంపాదించింది. గ్రూప్ దశలో అమెరికా, నబియా, పాకిస్తాన్, నెదర్లాండ్స్ జట్లను ఓడించి అజేయంగా సూపర్–8కు చేరుకుంది. సూపర్–8లో తొలి మ్యాచ్‌లోనే సౌతాఫ్రికా చేతిలో చిత్తుగా ఓడిన సూర్యకుమార్ సేన.. ఆ తర్వాత జింబాబ్వే, వెస్టిండీస్‌లను ఓడించి సెస్‌కు అర్హత సాధించింది. ఈ క్రమంలో గురువారం జరిగే రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో తలపడనుంది. ఇప్పటికే ముంబయి చేరుకున్న భారత ఆటగాళ్లు ప్రాక్టీస్‌లో చెమటోడ్చారు. ఇషాన్ కిషన్, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, బుమ్రా నెట్‌ప్రాక్టీస్‌లో నిమగ్నమయ్యారు. బ్యాటింగ్‌లో సంజు శాంసన్ ఫామ్‌లోకి రావడం శుభ పరిణామం కాగా.. సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ.. ఇలా ప్రతి ఒక్కరు ఫామ్‌లోనే ఉన్నారు. బౌలింగ్‌లో బుమ్రాకి తోడు వరుణ్ చక్రవర్తి సత్తా చాటితే టీమిండియా ఫైనల్‌కు చేరడం ఖాయం.

టీ20 క్రికెట్‌లో దక్షిణాఫ్రికా స్టార్ ఓపెనర్ క్వింటన్ డి కాక్ కీలక సమయంలో పెవిలియన్ చేరడం, జట్టుకు బలమైన ఆరంభం ఇవ్వాల్సిన సమయంలో విఫలమవ్వడం అభిమానులను నిరాశకు గురి చేసింది. రికెల్టన్ కూడా వెంటనే అవుట్ కావడం దక్షిణాఫ్రికా బ్యాటింగ్ లైన్‌పై ఒత్తిడి పెంచింది.మొత్తంగా ఈడెన్ గార్డెన్స్ డి కాక్‌కు సవాలు మాత్రమే కాక, అతని విఫల రికార్డ్ సెమీఫైనల్‌లో కూడా కొనసాగింది. డి కాక్ తక్కువ స్కోరు చేసిన కారణంగా దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 169 పరుగులు మాత్రమే చేసింది. యాన్సెన్ (55) హాఫ్ సెంచరీతో బలమైన ప్రదర్శన ఇచ్చాడు, కానీ డేవాల్డ్ బ్రెవిస్ (34), ట్రిస్టన్ స్టబ్స్ (29) ఫర్వాలేదు. ఐడెన్ మార్క్రమ్ (18), డి కాక్ (10), రికెల్టన్ (0), డేవిడ్ మిల్లర్ (6), కార్బిన్ బాష్ (2) మొత్తం విఫలమయ్యారు.న్యూజిలాండ్ బౌలర్లలో హెన్రీ 2, మెక్‌కాంచి 2, రచిన్ రవీంద్ర 2 వికెట్లు పడగొట్టగా, కివీస్ 11 ఓవర్లలో 137 పరుగుల వద్ద గెలుపునకు దూసుకెళ్తున్నారు.


## ఫ్యాన్స్ గణాంకాలను చూసి షాక్ అవ్వాల్సిందే!



క్వింటన్ డి కాక్ బలం గుర్తించబడతాడు. పిచ్ ఏదైనా, బౌలర్ ఎవరైనా, ఇన్నింగ్స్ ప్రారంభం నుంచే డి కాక్ ధాటిగా ఆడుతూ జట్టుకు అద్భుతమైన ప్రారంభం అందిస్తాడు.బౌండరీలు, సిక్సులు బాదుతూ బౌలర్లపై ఒత్తిడి సృష్టించడంలో అతడు నిపుణుడు.కానీ, కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్ మైదానంలో అతను గణనీయంగా విఫలమయ్యాడు. ఇక్కడ అతని గణాంకాలను ?? మైండ్ బ్లాక్ అనిపించాల్సిందే. ఇప్పటివరకు 10 ఇన్నింగ్స్ ఆడిన డి కాక్ కేవలం 95 పరుగులు మాత్రమే సాధించాడు. సగటు 9.5గా, స్ట్రైక్ రేట్ 110.46గా ఉంది. అతని అత్యధిక స్కోరు కేవలం 28 పరుగులే.టీ20 వరల్డ్ కప్ 2026 సెమీఫైనల్‌లో న్యూజిలాండ్ బౌలర్ కోల్ మెక్‌కాంచీ డి కాక్‌తో పాటు రయన్ రికెల్టన్‌ను వరుసగా అవుట్ చేయడం ద్వారా మ్యాచ్ దిశను మార్చాడు. ముఖ్యంగా డి

# డేవిడ్ వార్నర్ భార్య వివాదం..
## లైవ్ షోలో ఆస్ట్రేలియా మాజీ స్టార్ ఆగ్రహం

ఆస్ట్రేలియా క్రికెట్ వర్గాల్లో తాజాగా ఓ పాడ్‌కాస్ట్ వివాదం సంచలనంగా మారింది. మాజీ లెగ్ స్పిన్నర్ స్టువర్ట్ మెక్‌గిల్, స్పోర్ట్స్ జర్నలిస్ట్, పాడ్‌కాస్ట్ హోస్ట్ హోస్ట్ ఆండ్రే మెన్జెల్‌తో లైవ్ షోలో తీవ్ర వాగ్వాదానికి దిగాడు.ఈ ఘటన అభిమానుల్లో పెద్ద చర్చకు దారితీసింది. ఈ వివాదం క్రికెట్ అన్‌ఫిల్టర్ పాడ్‌కాస్ట్‌లో చోటుచేసుకుంది. ఆస్ట్రేలియా 2018 దక్షిణాఫ్రికా టూర్‌పై చర్చ జరుగుతుండగా, అప్పట్లో డేవిడ్ వార్నర్ భార్యపై జరిగిన ఘటనను మెన్జెల్ ప్రస్తావించాడు.ఆ సమయంలో దక్షిణాఫ్రికా ప్రేక్షకులు కాండిస్ వార్నర్‌ను ఎగతాళి చేస్తూ మాస్కులతో ప్రదర్శన చేసిన విషయం అప్పట్లో తీవ్ర విమర్శలకు గురైంది. ఈ ఘటనను మెన్జెల్ తిరిగి గుర్తు చేస్తూ, అటువంటి ప్రవర్తన తప్పని ఖండించాడు. అయితే, ఎనిమిదేళ్ల క్రితం జరిగిన సంఘటనను మళ్లీ లేవనెత్తడంపై మెక్‌గిల్ తీవ్రంగా ఆగ్రహించాడు. 'ఇలా మళ్లీ మళ్లీ చెప్పడం వల్ల బాధితులకు మళ్లీ గాయం చేసినట్లే' అంటూ మండిపడ్డాడు. కోపంలో మెన్జెల్‌ను




'ఇడియట్', 'మోరాన్' అంటూ దూషించాడు. అంతేకాదు, ఈ భాగాన్ని ఎడిట్ చేస్తే తాను ఇకపై ఈ షోలో పనిచేయనని మెక్‌గిల్ హెచ్చరించి తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. దీంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. వివాదం ముదిరిపోవడంతో మెన్జెల్ హఠాత్తుగా కార్యక్రమాన్ని ముగించాల్సి వచ్చింది. ఆ ఎపిసోడ్ అసౌకర్య వాతావరణంలోనే ముగిసింది. ఈ ఘటనపై క్రికెట్ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు మెక్‌గిల్ వార్నర్ కుటుంబంపై తనకు ఉన్న సాన్నిహిత్యం కారణంగా ఇలా స్పందించాడని సమర్థిస్తున్నారు. మరికొందరు మాత్రం పబ్లిక్ ప్లాట్‌ఫామ్‌పై సహ హోస్ట్‌ను ఇలా దూషించడం సరికాదని విమర్శిస్తున్నారు. అయితే, 2018లో ఆస్ట్రేలియా–దక్షిణాఫ్రికా టూర్ సమయంలో సౌతాఫ్రికా స్టేడియాల్లో కొందరు ప్రేక్షకులు డేవిడ్ వార్నర్ భార్య కాండిస్‌ను లక్ష్యంగా చేసుకుని అవమానకరంగా ప్రవర్తించారు. ఆమె గతంలో రగ్బీ స్టార్ సోనీ బిల్ విలియమ్స్‌తో ఉన్న పాత ఫోటోను ఆధారంగా చేసుకుని, అభిమానులు అతడి ముఖం మాస్కులు పెట్టుకుని స్టేడియంలో కూర్చొన్నారు. సఫారీ ఫ్యాన్స్ తీరుపై ఆసీస్ బోర్డు కూడా తీవ్రంగానే స్పందించింది. డియా, మాజీ క్రికెటర్లు కూడా ఈ ఘటనను అప్పట్లో తీవ్రంగా ఖండించారు.

# వుదయం సినిమా

# వృషకర్మ నా కెరీర్లో బెస్ట్ మూవీ

## నాగ చైతన్య





యువ సామ్రాట్ నాగ చైతన్య, 'విరూపాక్ష' ఫేం కార్తీక్ దండుతో కలిసి నెవర్ బిఫోర్ మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ'తో డిఫరెంట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ చిత్రాన్ని ఎస్ వి సి సి, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బాపినీడు సమర్పిస్తున్నారు. బిహైండ్ ది సీన్ వీడియోలు, ఫస్ట్ లుక్ తో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఈ రోజు, మేకర్స్ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను లాంచ్ చేశారు. ఈవెంట్ లో యువ సామ్రాట్ నాగ చైతన్య మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. వృషకర్మ గ్లింప్స్ లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. కార్తీక్ చెప్పినట్టు ఇది నా కెరీర్లో 100% బెస్ట్ మూవీ కాబోతుంది. స్క్రిప్ట్ విన్నప్పుడే అనిపించింది. ఇంత పెద్ద స్కేల్ లో మిథికల్ థ్రిల్లర్ సినిమా చేయాలని ఎప్పటినుంచో ఉండింది. ఆ కోరిక ఈ సినిమాతో తీరింది. స్క్రిప్ట్ విన్నప్పుడే మైండ్ బ్లోయింగ్ అనిపించింది. కార్తీక్ బ్రిలియంట్ ఫిలిం మేకర్. కథ విన్నప్పుడే లార్జర్ దెన్ లైఫ్ సినిమా అనిపించింది. నిర్మాతలు ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా సినిమాని రూపొందించారు. కార్తీక్ గురించి లైఫ్ లాంగ్ మాట్లాడుతూనే ఉంటాను. ఎందుకంటే తన అంత మంచి సినిమా ఇచ్చాడు. అంచనాలన్నిటిని ఈ సినిమా అందుకుంటుంది. ఈ సినిమా చివరి 30 నిమిషాలు క్లైమాక్స్ ఇండియన్ సినిమాలో ఒక బెంచ్ మార్క్ అవుతుంది. అది నా ప్రామిస్. స్వర్ఢ్ అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. మీనాక్షి, జయరాం గారు, సత్య అందరూ అద్భుతమైన నటీనటులు ఉన్నారు. రాజీవ్ అద్భుతమైన వీఎఫ్ క్స్ ఇచ్చాడు. అజినీస్ మ్యూజిక్, నాగేంద్ర గారి ప్రొడక్షన్ డిజైన్ చాలా గ్రాండ్ గా వుంటాయి. టీం అందరికీ థాంక్ యూ'అన్నారు.

# ఉస్తాద్ భగత్ సింగ్ 19న విడుదల

బ్లాక్‌బస్టర్ కలయికలో వస్తున్న ఈ సినిమా అనుభవాన్ని సంగీత ద్వయం దేవి శ్రీ ప్రసాద్, ఎస్. తమన్ మరోస్థాయికి తీసుకొని వెళ్తున్నారు. 'ఉస్తాద్ భగత్ సింగ్' కేవలం సినిమా మాత్రమే కాదు, ఇది అభిమానులకు ఒక గొప్ప వేడుకగా, జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకంగా నిలవబోతోంది.

థియేటర్లో పవర్ స్టార్ తుఫాన్ కాస్త ముందుగానే రాబోతోంది. సినీ ప్రియులంతా అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా అనుకున్న దానికంటే ముందుగానే ప్రేక్షకులను అలరించడానికి వచ్చేస్తోంది. ఈ చిత్రాన్ని మార్చి 19వ తేదీన విడుదల చేయనున్నట్లు తాజాగా చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. వరుసగా వచ్చే లాంగ్ వీకెండ్లు, దాదాపు రెండు వారాల పాటు ఉండే సెలవుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ సంచలన నిర్ణయం తీసుకున్నారు.పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీశ్ శంకర్ కలయికలో వస్తున్న మరో భారీ ఎంటర్‌టైనర్ ఇది. గతంలో 'గబ్బర్ సింగ్'తో వీరు బాక్సాఫీస్ వద్ద చరిత్ర సృష్టించారు. ఆ మ్యాజిక్‌ను తిరిగి సృష్టించడానికి, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మరిచిపోలేని థియేటర్ అనుభవాన్ని అందించడానికి ఈ ద్వయం సిద్ధమవుతోంది.'ఉస్తాద్ భగత్ సింగ్' నేపథ్య సంగీతం బాధ్యతలను ఎస్. తమన్ కు అప్పగించారు. దేవి శ్రీ ప్రసాద్ అందించిన పాటలు ప్రేక్షకులను డ్యాన్స్ చేయిస్తే, తమన్ తన నేపథ్యసంగీతంతో సినిమాని మరో స్థాయికి తీసుకెళ్ళనున్నారు. ఎలాంటి ఆలస్యం లేకుండా పనులు సజావుగా సాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. పరస్పర చర్చల అనంతరం సినిమా ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ మార్పు చేయడం జరిగింది. 'గబ్బర్ సింగ్' తరువాత పవన్ కళ్యాణ్, హరీశ్ శంకర్ కలయికలో వస్తున్న సినిమా కావడంతో 'ఉస్తాద్ భగత్ సింగ్'పై అంచనాలు భారీస్థాయిలో ఉన్నాయి. ఇప్పటి వరకు ఈ సినిమా నుంచి విడుదలైన ప్రతి కంటెంట్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ప్రచార చిత్రాలు సంచలనంగా మారి, అన్ని సామాజిక మాధ్యమాల్లో ట్రెండ్ అవుతూ భారీ బజ్ సృష్టించాయి. 'దేఖ్ లేంగే సాలా', 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పాటలు చార్ట్ బస్టర్‌లుగా నిలిచాయి.








# లీడర్ టీజర్ రిలీజ్

లెజెండ్ శరవణన్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "లీడర్". ఈ చిత్రాన్ని లెజెండ్ శరవణ స్టోర్స్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తోంది. దర్శకుడు ఆర్ ఎస్ దురై సెంథిల్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో పాయల్ రాజ్ పుత్ హీరోయిన్ గా నటిస్తోంది. "లీడర్" సినిమా ఏప్రిల్ లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా టీజర్ రిలీజ్ చేశారు. "లీడర్" మూవీ టీజర్ ఎలా ఉందో చూస్తే నా కూతురితో పాటే నేనుండాలి, దాని కోసం ఈ ప్రపంచాన్ని ఎదిరించమన్నా ఎదిరించి గెలుస్తాను అనే పవర్ ఫుల్ డైలాగ్ తో టీజర్ ప్రారంభమవుతుంది. తన కుటుంబం కోసం చేసిన పోరాటంలో హీరో ఖైదీగా మారడం, జైలులో కూతురినే గుర్తుతెచ్చుకుంటూ బాధపడటం టీజర్ లో చూపించారు. హీరో భార్య క్యారెక్టర్ లో పాయల్ రాజ్ పుత్ నటిస్తోంది. ఈ అందమైన కుటుంబంలో ఎవరు తమ స్వార్థం కోసం చిచ్చు పెట్టారు అనేది టీజర్ లో ఆసక్తి కలిగిస్తోంది. తన కుటుంబానికి జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకునే శక్తివేల్ అనే క్యారెక్టర్ లో హీరో శరవణన్ ఇంటెన్స్ పర్ ఫార్మెన్స్ కనబర్చారు. ఆయన చేసిన భారీ యాక్షన్ సీక్వెన్సులు టీజర్ కు ఆకర్షణగా నిలుస్తున్నాయి. మాస్, యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లర్ ఎలిమెంట్స్ తో "లీడర్" సినిమా ప్రేక్షకుల్ని ఎంగేజ్ చేయబోతున్నట్లు టీజర్ తో తెలుస్తోంది.

# వెంకన్న పాదాలు రక్షించే అభయ వేదాలు



నమ్ముకున్న వారి ఇంట సిరి సౌభాగ్యాలు కురిపించే ఐశ్వర్య లక్ష్మీ చిరు నవ్వుల నాదాలు.. ఈ విషయం ... తెలుగునాట తిరుమల తిరుపతి పద్మావతి అలివేలు మంగా సమే త శ్రీనివాస చరణారవింద శరణాగతులు అందరికీ అనుభవైక వేద్యమైన అనుభూతి!! స్వామి వారి శక్తికి.. ఆర్తరక్షణా యుక్తికి తెలుగునాట లక్షల కుటుంబాలకు ఇలవేల్పు సిరితాల్పు అయిన ఆ శేషాద్రి వాసుడు..ఏడు కొండలవాడు..వెంకటరమణుడు..గోవిందుడు.. అలానే ..తెనాలి కి చెందిన చదలవాడ వారి కుటుంబానికి కూడా ఆ ఆనందానిలయ వైకుంఠధాముడే రక్ష అని మనసా వాచా నమ్మి షోడశోపచార నవవిధ భక్తులతో అను నిమిషం కొలిచింది ఆ కుటుంబం.





ఆ శ్రీ నివాస వర కృపా కటాక్షానికి నిదర్శనంగా ఆ ఇంట పుట్టిన త్రిమూర్తులకు వేంకటేశ్వర రావు, తిరుపతి రావు, శ్రీనివాసరావు పేర్లు పెట్టుకుని భక్తిప్రపత్తులతో పులకించి పరవశించారు ఆ తల్లి తండ్రులు... సోదర త్రయం లో సోదర ద్వయం అయిన తిరుపతిరావు గారు శ్రీనివాసరావు గారు తిరుమల పెరుమాళ్లు దయా దృష్టితో కలప వ్యాపారంలో అంచెలంచెలుగా ఎదిగి అగ్రస్థానానికి చేరారు.

**చదలవాడ వారి ఇంట జరిగిన ఈ తాజా ఘటన..**

కొంగుబంగారమై నిలిచే కలియుగ దైవం ఘటనా ఘట సమర్థతకు నిలువెత్తు నిదర్శనం. ఇటీవల కలప వ్యాపారంలో నిత్య కార్యక్రమాలలో భాగంగా ఫిబ్రవరి 28 శని వారం నాడు కార్మికులు ఓ కలప దుంగను కోతకు సిద్ధం చేశారు.

ఆరోజు చదలవాడ వారి ఇంట వెంకన్న తన లీలా వినోదాన్ని చాటేందుకు ఆ కలప దుంగలో లోకాలకు శరణాగతి అయిన పవిత్ర చరణాల ను నిక్షిప్తం చేశారని వారికి తెలియదు.వారు కోత మిషన్ ఎక్కించారు... ఆ కలప దుంగను అప్పుడా క్షణాల లో జరిగింది ఓ అద్భుతం! ఆ దుంగలో నుండి ఏడేడు లోకాలు యేలేటి ఏడేడు శిఖరాల వెంకన్న పవిత్ర చరణాలు సహస్ర కోటి సూర్య కిరణాలతో ఉద్భవించాయి!!

అంతే ఆ కార్మికుల నయనాలు ఆ వెలుగును చూడలేక ఆశ్చర్యంతో అ ప్రయత్నంగా మూతపడ్డాయి!! ఒక్క క్షణం వారు జరిగింది గ్రహించారు.

అంతే ఒక్కసారి వారు అందరూ ఏదో అదృశ్యశక్తి అవహించినట్టు...ఒక్కసారే వారి గొంతులనుండి ఏడుకొండలవాడా వెంకటరమణా గోవిందా గోవిందా!! అనే శరణాగతి తో ఏషియన్ టింబర్స్ ఆవరణ ప్రతిధ్వనించింది. అంతే నిమిషాలలో తిరుపతిరావు , శ్రీనివాస రావు సోదర ద్వయానికి ఈ వార్త చేరింది. వారు తమ వయసు కూడా లెక్క చేయకుండా పరుగు పరుగునా వచ్చారు. స్వయంభూ గా అవతరించిన శ్రీనివాస చరణారవిందాలకు సాష్టాంగ ప్రణామాలు అర్పించారు. ఈ వార్త తెలిసి ప్రజలు చదలవాడ వారి ఇంట కలియుగదైవం కోరి కొలువై వారి ఇంటిని కలియుగ వైకుంఠం గా మార్చారని చెప్పుకుంటున్నారు!! మనం కూడా ఒక్క సారి ఆ శ్రీనివాసుని నామం భక్తి తో పలికి పులకిద్దాం!! ఏడుకొండలవాడా వెంకటరమణా గోవిందా...... గో...విం.....దా

# మృత్యుంజయ్ రేపే విడుదల



కంటెంట్ కింగ్ శ్రీ విష్ణు హీరోగా హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వం వహించిన చిత్రం 'మృత్యుంజయ్'. ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌ని లైట్ బాక్స్ మీడియా, పిక్చర్ పర్ఫెక్ట్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్లపై సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మించారు. 'సామజవరగమన'తో బ్లాక్ బస్టర్ హిట్ పెయిర్‌గా నిలిచిన శ్రీ విష్ణు, రెబా మోనికా జాన్ ఈ చిత్రంతో మరోసారి అలరించేందుకు సిద్దంగా ఉన్నారు. క్రియేటివ్ ఫిల్మ్ మేకర్ సుకుమార్ ఆల్రెడీ ఈ మూవీని వీక్షించి మంచి రివ్యూని ఇచ్చారు. రేపు థియేటర్లలో ఈ చిత్రాన్ని చూడటానికి అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో నేచురల్ స్టార్ నాని ఈ మూవీని వీక్షించి తన బ్లాక్ బస్టర్ రివ్యూని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. మంచి సినిమాలను ఎల్లప్పుడూ ప్రోత్సహించే నటుడు, తన బిజీ షెడ్యూల్ నుండి 'మృత్యుంజయ్'ని చూడటానికి సమయం కేటాయించారు. నాని తన స్నేహితుడు శ్రీ విష్ణును ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో ఇచ్చిన రివ్యూ ఇప్పుడు వైరల్ అవుతోంది. తన తొలి ప్రాజెక్ట్ బ్లాక్ బస్టర్ విజయం సాధించబోతోన్నందుకు నిర్మాత సందీప్ గుణ్ణమ్‌ని కూడా నాని కూడా అభినందించారు.

# రవం టైటిల్ సాంగ్ లాంచ్ చేసిన హీరో శ్రీకాంత్ !



తారక్ ఫిలిం హౌస్ బ్యానర్ పై హీరో ప్రశాంత్ రాదారపు హీరోయిన్ అనుశ్రీ నటించిన చిత్రం రవం. సస్పెన్స్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ సినిమా మర్చి 6న ఆహాలో విడుదల కాబోతోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ ను ప్రముఖ దర్శకుడు వివి.వినాయక్ ఇటీవల విడుదల చేశారు, తాజాగా ఈ చిత్ర టైటిల్ సాంగ్ ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు ఈ సందర్భంగా హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ ''మంచి కన్సెప్ట్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న రవం సినిమా విజయం సాధించి చిత్ర యూనిట్ సభ్యులందరికి మంచి పేరు రావాలని''అన్నారు . డైరెక్టర్ శ్రీరామ్ మన్నార్ ఈ చిత్రాన్ని చాలా గ్రిప్పింగ్ స్క్రీన్ ప్లే తో తెరకేక్కించారు, ప్రతీ ఒక్కరికి కనెక్ట్ అయ్యే అంశాలు ఈ సినిమాలో ఉండబోతున్నాయి. రవం చిత్రానికి నిర్మాత మరియు సంగీతం పడాల తారక రామారావు అందించారు, మంచి నిర్మాణ విలువలతో ఈ సినిమాను రూపొందించారు, సాంకేతిక పరంగా సినిమా బాగుంది, ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కరాటే కళ్యాణి.

## ఏప్రిల్ 3న రిలీజ్‌కు రెడీ అవుతున్న

# కార్మేని సెల్వం



పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్, బడవ గోపీ, కోతండం, కరణ్ చక్రవర్తి, శంకర నారాయణ్ వి, హరిత పరాకోడ్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ చేయనున్నట్లు గురువారం ప్రకటించారు. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ఈ చిత్రానికి అధికారిక థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ పార్ట్‌నర్‌గా చేరింది. దేశవ్యాప్తంగా పీవీఆర్ సంస్థ తమ విస్తరణను మరింత బలపరుచుకుంటున్న నేపథ్యంలో 'కార్మేని సెల్వం' సినిమాను భారీ స్థాయిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆధునిక కాలానికి అనుసంధానమైన ఈ కథ ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో మంచి ఆసక్తిని రేకెత్తించింది. త్వరలో విడుదల కాబోయే టీజర్‌తో ప్రేక్షకుల్లో మరింత క్యూరియాసిటీని పెంచాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రం నిజాయితీతో జీవించే ఒక సాధారణ కార్ డ్రైవర్ సెల్వం జీవితం చుట్టూ తిరుగుతుంది. ఆధునిక సమాజంలో ఎదురయ్యే ఒత్తిళ్ల మధ్య అతడు ఎలా ముందుకు సాగుతాడు అనే అంశాన్ని భావోద్వేగభరితంగా చూపించనున్నారు. ఒక సాధారణ మనిషి మనసులోని మాటగా ప్రారంభమయ్యే ఈ కథ, నిజాయితీ మరియు జీవన పోరాటం మధ్య ఉన్న సున్నితమైన సమతుల్యాన్ని ప్రతిబింబించే హై స్టేక్స్ డ్రామాగా మారుతుంది.

ఈ చిత్రంపై దర్శకుడు రామ్ చక్రి మాట్లాడుతూ .. "కార్మేని సెల్వం' ఒక సాధారణ మనిషి కథ. ఈ కథను తెలుగు, తమిళ ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం చాలా ఆనందంగా ఉంది. అలాగే పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ మా చిత్రానికి థియేట్రికల్ పార్ట్‌నర్‌గా ఉండటం వల్ల ఈ కథ మరింత పెద్ద స్థాయిలో ప్రేక్షకులకు చేరుతుందని నమ్ముతున్నాం' అని తెలిపారు.

# బైకర్ ఏప్రిల్ 3న రిలీజ్

చార్మింగ్ స్టార్ శర్వా అడ్రెనలిన్ ఫిల్డ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ బైకర్, భారతదేశంలోనే మొదటి మోటోక్రాస్ స్పెక్టాకిల్‌గా రూపొందుతోంది. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని యువి క్రియేషన్స్ నిర్మిస్తోంది. కుటుంబ భావోద్వేగాలతో కూడిన యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ సినిమా ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. మేకర్స్ ఇప్పుడు మరో ఆసక్తికర అప్‌డేట్ ఇచ్చారు. ఈ చిత్రం డాల్బీ సినిమా, ఈపిఐక్యూ , 4డిఎక్స్, పిసిఎక్స్ వంటి ప్రీమియం ఫార్మాట్లలో కూడా విడుదల కానుంది. దీంతో ప్రేక్షకులకు మరింత ఇమర్సివ్ థియేట్రికల్ అనుభూతి అందించనుంది.



# శ్రీరామనవమికి బ్యాండ్ మేళం



'కోర్ట్' చిత్రంతో మెప్పించిన హర్ష్ రోషన్, శ్రీదేవి జంట మళ్లీ 'బ్యాండ్ మేళం' అంటూ ఆడియెన్స్ ముందుకు రానుంది. బ్లాక్ బస్టర్ రచయిత కోన వెంకట్ నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంది. మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కావ్య, శ్రావ్య ఈ మూవీని నిర్మించారు. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాని మార్చి 26న రిలీజ్ చేయబోతోన్నారు. ఇప్పటి వరకు వదిలిన కంటెంట్ ఆడియెన్స్ లో ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే.

'బ్యాండ్ మేళం' టీజర్, ట్రైలర్, మాస్ పెప్పీ సాంగ్ 'తిప్పూ కుంటున్నావ్', మంచి మెలోడీ సాంగ్ 'పల్లె లోని సందల్లన్ని మీవే' వంటివి ఆడియెన్స్‌లో సినిమా పట్ల అంచనాల్ని పెంచేసింది. యూత్ ఆడియెన్స్‌లో ఇప్పటికే మంచి బజ్‌ను క్రియేట్ చేసుకున్న ఈ చిత్రం శ్రీరాముడి ఆశీస్సులతో శ్రీరామ నవమి సందర్భంగా రిలీజ్ కాబోతోంది. మార్చి 26న ఈ సినిమాని గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు మేకర్లు ప్లాన్ చేశారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.